


'నా అక్కలూ.. చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50



అర్బన్ అగ్రికల్చర్ అదుర్స్

హైదరాబాద్‌లో పెరుగుతున్న మిద్దె తోటల సాగు

- ఇటీవలి కాలంలో వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకూ విస్తరణ
- కూరగాయల కంటే సేంద్రియ ఆకుకూరల సాగుపై అత్యధికుల ఆసక్తి..
- మిద్దె తోటల సాగుదారుల్లో మహిళలు 61%.. యువత 29%
- 83-89% మందిలో మెండుగా మిద్దె సాగు నైపుణ్యాలు
- వంటింటి వ్యర్థాలతో కంపోస్టు తయారు చేస్తున్న 84% మంది
- పీజేటీఏయూ విద్యార్థి అధ్యయనంలో వెల్లడి
- పుష్కర కాలం క్రితమే 'ఇంటిపంట' శీర్షిక ద్వారా 'సాక్షి' ప్రచారోద్యమం

నానాటికీ కాంక్రీటు అరణ్యంగా మారిపోతున్న హైదరాబాద్ నగరంలో అనేకమంది, ఎక్కువగా సొంత ఇంటి యజమానులు తమ ఇంటి మిద్దె (టెర్రస్)ల పైనే వివిధ రకాల సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండిస్తున్నారు. సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న కొద్దీ ఈ విధంగా సేంద్రియ ఇంటి పంటలు లేదా మిద్దె తోటల (టెర్రస్ కిచెన్ గార్డెనింగ్) సాగు వైపు మొగ్గు చూపే వారి సంఖ్య పెరిగిపోతుంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే విరివిగా ఇలా పంటలు పండిస్తుండగా ఇటీవలి కాలంలో వరంగల్, కరీంనగర్ వంటి నగర పాలక సంస్థల పరిధిలోనూ ప్రారంభమై విస్తరిస్తోంది. వాస్తవానికి టెర్రస్‌లపై సేంద్రియ కూరగాయలు, పండ్ల సాగుపై పుష్కర కాలం క్రితమే 'సాక్షి' దినపత్రిక 'ఇంటిపంట' శీర్షిక ద్వారా ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. వీటి ప్రాధాన్యత విషయంలో తెలుగు రాష్ట్రాల ప్రజలకు అవగాహన కల్పించింది. నిపుణులతో ఉచిత శిక్షణా తరగతుల నిర్వహణతో హైదరాబాద్ నగరంలో వేలాది మంది సేంద్రియ మిద్దె తోటల సాగులో నైపుణ్యం పొందేలా చేసింది. అయితే ప్రస్తుతం సేంద్రియ ఇంటిపంటలు లేదా మిద్దె తోటలు సాగు చేస్తున్న నగరవాసుల్లో అర్బన్ అగ్రికల్చర్ (పట్టణ వ్యవసాయం) నైపుణ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయి? ఏయే రకాల పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు? వంటింటి వ్యర్థాలను చెత్తలో పారేయకుండా కంపోస్టు ఎరువుగా మార్చుకుంటున్న వారి శాతం ఎంత? ఎన్నో ఏళ్లుగా అర్బన్ ఫార్మర్ (పట్టణ రైతు)గా ఉన్నప్పటికీ వీరిలో లోపిస్తున్న నైపుణ్యాలేమిటి? వంటి పలు ఆసక్తికరమైన ప్రశ్నలకు ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ)లోని విస్తరణ విద్యా విభాగానికి చెందిన అగ్రికల్చర్ ఎమ్మెస్సీ విద్యార్థి జి.చరణ్ తేజ సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు.

..:: సాక్షి సాగుబడి ::..

3 నగరాల్లో అధ్యయనం

చరణ్ తేజ మిద్దె తోటలు విస్తారంగా సాగవుతున్న హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ నగరాల్లో మొత్తం 120 మంది టెర్రస్ కిచెన్ గార్డెనర్లపై అధ్యయనం చేశారు. ఇందులో అనేక అంశాల్లో సేంద్రియ ఆకుకూరలు సాగుపై ఎక్కువ మంది గార్డెనర్లు ఆసక్తి చూపుతున్నారనేది ఒకటి. కాగా ఈ అధ్యయనానికి సంబంధించి ప్రొఫెసర్లు పి.విజయలక్ష్మి, డా.బి.సవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.మీనాతో కలసి చరణ్ తేజ రాసిన మూడు పరిశోధనా వ్యాసాలు జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. అధ్యయనంలోని ముఖ్యాంశాలు..



76 శాతం అనుభవజ్ఞులే

- 3 నుంచి 9 ఏళ్ల క్రితం నుంచి ఇంటిపంటల సాగు చేపట్టిన నగరవాసులు ఏకంగా 76% ఉన్నారు. 15 ఏళ్ల అనుభవం ఉన్నవారు 16%, 20-21 ఏళ్ల అనుభవం కలిగిన వారు 7% ఉన్నారు.
- కుటుంబం అంతా కలసి తోట పనులు చేసుకుంటున్నవారు 53% ఉండగా, ఇంట్లో ఎవరో ఒక్కరు ఆసక్తితో చేస్తుంటే.. వారికి అడపా దడపా సాయం చేసే

మిగతా IIవ పేజీలో ▶

మిద్దె సేద్యంలో 51% నడి వయస్కులే

- సేంద్రియ ఇంటిపంటలు సాగు చేపట్టిన వారిలో 61% మంది మహిళలు కాగా, మిద్దె తోటలు సాగు చేస్తున్న వారిలో 51% నడి (35-50 ఏళ్ల) వయస్కులు ఉన్నారు. 50 ఏళ్లు దాటిన వారి (20%) కంటే యువజనులే ఎక్కువ (29%).
- సేంద్రియ ఇంటిపంటల సాగుకు సంబంధించిన 20 అంశాల్లో 52% మంది టెర్రస్ గార్డెనర్లకు అధిక పరిజ్ఞానం ఉండగా, 36% మందిలో ఒక మోస్తరుగా, 11% మందిలో మరీ తక్కువగా ఉంది.
- సేంద్రియ ఆహారం ఆవశ్యకతను గుర్తించి మిద్దె తోటల సాగు చేపట్టిన వారిలో 62% డిగ్రీ/ఆపైన చదువుకున్న వారే. చదువు లేని వారు 2%, నిరక్షరాస్యులు 3% మిద్దె తోటలు సాగు చేస్తున్నారు.
- మిద్దె తోట సాగుదారుల్లో 37% మంది ప్రభుత్వ ఉద్యోగులు, 23% గృహస్తులు, 18% వ్యాపారులు, 16% విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. ప్రైవేటు ఉద్యోగులు చాలా తక్కువగానే ఉన్నారు. కేవలం 6% మందే టెర్రస్ సాగు చేస్తున్నారు. ఈ సాగుదారుల్లో మధ్యస్థ స్థాయి వార్షికాదాయం ఉన్నవారు 56%, అల్పాదాయ వర్గాల వారు 26%, అధికాదాయ వర్గాలు 18% ఉన్నారు.



ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

పట్టణాల్లో మిద్దె తోటల సాగును పూర్తిస్థాయిలో ప్రోత్సహించడానికి ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కోతులు, చీడపీడలు, పక్షుల బెడద నుంచి పరిరక్షించుకోవడానికి నెట్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్పించాలి. చీడపీడలను గుర్తించి, వాటిని అధిగమించే నైపుణ్యాలను పెంపొందించటం కోసం అనుభవజ్ఞులైన ఉద్యాన అధికారులతో అన్ని నగరాలు, పట్టణాల్లో ప్రజలకు శిక్షణ ఇప్పించాలి. వర్టికల్ గార్డెనింగ్ నైపుణ్యాలపై మిద్దె తోటల సాగుదారులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇప్పిస్తే టెర్రస్ స్థలాన్ని మరింత ఉత్పాదకంగా వినియోగించుకోవటానికి అవకాశం కలుగుతుంది.

– గువ్వల చరణ్ తేజ

ముక్కువోని దీక్షతో..

ముక్కే.. కుంచై..



కొనతేలిన ముక్కునే కుంచెగా.. అబ్బురపరుస్తున్న చిత్రకారుడు

ఆకర్షించే వందలాది నాసిక చిత్రాలు..

సత్యవోలు రాంబాబు అసాధారణ ప్రతిభ..

అబ్దుల్‌కలాం ప్రశంసలు.. మరెన్నో అవార్డులు, బిరుదులు..

వివరాలు 11లో

అద్దెకు మినీ థియేటర్‌లు..

కుటుంబ సమేతంగా చూసే వెసులుబాటు

నగరంలో నయా ట్రెండ్‌కు ప్రాచుర్యం

వివరాలు 11లో





స్టెతస్కోప్ తగ్గిందా?

డాక్టర్ అనగానే మనకు ఠక్కున స్టెతస్కోప్ గుర్తొస్తుంది. మెడలో స్టెతస్కోప్ వేసుకునో, దానితో చెక్ చేస్తూనో ఉన్న వైద్యులు గుర్తుకు వస్తారు. పేషెంట్ల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు.. గుండె, ఊపిరితిత్తుల్లో చప్పుడు, పల్స్ రేటును పరిశీలించేందుకు సుమారు 200 ఏళ్లకుపైగా డాక్టర్లు స్టెతస్కోప్‌ను వాడుతున్నారు. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో పరిస్థితులు మారిపోయాయి. పేషెంట్ పల్స్, హార్ట్‌బీట్ తెలుసుకునేందుకు డిజిటల్ పరికరాలు వచ్చేశాయి. దీనితో స్టెతస్కోప్‌తో ఉపయోగం ఏమిటన్న ప్రశ్నలు మొదలయ్యాయి. ఇటీవల ముంబైలోని బాంబే హాస్పిటల్‌లో 'ఏఐ, హెల్త్‌కేర్'అంశంపై జరిగిన కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులు.. స్టెతస్కోప్ వాడకంపై చర్చించారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని వైద్యులు స్టెతస్కోప్‌ను వినియోగించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్

వైద్యులు స్టెతస్కోప్ వాడాల్సిన అవసరంపై సందేహాలు

- ఈ అంశంపై గ్రేటర్ హైదరాబాద్‌లోని వైద్యుల భిన్నాభిప్రాయాలు
- స్టెత్ వాడాల్సిన అవసరం లేదంటున్న కొందరు.. తప్పనిసరి అంటున్న మరికొందరు
- డిజిటల్ యుగంలో స్టెతస్కోప్‌తో పనేంటనే వాదనలు
- అత్యవసర పరిస్థితులు, కొన్ని అంశాల్లో అదే అవసరమంటున్న ఇంకొందరు

స్టెతస్కోప్ వాడకంపై ఏళ్ల కిందే భిన్నాభిప్రాయాలు మొదలయ్యాయి. స్టెతస్కోప్ కనిపెట్టి 2016 నాటికి 200 ఏళ్లు పూర్తయ్యాయి. అప్పట్లో అంతా స్టెతస్కోప్ రెండు శతాబ్దాల వేడుకలు చేసుకోవాలని భావిస్తుంటే.. అమెరికాకు చెందిన జగత్ నరులా అనే కార్డియాలజిస్టు మాత్రం 'స్టెతస్కోప్ చనిపోయింది'అంటూ కామెంట్ చేయడం సంచలనంగా మారింది.

ఇదే తొలిసారి కాదు..

దీనిపై అప్పట్లోనే డాక్టర్ల మధ్య పెద్ద చర్చ నడిచింది. హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ రీడ్ థామ్సన్ మాత్రం దీన్ని ఖండించారు. మరోవైపు భవిష్యత్తులో సంప్రదాయ స్టెతస్కోప్‌లపై ఆధారపడటం చాలా తగ్గుతుందని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ సత్యవాన్ శర్మ కూడా అభిప్రాయపడ్డారు. ప్రస్తుతమున్న స్టెతస్కోప్‌ల స్థానాన్ని ఎలక్ట్రానిక్, డిజిటల్, ఏఐతో రూపొందించిన స్టెతస్కోప్‌లు భర్తీ చేస్తాయని పేర్కొన్నారు. డాక్టర్లంతా ఏఐతో నడిచే వాటినే ఉపయోగిస్తారని అంచనా వేశారు. అయితే ఎన్ని కొత్త సాధనాలు వచ్చినా స్టెతస్కోప్ వన్నె ఎప్పటికీ తగ్గదని.. రోగి ఆస్పత్రికి వచ్చిన వెంటనే స్టెతస్కోప్‌తో చూస్తేనే సంతృప్తి కలుగుతుందని ఊపిరితిత్తుల నిపుణుడు లాన్సెలాట్ పింటో చెప్పారు.

స్టెతస్కోప్‌ను ఎప్పుడు కనిపెట్టారు?

స్టెతస్కోప్‌ను 1860 సమయంలో తొలిసారిగా కనిపెట్టారు. అంతకుముందు వైద్యులు నేరుగా పేషెంట్ల శరీరానికి చెవిని ఆనించి గుండె చప్పుడు వినేవారు. ఆ సమయంలో మహిళా రోగుల ఇబ్బందులను గుర్తించి.. ఏదైనా పరికరాన్ని రూపొందించాలన్న ప్రయత్నాలు మొదలయ్యాయి. తొలిసారిగా ఫ్రెంచ్ డాక్టర్ రీన్ లానెక్ కాగితాన్ని ట్యూబ్‌లా చుట్టి స్టెతస్కోప్‌లా వాడారు. ఆయనే దీనికి స్టెతస్కోప్ అని పేరు పెట్టారు. గ్రీక్ భాషలో స్టెతోస్ అంటే ఛాతీ అని.. స్కోపీస్ అంటే చూడటమని అర్థం. ఆ తర్వాత కొన్ని రకాల ప్రాథమిక స్టెతస్కోప్‌లు తయారు చేశారు. వాటిని దాదాపు 25 ఏళ్ల పాటు వాడారు. ఆర్థర్ లీర్డ్ అనే ఐరిష్ డాక్టర్ కాస్త మెరుగైన స్టెతస్కోప్‌ను తయారు చేశారు. ప్రస్తుతం వాడుతున్న స్టెతస్కోప్‌ను లిట్‌మన్ అనే శాస్త్రవేత్త రూపొందించారు.



పిల్లల్లో గుండె సమస్యలు గుర్తించొచ్చు..

పిల్లల్లో పుట్టుకతోనే వచ్చే గుండె సంబంధిత వ్యాధులను స్టెతస్కోప్‌తో గుర్తించొచ్చు. గుండె నుంచి ఏదైనా అసాధారణ శబ్దాలు వినిపిస్తే (కార్డియాక్ మర్మర్) కాంజెనిటల్ కార్డియాక్ డిసీజెస్ ఉన్నట్టు తెలుస్తుంది. స్టెతస్కోప్ ద్వారానే దీన్ని గమనించవచ్చు. ఎలాంటి డిజిటల్ పరికరాలు దీన్ని గుర్తించలేవు.

- డాక్టర్ నాజ్నీన్ తబస్సుమ్, మెడికల్ ఆఫీసర్



స్టెత్‌కు ఎప్పటికీ వన్నె తగ్గదు

స్టెతస్కోప్ వినియోగం ఎప్పటికీ తగ్గదు. సహాయక సిబ్బంది డిజిటల్ పరికరాల ద్వారా రోగి ఆరోగ్య పరిస్థితిపై ప్రాథమిక సమాచారం సేకరిస్తారు. కానీ డాక్టర్‌గా స్టెతస్కోప్‌తో రోగిని చూస్తేనే సంతృప్తి కలుగుతుంది. స్టెతస్కోప్ కచ్చితత్వం ఎప్పుడూ మారదు.

- శిరందాస్ శ్రీనివాసులు, నిమ్స్ రేడియోగ్రాఫర్



అత్యవసర సమయాల్లో దానితోనే మేలు

అత్యవసర సమయాల్లో స్టెతస్కోప్ ఎంతో ఉపయోగపడుతుంది. రోగికి వెంటిలేటర్ అమర్చే సమయంలో పైప్ సరిగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లిందో లేదో స్టెతస్కోప్‌తోనే తెలుస్తుంది. ముక్కు ద్వారా ఆహారం అందించే పైపులు వేసే సమయంలో కూడా స్టెత్ లేనిదే పనికాదు.

- విరించి విరివింటి, క్లినికల్ కార్డియాలజిస్టు

అర్బన్ అగ్రికల్చర్ అదుర్స్



▶ మొదటి పేజీ తరువాయి

కుటుంబాలు 29%, అరుదుగా సాయం చేసేవి 17% ఉన్నాయి. మధ్యస్థ విస్తీర్ణంలో ఏర్పాటైన తోటలు 64% కాగా పెద్దవి 26%, చిన్నవి 10% ఉన్నాయి.

- 65% కుటుంబాలు ఆకు కూరలకు అధిక ప్రాధాన్యత (ఎక్కువ విస్తీర్ణంలో) ఇస్తున్నాయి. కూరగాయలే ముఖ్యం అనుకునే వారు 22%, తీగజాతులు ముఖ్యం అనుకుంటున్న వారు 6%, ఔషధ మొక్కలు ముఖ్యం అనుకుంటున్న వారు 4%.. పండ్లను సాగు చేస్తున్న వారు 3% ఉన్నారు.
- కూరగాయలు, ఆకుకూరలు, దుంపకూరలు, తీగజాతి కూరగాయలు, పువ్వుజాతి కూరగాయలు (క్యాబేజీ వంటివి), పండ్లు, ఔషధ మొక్కలు.. లాంటివన్నీ సాగు చేస్తున్న కుటుంబాలు 53% ఉండగా, మరో 29% కుటుంబాలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, దుంపకూరలకు పరిమితం అవుతున్నారు.

సొంత కంపోస్టు వాడుతున్న 84% మంది

- మిద్దె తోటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే స్లాబ్ ద్వారా నీరు లీకయ్యే ప్రమాదం ఉందన్న గ్రహింపు 89% మందికి ఉంది. సారవంతమైన మట్టి మిశ్రమం వాడటంలో, వంటింటి వ్యర్థాలతో కంపోస్టు తయారు చేసుకొని వినియోగించడంలో, చీడపీడలను నియంత్రించుకోవటంలో 85-86 శాతం మందికి పూర్తి అవగాహన ఉండటం విశేషం.
- ప్రభుత్వ శిక్షణ పొందామని 45% మంది చెప్పారు. మిద్దె తోటల సమాచారం కోసం వాట్సాప్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నామన్నారు. ఆ తర్వాత స్థానాల్లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఉన్నాయి. రోజుకు రెండు, మూడు గంటలు మిద్దె తోట పనులు చేసుకుంటున్నామని ఎక్కువ మంది చెప్పారు.

ఇవీ లోపాలు

టెర్రస్ గార్డెనింగ్ లేఅవుట్ గురించి 54% మందికి తెలియదు. కుండీలు, మడుల్లో పంట మార్పిడి చేయాలన్న గ్రహింపు 47 శాతం మందిలోనే ఉంది.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో మిద్దె తోటను రక్షించుకునే నైపుణ్యం 47% మందికి లోపించింది.

అదనపు నీరు బయటకు వెళ్లిపోవటానికి కుండీలు, మడులకు అడుగున బెజ్జాలు ఉండాలన్న విషయం తెలియని గార్డెనర్లు 51% ఉన్నారంటే ఆశ్చర్యం కలగకపోదు.

కోతుల నుంచి పంటలను రక్షించుకోవటం పెద్ద సవాలుగా మారింది.

మిద్దె తోటలు సాగు వివరాలు

61% మహిళలు | 39% పురుషులు

వయసు

యువత (35 ఏళ్ల లోపు)	29%
మధ్య వయస్కులు	51%
పెద్దలు (50 ఏళ్ల పైన)	20%

విద్యార్హత

డిగ్రీ, ఆపైన	62%
ఇంటర్మీడియట్	14%
హైస్కూల్	11%
ప్రైమరీ	09%
అక్షరాస్యులు	02%
నిరక్షరాస్యులు	02%

ఏ పంటలు ఎక్కువ

ఆకుకూరలు	65%
కూరగాయలు	22%
తీగజాతులు	06%
ఔషధ,సుగంధ మొక్కలు	04%
పండ్లు	03%

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 94
మంగళవారం 25-6-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



సెమీస్‌లో భారత్

చివరి 'సూపర్‌–8' మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 24 పరుగులతో ఘనవిజయం. -16లో



'హీరో' వాహనాలు ప్రియం


ఎంపిక చేసిన బైక్‌లు, స్కూటర్ల ధరలను 1,500 వరకు పెంచిన సంస్థ. -17లో



కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

అరవింద్‌ కేజ్రీవాల్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

వివరాలు 6లో ▸



రష్యాలో మరో ఉగ్రఘాతుకం

ముస్లిం ప్రాబల్య దక్షిణ ప్రాంత దగెస్తాన్‌ రిపబ్లిక్‌లో ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. రెండు ఘటనల్లో 20 మంది చనిపోయారు.

వివరాలు 6లో ▸



బ్యాటరీ ఫ్యాక్టరీలో పేలుడు

ద.కొరియాలోని లిథియం బ్యాటరీ తయారీ కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో 22 మంది కార్మికులు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



'హైవే' పనులను పూర్తిచేయండి

హైదరాబాద్‌–విజయవాడ ఆరు లేన్ల హైవే పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని.. కోమటిరెడ్డి కోరారు.

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్‌

జూడాల సమ్మెతో స్తంభించిన వైద్య సేవలు



జూనియర్‌ డాక్టర్ల నిరవధిక సమ్మె సోమవారం ప్రారంభమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బోధనాస్పత్రులు, ఇతర అనుబంధ ఆస్పత్రుల్లో వైద్యసేవలు స్తంభించాయి. అన్ని ఆస్పత్రుల్లో కలిపి దాదాపు 6,000 మంది జూనియర్‌ డాక్టర్లు సమ్మెలో ఉన్నారు. దీంతో ఎక్కడికక్కడ ఓపీ సహా పలు వైద్యసేవలు నిలిచిపోయాయి.

- వివరాలు 3లో▶

రాజకీయ ఫిరాయింపులకు ఆద్యుడే కేసీఆర్‌



రాజకీయ ఫిరాయింపులకు ఆద్యుడే మాజీ సీఎం కేసీఆర్‌ అని షబ్బీర్‌అలీ ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌కు ఇచ్చిన కోకాపేట భూమిని వేలం వేసి.. ఆ మొత్తాన్ని రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు వినియోగించాలన్నారు.

- వివరాలు 2లో▶

ఈ వారం వర్షాలే కీలకం



నైరుతి సీజన్‌లో జూన్‌ నెలాఖరులో కురిసే వర్షాలే.. రాష్ట్రంలో నీటి వనరులకు, పంటల సాగుకు ముఖ్యమని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. బుధవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

- వివరాలు 18లో▶

'ఎమర్జెన్సీ' మాయని మచ్చ

కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మండిపాటు

- దేశాన్ని జైలుగా మార్చిన రోజులను కొత్తతరం మర్చిపోదు
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పోరులంతా తీర్మానం చేయాలి
- ఆనాటి రోజులు పునరావృతం కాకూడదు
- వరుసగా మూడోసారి నెగ్గడంతో మా బాధ్యత మూడురెట్లు పెరిగింది
- ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- సభలో నినాదాలు కాదు.. అర్థవంతమైన చర్చలు జరగాలి
- 'వికసిత్‌ భారత్‌' లక్ష్య సాధనకు ఎంపీలంతా కలిసి పనిచేయాలి



సాక్షి, న్యూఢిల్లీ: ఎమర్జెన్సీ నాటి రోజులు భారతదేశ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ప్రధాని మోదీ కాంగ్రెస్‌ పార్టీపై విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీ పాలనకు మంగళవారం నాటికి 50 ఏళ్లు పూర్తవుతాయని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసి, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించి, దేశాన్ని జైలుగా మార్చిన ఆ రోజులను దేశంలోని కొత్తతరం ఎన్నటికీ మర్చిపోదని అన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుకొనేందుకు పౌరులంతా తీర్మానం చేయాలని కోరారు. తద్వారా అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని ప్రకటించారు. రాజ్యాంగం ప్రకారం సామాన్య ప్రజల కలలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. 18వ లోక్‌సభ సమావేశాల ప్రారంభానికి ముందు సోమవారం ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు దేశ ప్రజలకు

మిగతా 6వ పేజీలో ▶

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలి

ప్రతిపక్షాల బాధ్యతను ప్రధాని మోదీ గుర్తుచేశారు. ప్రజలు బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య గౌరవాన్ని కాపాడుతూ, ప్రతిపక్షాలు వారి పాత్రను పూర్తిస్థాయిలో పోషించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సభలో నినాదాలకు బదులు అర్థవంతమైన చర్చలను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎంపీలందరూ సామాన్య ప్రజల అంచనాలను అధిగమించేందుకు ప్రయత్నించాలని మోదీ సూచించారు.

రాజ్యాంగం వర్ధిల్లాలి

పార్లమెంట్‌ ప్రాంగణంలో 'ఇండియా' ఎంపీల నినాదాలు



6లో

పదేళ్లపాటు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీ

- నైతికంగా ఓడినా మోదీలో అహంకారం తగ్గలేదు
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

ఎంపీల ప్రమాణ స్వీకారం

- తొలుత ప్రధాని మోదీ.. తర్వాత ప్యానెల్‌ స్పీకర్లు, మంత్రులు..
- తర్వాత అక్షరమాల ప్రకారం రాష్ట్రాలవారీగా సభ్యుల ప్రమాణం

- వివరాలు 6లో

2.70 లక్షల ఇళ్లు ఇవ్వండి



ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

2,450 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్రానికి బదలాయించండి

- కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్‌ ఖట్టర్, రాజ్‌నాథ్‌ సింగ్‌లకు సీఎం రేవంత్‌ విజ్ఞప్తి
- పీఎం ఆవాస్‌ యోజన ఇళ్ల నిర్మాణ వ్యయం పెంచండి
- స్మార్ట్‌ సిటీ మిషన్‌ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించండి
- వరంగల్‌ సైనిక్‌ స్కూల్‌ అనుమతులు పునరుద్ధరించాలని విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో తెలంగాణకు బీఎల్‌సీ మోడల్‌లో 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రికి వివరించారు.

సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. తెలంగాణలో రాష్ట్ర సర్కారు నిర్మించ తలపెట్టిన 25 లక్షల ఇళ్లలో 15 లక్షల ఇళ్లు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని కేంద్ర మంత్రికి తెలిపారు. వాటిని లబ్ధిదారు ఆధ్వర్యంలో వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం (బీఎల్‌సీ) విధానంలో నిర్మించనున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన (పట్టణ)– పీఎంఏవై (యూ) పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పీఎంఏవై (యూ) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని వివరించారు. పీఎంఏవై (యూ) కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి, రూ.2,390.58 కోట్లు గ్రాంటుగా ప్రకటించారని గుర్తు చేశారు. ఇందులో ఇప్పటివరకు రూ.1,605.70 కోట్లే ఇచ్చారని, మిగతా

మిగతా 2వ పేజీలో ▶

41మంది ఐఏఎస్‌ల బదిలీ

ఇద్దరు ఐపీఎస్, ఒక ఐఎఫ్‌ఎస్‌ అధికారికి కూడా స్థాన చలనం

- 6 నెలలు తిరగకుండానే ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ మార్పు
- కీలకమైన ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ బాధ్యతలు అప్పగింత
- ఇంధన శాఖ కార్యదర్శిగా రొనాల్డ్‌ రోస్‌.. ట్రాన్స్‌కో, జెన్‌కో బాధ్యతలూ ఆయనకే..
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి పూర్తి స్థాయి బాధ్యతలు
- హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్‌ అహ్మద్‌.. జలమండలి ఎండీగా అశోక్‌రెడ్డి
- ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్‌కుమార్‌ సుల్తానియా
- పలువురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు.. త్వరలో మరిన్ని బదిలీలు



రిజ్వీ, రోనాల్డ్‌ రోస్, ఆమ్రపాలి, సర్ఫరాజ్, అశోక్‌రెడ్డి, సందీప్‌కుమార్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం భారీగా అఖిల భారత సర్వీసు అధికారుల బదిలీ చేపట్టింది. అందులో 41 మంది ఐఏఎస్‌లు కాగా.. ఇద్దరు ఐపీఎస్, ఒకరు ఐఎఫ్‌ఎస్‌ అధికారి ఉన్నారు. ఇందులో కీలకమైన ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ పోస్టుల నుంచి సయ్యద్‌ అలీ ముర్తుజా రిజ్వీని ప్రభుత్వం తప్పించింది. ఆయనను వాణిజ్య పన్నులు, ఎక్సైజ్‌ శాఖల ముఖ్య కార్యదర్శిగా మరో కీలక పోస్టుకు బదిలీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ రోనాల్డ్‌ రోస్‌కు ఇంధన శాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కో బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే మరికొందరు అధికారుల బదిలీ ఉండనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కఠిన చర్యలకు దిగడంతో..: రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక కీలకమైన ఇంధన శాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కోల బాధ్యతను రిజ్వీకి అప్పగిస్తూ జనవరి 3న ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన రిజ్వీ.. అన్ని విషయాల్లో కఠినంగా వ్యవహరించినట్టు ఉద్యోగ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్‌ ఉద్యోగ సంఘాలతోపాటు కొందరు రాజకీయ పెద్దల నుంచి

మిగతా 2వ పేజీలో ▶

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌

- మనం చేసిన మంచి అందరికీ తెలుసు
- తప్పకుండా ప్రజలు మళ్లీ మన వైపే చూస్తారు
- నేతలు, కార్యకర్తలతో మాటామంతి
- మూడో రోజూ ప్రజలతో మమేకం

12లో





NBDA
NEWS BROADCASTERS & DIGITAL ASSOCIATION

ప్రసారాల నిలిపివేత పత్రికా స్వేచ్ఛకు ముప్పే

సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ చానళ్ల నిలిపివేతపై న్యూస్‌ బ్రాడ్‌కాస్టర్స్‌ డిజిటల్‌ అథారిటీ

సంపాదకీయ స్వేచ్ఛపై జోక్యం తగదు

- వివరాలు 12లో▶

ఫిరాయింపులపై సుప్రీంకు!

బీఆర్‌ఎస్‌ యోచన

- ఈ నెల 27న హైకోర్టు ముందుకు దానం అనర్హత పిటిషన్‌
- చర్యలు లేనిపక్షంలో దానంతో పాటు మిగతా ఎమ్మెల్యేలపైనా సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం
- రెండు రోజులుగా కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌ చర్చలు

2లో

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

- ఆ పార్టీ గతంలోనూ ఫిరాయింపులు ప్రోత్సహించింది: కేటీఆర్‌ - 2లో

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్‌ తదితరుల భేటీ



సంజయ్‌ చేరిక.. జీవన్‌ కినుక

జగిత్యాల ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి మనస్తాపం

- తనకు కనీస సమాచారం ఇవ్వకుండా పార్టీ కండువా కప్పడంపై అభ్యంతరం
- తాను ఎవరిపై పోరాడానో ఆ వ్యక్తిని ఎలా చేర్చుకుంటారంటూ నిలదీత
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమైన సీనియర్‌ నేత
- దీపాదాస్‌ మున్షీ, శ్రీధర్‌బాబు సహా పలువురు నేతల మంతనాలు
- కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్న జీవన్‌రెడ్డి
- తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్‌/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌/జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్‌ సంజయ్‌కుమార్‌ కాంగ్రెస్‌లో చేరిక ఆ పార్టీలో చిచ్చు పెట్టింది. ఆదివారం రాత్రి అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే ఎం.సంజయ్‌కుమార్‌ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ కండువా కప్పుకున్న ఫొటోలు బయటికి రావడంతో సీనియర్‌ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భగ్గుమన్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్‌ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ,

మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఫిరాయింపులపై సుప్రీంకు!

బీఆర్ఎస్ యోచన

ఈ నెల 27న హైకోర్టు ముందుకు దానం అనర్హత పిటిషన్

చర్యలు లేనిపక్షంలో దానంతో పాటు మిగతా ఎమ్మెల్యేలపైనా సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం

రెండు రోజులుగా ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు చర్చలు

వారాంతంలోగా పార్టీ ప్రజా ప్రతినిధులతో భేటీకి సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్న భారత్ రాష్ట్ర సమితి సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ఈ నెల 27న విచారణకు రానుంది. ఒకవేళ దానంను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కేవలం దానం నాగేందర్‌పైనే కాకుండా ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు అందరిపైనా వేటు వేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై దాఖలయ్యే అనర్హత పిటిషన్‌పై 3 నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పులోని పేరా నంబరు 30, 33 ప్రకారం హైకోర్టు తక్షణమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆ పార్టీ వాదిస్తోంది. దానంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్‌రావు (భద్రాచలం), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), సంజయ్ (జగిత్యాల)కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

అధినేత అప్రమత్తం: పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతుండటంతో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అప్రమత్తమయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు కొందరు సీనియర్ నేతలు రెండు రోజులు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాటం చేయాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు ఇందుకు సంబంధించి న్యాయ నిపుణులతోనూ కేసీఆర్ చర్చించినట్లు తెలిసింది. ఇంకోవైపు కేటీఆర్, హరీశ్‌రావులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో నిరంతరం మాట్లాడుతున్నారు. కేసీఆర్ కూడా వారితో టచ్‌లోకి వెళ్లినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

పార్టీలో కొనసాగితే మంచి భవిష్యత్తు: పార్టీలో కొనసాగితే భవిష్యత్తులో మంచి ప్రాధాన్యత ఉంటుందని కేసీఆర్ భరోసా ఇస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసిన తీరు, తర్వాతి కాలంలో వారు రాజకీయంగా ప్రాధాన్యత కోల్పోయిన వైనాన్ని కేసీఆర్ వారికి వివరిస్తున్నట్లు సమాచారం. కొందరు ఎమ్మెల్సీలను కూడా పార్టీలోకి రప్పించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియడంతో వారితోనూ బీఆర్ఎస్ అధినేత మాట్లాడుతున్నట్లు తెలిసింది. అలాగే పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల్లో భరోసా నింపేందుకు మూడు నాలుగు రోజుల్లో ప్రత్యేక భేటీ నిర్వహించే యోచనలో కేసీఆర్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

ఆ పార్టీ గతంలోనూ ఫిరాయింపులు ప్రోత్సహించింది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

ఎన్‌డీఏ జాతీయ విధ్వంస కూటమిగా మారిందని విమర్శ



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు పాల్పడేలా ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. అధికార మత్తుతో విర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తి అధికారంలో ఉన్న వారి బలం కంటే ఎప్పుడూ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో సోమవారం ఆయన ఈ మేరకు పోస్ట్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా కాంగ్రెస్ అనేకసార్లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందని విమర్శించారు. కాంగ్రెస్ నీతిలేనితనంపై గతంలోనూ తెలంగాణ ప్రజలు ఆందోళన చేశారని, చరిత్ర పునరావృతమవుతుందని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు ఇలాంటి కష్ట సమయాలు కొత్త కాదని అన్నారు.

బీజేపీ తలాతోకా లేని నిర్ణయాలు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీసుకుంటున్న తలాతోకా లేని నిర్ణయాలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 4న నీట్ యూజీ పేపర్ లీక్, 19న యూజీసీ నెట్ పరీక్ష రద్దు, 21న సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ వాయిదా, 22న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష వాయిదా వంటివి బీజేపీ అసంబద్ధ నిర్ణయాలకు తార్కాణంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఓ వైపు నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ జూలై 6 నుంచి కౌన్సెలింగ్‌కు మోదీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు ఎలాంటి సహేతుక కారణాలు లేకుండానే నీట్ పీజీ ప్రవేశ పరీక్షను కొద్ది గంటల ముందు రద్దు చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని, ఎన్‌డీఏ నేషనల్ డిజాస్టర్ అలయెన్స్ (జాతీయ విధ్వంస కూటమి)గా మారిందని కేటీఆర్ మండిపడ్డారు.



మంత్రివర్గంలోకి పోచారం?

కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్!

పోచారంతో కలిసి ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్‌లతో సీఎం రేవంత్ భేటీ

తన వాహనంలోనే ఏఐసీసీ కార్యాలయానికి తీసుకెళ్లి పార్టీ పెద్దలకు పరిచయం చేసిన సీఎం

పోచారం సుదీర్ఘ రాజకీయ అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని వెల్లడి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కేబినెట్‌లో ఎవరూ లేనందున ఆయనకు అవకాశం ఇవ్వాలని వినతి



మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీలతో సీఎం రేవంత్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో కేసీ వేణుగోపాల్, దీపా దాస్‌మున్షీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గంలోకి మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని తీసుకొనేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పెద్దల నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పోచారానికి ఉన్న అపార అనుభవం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆయనకున్న పట్టును దృష్టిలో పెట్టుకొని మంత్రి పదవి ఇచ్చేందుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని తన కారులో ఎక్కించుకొని స్వయంగా ఏఐసీసీ కార్యాలయానికి వచ్చిన సీఎం... ఆయన్ను పార్టీ పెద్దలకు పరిచయం చేశారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, స్పీకర్‌గా ఆయన అనుభవాన్ని వారికి వివరించారు. జిల్లాలో ఉన్న ఆయన పలుకుబడి పార్టీ ఉన్నతికి ఉపయోగపడుతుందని వారి దృష్టికి తెచ్చారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరూ మంత్రివర్గంలో లేని దృష్ట్యా ఆయనకు అవకాశం ఇస్తే పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని వివరించారు. దీనిపై హైకమాండ్ పెద్దలు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. మరోవైపు జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అంశంతోపాటు మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీలోకి వచ్చేందుకు సుముఖంగా ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి పార్టీ పెద్దలకు వివరించారు.

పీసీసీ రేసులోకి బలరాం, షెట్కార్

పార్టీ పెద్దలతో పీసీసీ అధ్యక్ష ఎంపిక వ్యవహారం సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే సామాజికవర్గాల వారీగా పలువురి పేర్లు ప్రచారంలో ఉండగా కొత్తగా ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షెట్కార్‌ల పేర్లు రేసులోకి వచ్చాయి. పీసీసీ పదవి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ సీనియర్ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్ పోటీ పడుతుండగా మరో మంత్రి సీతక్క పేరు సైతం ప్రచారంలో ఉంది. అయితే సోమవారం నాటి భేటీలో మాత్రం మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు ఎస్టీ కోటాలో బలరాం నాయక్, బీసీ కోటాలో షెట్కార్ పేర్లు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఇంకా ఎవరి పేరును ఖరారు చేయలేదని తెలుస్తోంది. రాష్ట్ర సీనియర్లతో చర్చించి ఫైనల్ చేయనున్నారు. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపైనా రేవంత్ సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది.

రాజకీయ ఫిరాయింపులకు ఆద్యుడే కేసీఆర్: షబ్బీర్



సాక్షి, హైదరాబాద్: రాజకీయ ఫిరాయింపులకు ఆద్యుడే మాజీ సీఎం కేసీఆర్ అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతిని తారస్థాయికి తీసుకెళ్లిందే ఆయన అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో షబ్బీర్‌అలీ విలేకరులతో మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే కేసీఆర్ ఫిరాయింపుల సంస్కృతిని ప్రారంభించి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయే వరకు కొనసాగించారని అన్నారు. జూన్ 2, 2014న ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేలు ఇంద్రకరణ్‌రెడ్డి, కోనేరు కోనప్పలు బీఆర్ఎస్‌లోకి చేర్చుకున్నారని, తదనంతరం 11 మంది టీడీపీ ఎమ్మెల్యేలను చేర్చుకొని టీడీపీని అధికారికంగా బీఆర్ఎస్‌లో విలీనం చేశారని చెప్పారు. కేసీఆర్ 2014 నుంచి 2018 వరకు నలుగురు ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు మొత్తం 47 మందిని తన పార్టీలోకి ఫిరాయించేలా చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కోకాపేటలో రూ.1100 కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని కేవలం రూ.37 కోట్లకే బీఆర్ఎస్ కార్యాలయం కోసం కేటాయించిందని తెలిపారు. దీనిని ప్రభుత్వం రద్దు చేసి భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు ఇచ్చిన కోకాపేట భూమిని వేలం వేయాలని, దాని ద్వారా వచ్చే మొత్తాన్ని పంట రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు వినియోగించాలన్నారు.

2.70 లక్షల ఇళ్లు ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

నిధులు విడుదల చేయాలని కోరారు.

స్మార్ట్‌సిటీ మిషన్ కాలపరిమితి పొడిగించండి

స్మార్ట్‌సిటీ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తికానందున మిషన్ కాలపరిమితిని 2025 జూన్ వరకు పొడిగించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద తెలంగాణలోని వరంగల్, కరీంనగర్ నగరాల్లో పనులు చేపట్టినట్టు తెలిపారు. వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయని, రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయని.. కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని వివరించారు. స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగుస్తోందని.. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టు కుని మరో ఏడాది పొడిగించాలని కోరారు.

రక్షణ భూములు రాష్ట్రానికి బదలాయించండి

హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాల కోసం 2,500 ఎకరాల రక్షణశాఖ భూములను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌ను రేవంత్ కలిశారు. ర్యావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం ఉపయోగించుకుంటున్న విషయాన్ని రక్షణ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు కీలకమని చెప్పారు. భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు.

వరంగల్ సైనిక్ స్కూల్ ఇవ్వండి..

వరంగల్ నగరానికి కేంద్రం సైనిక్ స్కూల్ మంజూరు చేసినా.. గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం తెలిపారు. ఆ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిశాయని.. ఆ అనుమతులను పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

నీట్‌పై జ్యుడీషియల్ విచారణ: రేవంత్

రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించామని సీఎం రేవంత్ తెలిపారు. రక్షణ భూముల బదలాయింపు, మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో రైలు, పీఎంఏవై ఇళ్ల విషయంలో విజ్ఞప్తులు అందజేశామని చెప్పారు. కేంద్ర మంత్రులను కలసిన తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలతో భేటీ రేవంత్ భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డిఫెన్స్ శాఖ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరామన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరామని.. సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో మూడు, ఏపీలో రెండు సైనిక్ స్కూళ్లు ఉన్నాయని.. కానీ తెలంగాణలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేదని కేంద్ర మంత్రికి వివరించామన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్ పదేళ్ల పాటు అడగలేదని, ప్రధాని మోదీ ఇవ్వలేదని విమర్శించారు. నీట్ పరీక్ష నిర్వహణలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. ఈ కేసును సీబీఐతో కాకుండా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో బలరాం నాయక్

కాంగ్రెస్‌తోనే నా రాజకీయ జన్మ ప్రారంభమైంది: పోచారం

తన రాజకీయ జన్మ కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభమైందని, చివరికి ముగిసేది కూడా కాంగ్రెస్‌లోనే అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డికి ఖర్గే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత పోచారం మీడియాతో మాట్లాడారు. ఒకప్పుడు ఎన్టీఆర్ పిలుపుతో తాను టీడీపీలో చేరానని, కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లు పనిచేశానని చెప్పారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమర్థ పాలన అందిస్తున్నారని.. రైతులకు మంచి జరగాలనే ఆయన నాయకత్వాన్ని బలపరుస్తున్నానని చెప్పారు.

41మంది ఐఏఎస్‌ల బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకతను ఎదుర్కొన్నట్టు తెలిసింది. కొందరు ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ పెద్దలను కలిసి రిజ్వీని బదిలీ చేయాలంటూ పైరవీలు చేసినట్టు సమాచారం. విద్యుత్ సంస్థల ఆర్థిక వ్యవహారాల్లో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా మెరిట్, సీనియారిటీ ఆధారంగా విద్యుదుత్పత్తి కంపెనీలు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని రిజ్వీ ఆదేశాలు జారీ చేయడం కొందరికి రుచించలేదనే చర్చ జరిగింది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకపోవడంతో రిజ్వీని ప్రభుత్వం బదిలీ చేయనున్నట్టు నెల రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో రిజ్వీని ఇంధన శాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కో బాధ్యతల నుంచి తప్పించడం చర్చనీయాంశమైంది. అయితే ప్రభుత్వం ఆయనకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, ఆబ్కారీ శాఖలను అప్పగించింది. ఈ రెండు శాఖల్లో ఆదాయం లీకేజీని అరికట్టేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు చర్చ జరుగుతోంది.

సుల్తానియాకు ఆర్థిక శాఖ: రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్‌ను కూడా ప్రభుత్వం ఆరు నెలలు గడవక ముందే ఆ శాఖ నుంచి తప్పించి అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న సందీప్‌కుమార్ సుల్తానియాకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పోస్టు ఇచ్చారు. ప్రణాళిక ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలూ అప్పగించారు. అంతేకాదు తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల బాధ్యతలూ ఆయనే చూస్తారని పేర్కొన్నారు.

ఆమ్రపాలి చేతికి నగరాభివృద్ధి..: హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ కాటా ఆమ్రపాలికి ప్రభుత్వం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. సాధారణంగా ఈ పోస్టులో అత్యంత సీనియర్ అధికారులను నియమిస్తుంటారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులైన అధికారుల్లో జూనియర్ ఆమ్రపాలి కావడం గమనార్హం. ఇప్పటికే ఆమె మూసీ రివర్ ఫ్రంట్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్‌లకు ఎండీగా, ఓఆర్ఆర్ కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. దీంతో హైదరాబాద్ నగరాభివృద్ధికి సంబంధించిన కీలక విభాగాలన్నీ ఆమ్రపాలికి అప్పగించినట్టు అయింది. మరోవైపు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ హెచ్ఎండీఏ కమిషనర్‌గా కీలక పోస్టుకు బదిలీ అయ్యారు. ఉద్యానవన శాఖ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి జలమండలి ఎండీగా బదిలీ అయ్యారు. గతంలో ఆయన బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు ఓఎస్డీగా వ్యవహరించారు.

శైలజా రామయ్యర్‌కు మళ్లీ చేనేత బాధ్యతలు: మంత్రి డి.శ్రీధర్‌బాబు సతీమణి శైలజా రామయ్యర్‌ను ప్రభుత్వం పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి పోస్టు నుంచి దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి పోస్టుకు బదిలీ చేసింది. పరిశ్రమల శాఖ కిందకు వచ్చే చేనేత, వస్త్ర, హస్తకళల శాఖ బాధ్యతలు కూడా ఆమెకు అప్పగించింది. 2012 జూలై నుంచి 2022 నవంబర్ వరకు శైలజా రామయ్యర్ చేనేత శాఖలో వివిధ స్థాయిల్లో పనిచేశారు.

రిజిస్ట్రేషన్ల శాఖకు జ్యోతిబుద్ధ ప్రకాశ్..: రవాణా శాఖ కమిషనర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్ కీలకమైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శిగా, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ, సర్వే–సెటిల్మెంట్–ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, భూభారతి పీడీ అదనపు బాధ్యతల నుంచి నవీన్ మిట్టల్‌ను ప్రభుత్వం తప్పించింది. జ్యోతిబుద్ధ ప్రకాశ్‌కే అదనపు బాధ్యతలుగా ఈ పోస్టులను అప్పగించింది.

మళ్లీ వారికి ప్రాధాన్యత లేని పోస్టింగ్స్...: సీనియర్ ఐఏఎస్ సబ్యసాచి ఘోష్, సంజయ్‌కుమార్, వాణీప్రసాద్, అహ్మద్ నదీమ్‌లకు మళ్లీ పెద్దగా ప్రాధాన్యత లేని పోస్టింగ్స్ లభించాయి. యువజన అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సవ్యసాచి ఘోష్ పశు సంవర్థక శాఖకు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న సంజయ్‌కుమార్ కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పోస్టింగ్ పొందారు. అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి ఎ.వాణీప్రసాద్‌ను ప్రభుత్వం యువజన అభివృద్ధి శాఖకు బదిలీ చేసింది.

బదిలీ అయిన అధికారుల ప్రస్తుత, కొత్త పోస్టింగ్‌లు ఇవీ..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సబ్యసాచి ఘోష్	ముఖ్యకార్యదర్శి, యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ	ముఖ్యకార్యదర్శి, పశుసంవర్థక, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ
సంజయ్‌కుమార్	వెయిటింగ్	ముఖ్యకార్యదర్శి, కార్మిక, ఉపాధికల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ
ఎ.వాణిప్రసాద్	ముఖ్యకార్యదర్శి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ	ముఖ్యకార్యదర్శి, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ
శైలజా రామయ్యర్	ముఖ్యకార్యదర్శి, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడలశాఖ	ముఖ్యకార్యదర్శి, దేవాదాయ శాఖ, చేనేత, వస్త్ర, హస్తకళలు (అదనపు బాధ్యతలు) డైరెక్టర్, చేనేత, వస్త్ర శాఖ/చేనేత అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ/ చేనేత సహకార సంస్థ ఎండీ
అహ్మద్ నదీమ్	ముఖ్యకార్యదర్శి, ప్రణాళిక శాఖ	ముఖ్యకార్యదర్శి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ, (అదనపు బాధ్యతలు) ఈపీటీఆర్ఐ-డీజీ
సందీప్‌కుమార్ సుల్తానియా	ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్	ముఖ్యకార్యదర్శి, ఆర్థిక శాఖ, (అదనపు బాధ్యతలు) ముఖ్యకార్యదర్శి, ప్రణాళిక శాఖ తదుపరి ఆదేశాల వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు కూడా కొనసాగింపు
సయ్యద్ అలీముర్తుజా రిజ్వీ	ముఖ్యకార్యదర్శి, ఇంధన శాఖ	ముఖ్యకార్యదర్శి, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ
సి.సుదర్శన్‌రెడ్డి	ఎండీ, హైదరాబాద్ జలమండలి	ముఖ్యకార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్, హెచ్ఆర్ఎం)
జ్యోతిబుద్ధ ప్రకాశ్	కమిషనర్, రవాణా శాఖ	కార్యదర్శి, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ, కార్యదర్శి, గృహ నిర్మాణ శాఖ (అదనపు బాధ్యతలు) స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ/ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్/భూభారతి పీడీ కె.ఇలంబర్తి చార్జీ తీసుకునే వరకు రవాణా శాఖ కమిషనర్‌గా కొనసాగింపు.
సోనీ బలాదేవి (ఐఎఫ్ఎస్)	ప్రత్యేక కార్యదర్శి, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ	మేనేజింగ్ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ
కె.ఇలంబరితి	-	కమిషనర్, రవాణా శాఖ
డి.రోనాల్డ్ రోస్	జీహెచ్ఎంసీ కమిషనర్	కార్యదర్శి, ఇంధనశాఖ (అదనపు బాధ్యతలు) ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ
ఏవీ రంగనాథ్ (ఐపీఎస్)	ఐజీ-మల్టీజోన్-1, హైదరాబాద్	జీహెచ్ఎంసీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం కమిషనర్
ఎ.దేవసేన	కమిషనర్, పాఠశాల విద్యాశాఖ	కమిషనర్, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ
సర్ఫరాజ్ అహ్మద్	రాష్ట్ర ఎన్నికల జాయింట్ సీఈఓ	కమిషనర్, హెచ్ఎండీఏ
డి.దివ్య	డైరెక్టర్, పురపాలక శాఖ	సీఈఓ-సెర్ప్, రాష్ట్ర నోడల్ అధికారి-ప్రజావాణి
కాటా ఆమ్రపాలి	జాయింట్ కమిషనర్, హెచ్ఎండీఏ	జాయింట్ కమిషనర్, హెచ్ఎండీఏతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్
దాసరిహరిచందన	వెయిటింగ్	ప్రత్యేక కార్యదర్శి, రహదారులు, భవనాల శాఖ
ఎస్.ప్రకాశ్‌రెడ్డి (ఐపీఎస్)	జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ విభాగం కమిషనర్	ఎండీ, పర్యాటక అభివృద్ధి సంస్థ (శాఖ ఎండీ కె.రమేశ్‌నాయుడు (ఐపీఎస్)ను డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశం)
అలుగు వర్షిణి	చేనేత, వస్త్ర శాఖ డైరెక్టర్/ చేనేత అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ/ చేనేత సహకార సంస్థ ఎండీ	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శి

బదిలీ అయిన అధికారుల ప్రస్తుత, కొత్త పోస్టింగ్‌లు ఇవీ..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
వీపీ గౌతం	వెయిటింగ్	గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, (అదనపు బాధ్యతలు) పురపాలక శాఖ డైరెక్టర్/బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమం డైరెక్టర్/ గృహ నిర్మాణ సంస్థ ఎండీ/ దిల్ సీఈఓ/ హౌసింగ్ బోర్డు వీసీ, కమిషనర్/ రాజీవ్ స్వగృహ ఎండీ
ఎస్.కృష్ణ ఆదిత్య	డైరెక్టర్, కార్మిక శాఖ	కార్మిక శాఖ డైరెక్టర్‌తోపాటు అదనంగా..
		ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్
కె.అశోక్‌రెడ్డి	ఉద్యానవన శాఖ డైరెక్టర్	మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ జలమండలి
అనురాగ్ జయంతి	వెయిటింగ్	ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
పమేలా సత్పతి	కరీంనగర్ జిల్లా కలెక్టర్	అదే పోస్టులో కొనసాగింపు (ఇటీవల జరిగిన వీరిద్దరి బదిలీ ఉత్తర్వులు రద్దు)
భవేశ్ మిశ్రా	వెయిటింగ్	ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖ ఉప కార్యదర్శి
జి.రవి	వెయిటింగ్	కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్య కార్యదర్శి
కె.నిఖిల	పర్యాటక శాఖ డైరెక్టర్	సీఈఓ, తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్
ఎస్‌కే యాస్మిన్ బాషా	వెయిటింగ్	ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్, (అదనపు బాధ్యతలు) ఆయిల్‌ఫెడ్ ఎండీ
ఎస్.వెంకటరావు	వెయిటింగ్	జీఏడీలోని ప్రొటోకాల్ విభాగం డైరెక్టర్, సంయుక్త కార్యదర్శి (ప్రొటోకాల్)
పి.ఉదయ్‌కుమార్	వెయిటింగ్	వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి
బి.గోపి	వ్యవసాయ శాఖ డైరెక్టర్	వ్యవసాయ శాఖ డైరెక్టర్, అదనంగా పశుసంవర్థక శాఖ డైరెక్టర్ బాధ్యతలు
ప్రియాంక అల	వెయిటింగ్	మత్స్య శాఖ డైరెక్టర్
ఇలా త్రిపాఠి	వెయిటింగ్	పర్యాటక శాఖ డైరెక్టర్
స్నేహ శబరీష్	శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్	జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్
పి.కాత్యాయిని దేవి	సీఈఓ, గ్రామీణాభివృద్ధి సంస్థ	రాష్ట్ర ఆర్థిక సంఘం జేఎండీ
ఈవీ నరసింహారెడ్డి	గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్	విద్యా శాఖ డైరెక్టర్, (అదనపు బాధ్యతలు) తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ సమగ్ర శిక్షా అభియాన్- స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్
బి. హేమంత్ సహదేవ్‌రావు	వెయిటింగ్	టీజీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ
హేమంత్ కేశవ్ పాటిల్	హైదరాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)	ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
అపూర్వ్ చౌహాన్	జోగులాంబ గద్వాల అదనపు కలెక్టర్ (స్థానిక)	కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
అభిషేక్ అగస్త్య	మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ (స్థానిక)	ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్
బి.రాహుల్	మంచిర్యాల అదనపు కలెక్టర్ (స్థానిక)	ఐటీడీఏ-భద్రాచలం ప్రాజెక్టు అధికారి
పి.గౌతమి	రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ (స్థానిక)	మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జేఎండీ
పి.ఉపేందర్‌రెడ్డి	అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ	శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
నిఖిల్ చక్రవర్తి	-	టీజీఐఐసీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

పింఛన్ కష్టాల నుంచి విముక్తి

- ఉన్నతాధికారుల చొరవతో సమస్యకు పరిష్కారం
- ఆ రెండు గ్రామాలకు చెందిన 18 మంది పింఛన్‌దారులకు ఊరట
- పొరుగూళ్లలో పింఛన్ తీసుకుంటున్న మరో 160 మంది సమస్యకూ పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, కామారెడ్డి: పింఛన్ తీసుకోవడానికి ఏడాదిన్నర కాలంగా ఆ పండుటాకులు పడుతున్న కష్టాలకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. ఈ నెల 18న 'సాక్షి'లో 'పింఛన్ కోసం యాభై కిలోమీటర్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి, అలాగే ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులు ప్రతి నెలా పింఛన్ కోసం అక్కడి వారు ఇక్కడికి, ఇక్కడి వారు అక్కడికి వెళుతుండడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. ఏడాదిన్నర కాలంగా వాళ్లు పడుతున్న కష్టాలను ఎందుకు పట్టించుకోలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పింఛన్ పొరపాట్లను సరిచేసేందుకు కామారెడ్డి జిల్లా అంతటా సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, 25 మండలాల్లో సర్వే నిర్వహించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లికి చెందిన 13 మంది ఎల్లారెడ్డికి వెళ్లి పింఛన్ తీసుకుంటున్నట్టు గుర్తించారు. అలాగే ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఐదుగురు కామారెడ్డిలో పింఛన్ తీసుకుంటున్నట్టు గుర్తించి వారి వివరాలను సెర్ప్‌కు పంపించారు. మొత్తం పద్దెనిమిది మంది వివరాలతో కూడిన నివేదికను ఇవ్వగా వాటిని ఆన్‌లైన్‌లో సరి చేశారు. వీటిని పోస్టాఫీసు లాగిన్‌లో మార్చాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ నెల పింఛన్ మాత్రం గతంలోలాగే తీసుకుంటారని, వచ్చే నెల నుంచి ఏ ఊరు వారు అక్కడే తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్‌డీవో) చందర్ 'సాక్షి'కి వివరించారు.

జిల్లాలో మరో 160 మంది వేరే గ్రామాల్లో..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించగా 160 మంది పింఛన్‌దారులు తమ గ్రామంలో కాకుండా వేరే గ్రామాలకు వెళ్లి పింఛన్ తీసుకుంటున్నట్టు గుర్తించారు. వారికి సంబంధించిన వివరాలను కూడా ఉన్నతాధికారులకు పంపించినట్టు డీఆర్‌డీవో చందర్ తెలిపారు. వచ్చే నెల నుంచి ఈ 160 మంది కూడా వారి ఊళ్లలోనే పింఛన్లు తీసుకునే ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.



జూడాల సమ్మెతో స్తంభించిన వైద్య సేవలు

- నిరవధిక సమ్మెలో 6,000 మంది డాక్టర్లు
- మంత్రి, డీఎంఈలతో చర్చలు విఫలం... సమ్మె కొనసాగుతుందని జూడాల స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: జూనియర్ డాక్టర్ల (జూడా) నిరవధిక సమ్మె సోమవారం ప్రారంభమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బోధనాస్పత్రులు, ఇతర అనుబంధ ఆస్పత్రుల్లో వైద్యసేవలు స్తంభించాయి. అన్ని ఆస్పత్రుల్లో కలిపి దాదాపు 6,000 మంది జూనియర్ డాక్టర్లు సమ్మె చేశారు. దీంతో ఎక్కడికక్కడ ఓపీ సహా పలు వైద్యసేవలు స్తంభించాయి. గాంధీ, ఉస్మానియా, కాకతీయ, ఆదిలాబాద్, రిమ్స్ సహా అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు సంబంధించిన బోధనాస్పత్రుల్లో సేవలు నిలిచిపోయాయి. ఓపీ సేవలే కాకుండా చాలా మందికి ప్రీ సర్జరీ అనస్థీషియా చెకప్‌లు అందుబాటులో లేవు. దీంతో అనేక శస్త్రచికిత్సలు రద్దు చేశారు. అల్ట్రాసౌండ్ చెకప్‌లు, ల్యాబ్ ఇన్వెస్టిగేషన్‌లు, రేడియాలజీ సేవలు జూనియర్ డాక్టర్లే నిర్వర్తిస్తుంటారు. సమ్మె కారణంగా ఇవన్నీ నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రోగులు నానా అవస్థలు పడ్డారు. అసలే వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో జ్వరం, జలుబు, దగ్గు తదితర వ్యాధులతో జనం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అలాంటి వారంతా జూనియర్ డాక్టర్ల సమ్మెతో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్నాళ్లుగానో కోరుతున్నా పట్టించుకోకపోవడంతో జూడాలు సమ్మెలోకి దిగారు. గాంధీ ఆస్పత్రిలో చాలా మందికి ఓపీ అందుబాటులో లేకుండా పోయింది. అన్ని విభాగాల అధిపతులు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు, డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని పిలిపించి రోగుల సంరక్షణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు ఆస్పత్రి వర్గాలు అత్యవసర సమావేశం నిర్వహించాయి. అధ్యాపకుల అన్ని సెలవులు రద్దు చేశాం. అధ్యాపకుల ప్రత్యామ్నాయ డ్యూటీ రోస్టర్‌లు సిద్ధం చేసి సమర్పించాలని కోరాం. వివిధ కళాశాలలు, ఆస్పత్రులకు ప్రొఫెసర్లు, హెచ్‌ఓడీల తనిఖీ విధులు రద్దు చేశాం' అని గాంధీ అధికారులు చెప్పారు.


ఉస్మానియా కాలేజీలో ధర్నా చేస్తున్న జూడాలు

మంత్రితో చర్చలు విఫలం...

జూనియర్ డాక్టర్లతో సోమవారం వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, డీఎంఈ వాణి చర్చలు జరిపారు. అయినా సమస్యలు పరిష్కరించడంలో స్పష్టత ఇవ్వలేదని, అందువల్ల చర్చలు విఫలమయ్యాయని, ఈ నేపథ్యంలో సమ్మె కొనసాగుతుందని జూనియర్ డాక్టర్లు రాత్రి పదిగంటల సమయంలో స్పష్టం చేశారు. కొత్త హాస్టల్ సౌకర్యాలు, కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్లు, భద్రతా బలగాల మోహరింపు వంటి అంశాలపై స్పష్టత ఇవ్వలేదని జూడాల నేతలు చెబుతున్నారు. కొన్ని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని జూనియర్ డాక్టర్లు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో సమ్మెపై తాము తగ్గేది లేదని తేల్చి చెబుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి తమ సమస్యలపై సర్కార్ గేమ్ ఆడుతుందని, ప్రతీసారి మోసం చేస్తుందని జూడాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి జూడాల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే అత్యవసర సేవలు కూడా బంద్ చేస్తామన్నారు. ఇప్పటికే ఓపీ, ఎలక్టివ్ సర్జరీలు, వార్డ్ డ్యూటీలు పూర్తిగా బహిష్కరించామని, ఒకటి రెండు రోజుల్లో ఎమర్జెన్సీ సేవలనూ నిలిపివేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూడాలు బైకాట్ చేస్తే, సర్కార్ ఆస్పత్రులన్నీ అస్తవ్యస్తం అవుతాయని జూనియర్ డాక్టర్ ఒకరు తెలిపారు.

వైద్యవిద్యకు రూ. 406 కోట్లు విడుదల

- ఉత్తర్వులు జారీ చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- రెసిడెంట్ డాక్టర్లు, నర్సింగ్ వేతనాలకు ఇబ్బంది ఉండదని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్య సంచాలకుడి (డీఎంఈ) పరిధిలో పనిచేసే సిబ్బంది వేతనాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ఏడాది మొత్తానికి సరిపడా రూ. 406 కోట్ల నిధులను ప్రభుత్వం ఒకేసారి విడుదల చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ నిర్ణయం సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, టీచింగ్ మెడికల్ స్టాఫ్, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి పెద్ద ఉపశమనమన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించే వైద్యవిద్య సిబ్బంది మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాలన్న ఆలోచనతో.. ఏడాదికి సరిపడా బడ్జెట్ విడుదల చేశామని భట్టి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉమ్మడిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం: మంత్రి దామోదర

గిరిజన మహిళ ఈశ్వరమ్మ (25)కు మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పకు మంత్రి ఫోన్ చేశారు. ఆమె వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని, బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మొలచింతలపల్లికి చెందిన ఈశ్వరమ్మపై పాశవికంగా దాడి జరగడంతో ఆమె తీవ్రంగా గాయపడటం తెలిసిందే. నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నిమ్స్‌కు తరలించారు.



ఆరోగ్యశ్రీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయా ఉద్యోగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి చేసిన విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్, జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు దండోరా సంఘాల పాలాభిషేకం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటు సమయంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ పదేళ్లలో రూ.7.50 లక్షల కోట్ల అప్పులకు దిగజార్చి ఓటమి పాలయ్యారని కాంగ్రెస్ నేత సతీశ్ మాదిగ, దండోరా సంఘాల నాయకులు శ్యామ్ మాదిగ, మోజేశ్, రాంచందర్ తదితరులు మండిపడ్డారు. రూ.2 లక్షల్లోపు రుణాలను ఒకే దఫా మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం గొప్ప విషయమన్నారు. రైతు రుణమాఫీ ప్రకటనకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు దండోరా సంఘాల ఆధ్వర్యంలో పూల అభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ఖజానాను అప్పులపాలు చేసిన బీఆర్‌ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ఎలా చేస్తదో చూద్దామనే భావనలో ఉందన్నారు. రుణమాఫీ తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 2.40 లక్షల మంది పాస్

- ఫస్టియర్‌లో 63.86% సెకండియర్‌లో 43.77% ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన ఇంటర్ బోర్డ్
- రీ కౌంటింగ్, వెరిఫికేషన్‌కు 29 వరకూ గడువు

	ఫస్టియర్ ఫలితాలు		ద్వితీయ సంవత్సరం	
	జనరల్	ఒకేషనల్	జనరల్	ఒకేషనల్
పరీక్ష రాసిన వారు	2,54,498	18,913	1,38,477	15,136
పాసయిన వారు	1,62,520	10,070	60,615	7,737
ఇంప్రూవ్‌మెంట్ రాసిన వారు	1,06,484	1,633	-	-
జనరల్, అడ్వాన్స్‌డ్ కలిపి ఉత్తీర్ణులు	3,18,967	32,191	3,54,242	36,585
బాలికల ఉత్తీర్ణత	82,374	4,826	25,673	2,372
బాలుర ఉత్తీర్ణత	80,146	5,244	34,942	5,365

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు, ఒకేషనల్ కోర్సులకు కలిపి 2,40942 మంది విద్యార్థులు పాసయ్యారు. ఫస్టియర్‌లో 63.86 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా సెకండియర్‌లో 43.77 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డ్ కార్యదర్శి శ్రుతి ఓజా సోమవారం విడుదల చేశారు. ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఫస్టియర్ జనరల్‌లో 2,62,829 మంది ఉత్తీర్ణులవగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 1,62,520 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు జరిగిన సాధారణ పరీక్షల్లో 2,93,596 మంది పాసవగా అడ్వాన్స్‌డ్‌లో 60,615 మంది పాసయ్యారు. పరీక్ష రాసిన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవసరమైతే ఈ నెల 26 నుంచి 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని బోర్డ్ సూచించింది.









దీపం కింద ఒంటరిగా కూర్చుని, తెరిచివున్న పుస్తకం ముందుంచుకుని, కనబడని తరాల మనుషులతో సన్నిహితంగా సంభాషించడం- అలాంటి ఆనందం అవధులు లేనిది.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 25 జూన్ 2024

లోతైన దర్యాప్తు అవసరం

తవ్వుతున్నకొద్దీ బయటపడుతున్న జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వాకాలు చూస్తుంటే దాని వాలకం 'అయ్యవారిని చేయబోతే కోతి అయింద'న్న చందంగా మారిందని అందరికీ అర్థమైంది. జేఈఈ మెయిన్ మొదలుకొని నీట్, యూజీసీ నెట్ సహా తొమ్మిది ప్రవేశ పరీక్షలవరకూ నిర్వహిస్తున్న ఈ సంస్థ విడుదల చేసే ప్రశ్నపత్రాలు, వాటి జవాబులు గుజరాత్, హరియాణా, బిహార్, జార్ఖండ్, మహారాష్ట్ర వంటిచోట్ల 'కావలసినవారికి' బజారులో దొరికాయని సీబీఐ రంగ ప్రవేశం చేశాక తేటతెల్లమైంది. బిహార్ పోలీసులు అరెస్టు చేసిన 20 మంది నిందితులను విచారిస్తే మే 5న నిర్వహించిన నీట్–యూజీ ప్రశ్నపత్రం ఒకరోజు ముందే పీడీఎఫ్ రూపంలో వారికి వచ్చిందని తేలింది. ఎందుకో ఈ ప్రశ్నపత్రాల మాఫియా దక్షిణాది రాష్ట్రాలవైపు దృష్టి సారించినట్టు లేదు. గత పదిరోజుల వ్యవధిలో ఎన్టీఏ నిర్వహించాల్సిన నాలుగు పరీక్షలు రద్దుకావటం అసాధారణం. రెండు లక్షలమంది విద్యార్థులు రాయాల్సిన ఆదివారంనాటి నీట్ పీజీ పరీక్షను కేవలం 12 గంటల ముందు రద్దుచేశారు. ఎన్టీఏ చీఫ్ సుబోధ్ కుమార్ సింగ్ దీనంతటికీ బాధ్యుడని తేలుస్తూ ఆయన్ను తొలగించారు. అంతేనా... దీంతో పాపప్రక్షాళన పూర్తయినట్టేనా? 'ఒకే దేశం–ఒకే పరీక్ష' పేరిట ఏమాత్రం పారదర్శకతలేని ఈ వ్యవస్థను సృష్టించిన పాలకుల మాటేమిటి? గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, బెంగాల్, పంజాబ్, హరియాణాల్లో భిన్న సంస్థలు నిర్వహించిన 70కి పైగా పరీక్ష పత్రాలు లీకయ్యాయని మీడియా కథనాలు చెబుతున్నాయి. నిరుడు తెలంగాణలో పరీక్షపత్రాలు లీకవటంతో నిరుద్యోగులు భగ్గుమన్నారు. నిజాయితీగా అహోరాత్రాలూ చదివిన కోటిన్నరమంది విద్యార్థుల భవితవ్యం ఈ లీకుల పర్యవసానంగా దెబ్బతిన్నదని అంటున్నాయి. ఈ లీకుల బెడద లేకుండా అన్ని సంస్థలనూ తలదన్నేలా నెలకొల్పామని చెప్పిన ఎన్టీఏ తీరు సైతం సక్రమంగా లేదంటే ఇక ఏమనాలి?

నిజమే... వైద్య విద్యలో దేశమంతా వర్తించే ఒకే పరీక్ష నిర్వహిస్తే వేలకు వేలు ఖర్చుపెట్టడం, వేర్వేరు పరీక్షలకు సంసిద్ధం కావటంవంటి విద్యార్థుల వెతలు తీరుతాయని సర్వోన్నత న్యాయస్థానం 2011లో భావించింది. లీకులను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందనుకున్నది. కానీ ఆచరణలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. వైద్య విద్యకు ఒకే ప్రవేశ పరీక్ష ఉండేలా చర్యలు తీసుకోవాలని అప్పటి భారత వైద్య మండలి(ఎంసీఐ)కి చేసిన సూచన కాస్తా అనేక మలుపులు తిరిగి చివరకు ఇలాంటి ఉమ్మడి పరీక్ష నిర్వహణ రాజ్యాంగ విరుద్ధమని 2013లో సుప్రీంకోర్టే 2–1 మెజారిటీ తీర్పునిచ్చింది. కానీ తీర్పు ఇచ్చే ముందు ముగ్గురు న్యాయమూర్తుల మధ్యా ఎలాంటి చర్చా జరగలేదన్న కారణంతో 2016లో అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం మళ్లీ విచారించి నీట్‌ను అనుమతించింది. దేశంలో ఫెడరల్ వ్యవస్థ ఉన్నదని, ఉమ్మడి జాబితాలోని విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చేముందు రాష్ట్రాలతో, విద్యారంగ నిపుణులతో, ఇతర వర్గాలతో చర్చించాలని ఎవరూ అనుకోలేదు. ఒకపక్క హిందీ భాషాప్రాంత విద్యార్థులకు వారి భాషలో ప్రశ్నపత్రం ఇవ్వాలని నిర్ణయించిన ఎంసీఐ దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు స్థానిక భాషల్లో ఇవ్వటం కుదరదని మొరాయించింది. ఆ తర్వాత 2017లో ఎన్టీఏ ఆవిర్భవించాక 13 భాషల్లో ప్రశ్నపత్రాలు ఇస్తోంది. లీకులకు ఆస్కారంలేదని పెట్టిన వ్యవస్థ అందుకు తగ్గట్టుగా ఉందా అనేది ఉన్నతస్థాయిలో గమనించేవారే లేకపోయారు. కేంద్ర సిలబస్‌లు, ముఖ్యంగా సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్షల్లో రాష్ట్ర సిలబస్‌తో చదివినవారు రాణించగలరా అన్న సందేహమూ రాలేదు. ఫలితంగా దక్షిణాది రాష్ట్రాల్లో దశాబ్దాలుగా వర్ధిల్లుతున్న విద్యా మాఫియా జాతీయ స్థాయికి విస్తరించింది. తమిళనాడు ప్రభుత్వం నియమించిన 2021లో నియమించిన జస్టిస్ రాజన్ కమిటీ అధ్యయనం ప్రకారం నీట్‌కు ముందు ఇంగ్లిష్ మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సులకు 80.2 శాతం నుంచి 85.12 శాతంవరకూ ఎంపికయ్యేవారు. తమిళ మాధ్యమంలో చదివిన వారి శాతం 14.88 శాతం ఉండేది. కానీ నీట్ మొదలైనాక ఇంగ్లిష్ మాధ్యమం విద్యార్థులు 97 శాతంవరకూ సీట్లు తెచ్చుకుంటుండగా, తమిళ మాధ్యమం విద్యార్థుల వాటా దాదాపు 3 శాతానికి పడిపోయింది. నీట్ సాధించేవారిలో అధికాదాయ కుటుంబాల పిల్లల సంఖ్య అంతక్రితంకన్నా పెరగ్గా, నిరుపేద వర్గాల పిల్లల సంఖ్య తగ్గిందని ఆ నివేదిక వివరించింది. నీట్‌వల్ల ప్రతిభావంతులకు సీట్లు వస్తున్నాయన్న వాదనను ఆ కమిటీ ఎండగట్టింది. నీట్‌కు ముందు హెచ్ఎస్‌సీ విద్యార్థుల సగటు స్కోరు 98.1 శాతం వుండగా, ఇప్పుడది 89.05 శాతం మాత్రమే.

ఈసారి వివిధ రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఒకపక్క, ఎన్టీఏ ప్రశ్నపత్రాల లీకు మరోపక్క మన వ్యవస్థలకున్న విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీశాయి. ఇందులో మొదటిది దేశ ప్రజానీకం ఆకాంక్షల్నీ, రెండోది లక్షలాదిమంది విద్యార్థుల ఆశలనూ తలకిందులు చేసింది. ఇందువల్ల ప్రపంచంలో మనం నగుబాటుపాలయ్యామని ఇప్పటికీ ఎన్డీఏ సర్కారు గ్రహించకపోవటం, దొంగను తేలుకుట్టినట్టు వ్యవహరించటం ఆశ్చర్యకరం. ఈ ప్రపంచంలో విద్యాధనాన్ని మాత్రమే ఎవరూ కొల్లగొట్టలేరని చిన్నప్పుడు అందరం చదువుకున్నాం. కళ్లు మూసుకున్న పాలకుల నిర్వాకం కారణంగా దాన్ని సైతం ఎగరేసుకుపోవచ్చని ప్రశ్నపత్రాల మాఫియా నిరూపించింది. అందుకే ఎన్టీఏ చీఫ్‌ను సాగనంపితే సరిపోదు. ఈ మొత్తం వ్యవహారంపై న్యాయవిచారణ జరిపించి, ఇలాంటి లీకులకు ఆస్కారం లేకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

పరీక్షలు నీటుగా నిర్వహించాలంటే...

విశ్లేషణ



శ్రీధర్ రాజగోపాలన్

ఏ పరీక్ష అయినా వందలాది మంది వ్యక్తులు నిజాయితీగా ఉన్నప్పుడే లీకులు లేకుండా నిర్వహించడం సాధ్యమవుతుంది. వచ్చే ఆర్థిక లాభం ముందు తీసుకునే రిస్క్ తక్కువనిపించినప్పుడు, లీకులకు అవకాశం మరీ ఎక్కువ. పైగా ఏదోలా అడ్మిషన్ పొందితే కోర్సు దానికదే పూర్తవుతుంది అనే ధోరణి ఉన్నప్పుడు అడ్డదారులు తొక్కడం ఇంకా పెరుగుతుంది. అందుకే 'నీట్' ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో అసలు దేశంలో పరీక్షల నిర్వహణ తీరును మార్చడమే దీనికి పరిష్కారం. దేశంలో ప్రస్తుతం కాగితం, పెన్నులతో నిర్వహిస్తున్న అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్షలుగా మార్చడంతో పాటు, ప్రశ్నపత్రాల కూర్పు తీరు కూడా మారాలి.

భారతదేశంలో ఐఐటీలు లేదా ప్రతిష్ఠాత్మక వైద్య కళాశాలల్లో ప్రవేశించడం, వాటి కోర్సులు పూర్తి చేయడం కంటే కష్టం. నాతోపాటు ఐఐటీ మద్రాస్‌లో చేరిన 200 మందిలో నాలుగేళ్ల కోర్సు పూర్తిచేయని వాళ్లు దాదాపుగా లేరు. అందుకే ప్రవేశ పరీక్ష పాసయ్యేందుకు అవసరమైతే అడ్డదారులు తొక్కేందుకూ వెనుకాడరు. అర్హత లేని వారు ఒకవేళ అడ్మిషన్ పొందినప్పటికీ సకాలంలో కోర్సు పూర్తి చేయడం అసాధ్యంగా మారేలా ఉంటే... వాళ్లు ప్రవేశ పరీక్ష గట్టెక్కితే అదే పదివేలనుకునే పరిస్థితి తప్పుతుంది.



కాగితం, పెన్ను ఆధారంగా పరీక్షలు జరిగినప్పుడు కూడా పేపర్లు లీక్‌చేసే గ్యాంగ్‌లు ఉండేవి. అప్పటికి అత్యాధునిక టెక్నాలజీలతో వాళ్లు ప్రశ్న పత్రాల లీక్ చేసే వాళ్లు. అవసరమైన వాళ్లకు చేరవేసే వాళ్లు కూడా. పరీక్ష కేంద్రాల్లో లేదా ప్రశ్న పత్రాల ప్రింటింగ్ కేంద్రాల్లో కొందరితో కుమ్మక్కైతే చాలు. ఏ పరీక్ష అయినా సరే... లీకుల్లేకుండా నిర్వహించడం అనేది వందలాది మంది వ్యక్తులు నిజాయితీగా ఉన్నప్పుడు, అది కూడా భారీ మొత్తాలు ఆశ చూపినా తట్టుకునే సామర్థ్యం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. అందుకే కాగితం పెన్నుతోనైనా సరే... లీకుల్లేకుండా ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించడం అసాధ్యమే. వచ్చే ఆర్థిక లాభం ముందు తీసుకునే రిస్క్ తక్కువనిపిస్తుంది. మరి ఏమిటి చేయడం? దానికోసం నాలుగు సూచనలు:

1. దేశంలో ప్రస్తుతం కాగితం, పెన్నులతో నిర్వహిస్తున్న అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్షలుగా మార్చాలి. జేఈఈ (మెయిన్స్), ఇంకా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మూల్యాంకన పరీక్షలు ఇలాగే జరుగుతున్నాయి. హ్యాకర్లు కంప్యూటర్ ఆధారిత పరీక్షలపై దాడి చేసే అవకాశం ఉంది. అందుకని కంప్యూటర్లలో అనధికార సాఫ్ట్‌వేర్లను నియంత్రించాలి. ఎన్‌క్రిప్షన్‌తో కూడిన ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునేందుకు తొలి పది నిమిషాలు, పరీక్ష పూర్తయిన తరువాత సమాధానాలను సింక్ చేసేందుకు మరో పది నిమిషాలు మాత్రమే ఇంటర్నెట్ ఇవ్వాలి. రోజురోజుకూ మెరుగవుతున్న కృత్రిమ మేధ సాయంతోనూ హ్యాకింగ్ సమస్యను అధిగమించే అవకాశముంది.

2. ప్రవేశ పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రశ్న పత్రాలను నాణ్యంగా కూర్చడమూ ఎంతో కీలకం. ఎక్కువమందికి టాప్ స్కోర్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. మోసం చేసినా పాసవలేమన్న స్థాయిలో ప్రశ్న పత్రాలు ఉండాలి. భారత్‌లోని యూజీసీ లాంటి అత్యున్నత విద్యా వ్యవస్థల నాయకులతో సహా చాలామంది, పరీక్ష కఠినమైతే కోచింగ్ వంటివి మరింత విస్తృత స్థాయికి చేరుకుంటాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూంటారు. పరీక్ష ఎంత కఠినమైనా... ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి వాటికి కోచింగ్ ఎప్పటికప్పుడు పెరిగేదే కానీ తగ్గదు. ప్రశ్న పత్రాలను తేలికగా కూర్చడం లేదా తక్కువ పరిమితి ఉన్న సిలబస్ ఆధారంగా సిద్ధం చేయడం వల్ల మాత్రమే కోచింగ్‌కు తక్కువ ప్రాధాన్యం ఏర్పడుతుంది. కానీ అప్పుడు నాణ్యత తగ్గిపోతుంది. పరీక్ష స్థాయి ఆధారంగా ప్రశ్న పత్రం కఠినత్వం ఉండాలి. బోర్డు పరీక్షలైతే సగటు విద్యార్థులను వేరు చేయడమన్నది 50 పర్సంటైల్ వద్ద ఉండటం మంచిది. నీట్, జేఈఈ వంటి పరీక్షలైతే ఈ పర్సంటైల్ 90 – 95 మధ్య ఉంటే మంచిది. ఇందుకు పరీక్ష కఠినంగా ఉండటం అవసరం. అదే సమయంలో ప్రతిభావంతుడైన ఒక విద్యార్థి, ఆయా బోధనాంశాల్లో నైపుణ్యమున్నవారు ఇద్దరూ సరిగ్గా సమాధానాలు చెప్పేలా ఉండాలి. ఫ్యాక్చువల్ తప్పులపై ఆధారపడి ప్రశ్నలు రూపొందిస్తే (ఈ ఏడాది నీట్‌లో ఇలాగే జరిగింది) అది నాణ్యమైన ప్రశ్నపత్రం కాదు.

3. అర్థవంతమైన బహుళార్థక ప్రశ్నలు ఇవ్వాలి. ప్రవేశ పరీక్షల్లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానాలు అంచనా కట్టవచ్చుననీ, సమాధానం కచ్చితంగా తెలియకపోయినా కొన్ని మోసపు పద్ధతుల ద్వారా సరైన సమాధానం రాబట్టవచ్చుననీ అనుకుంటారు. ఇది వాస్తవం కాదు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలంటే విషయంపై లోతైన అవగాహన అవసరం. విద్యార్థుల మేధకు పరీక్ష పెట్టేలా కొన్ని తప్పుడు సమాధానాలు కూడా ఉంటాయి. కాబట్టి నీట్, జేఈఈ వంటి పరీక్షలకు ఈ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు సరిగ్గా సరిపోతాయి. వివరణాత్మకమైన సమాధానాలు రాస్తే... ప్రశ్న పత్రాలు దిద్దేవారి తీరునుబట్టి మార్కుల్లో హెచ్చుతగ్గులు వచ్చే అవకాశం ఉంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు విద్యార్థికి సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే తత్వం ఉందా, లేదా అనేది తేల్చవు. కాబట్టి కొన్ని వివరణాత్మక ప్రశ్నలూ జోడించడం మేలు. వీటిని సెకెండ్ పేపర్‌లో పెట్టి తులన అనేది టాప్ 20 శాతం విద్యార్థులకే పరిమితం (టాప్ 10 శాతం విద్యార్థులను ఎంపిక చేయడం మన లక్ష్యమైనప్పుడు) చేస్తే దిద్దడంలో తేడాలు గణనీయంగా తగ్గుతాయి.

4. నీట్, జేఈఈ వంటి పరీక్షల నిర్వహణకు అత్యంత కీలకమైన మరో అంశం పారదర్శకత. అన్ని ప్రశ్నలను బహిరంగ పరచకపోయినా నమూనా లేదా మాదిరి ప్రశ్నలు కొన్నింటినైనా జన సామాన్యానికి అందుబాటులో ఉంచాలి. ఎంత శాతం మంది విద్యార్థులు ఏ ఆప్షన్ ఎంచుకున్నారు వంటి సమాచారం అందివ్వాలి. ఈ ఆప్షన్స్‌కూ, విద్యార్థి పరీక్షలో సాధించిన మార్కులకూ మధ్య సంబంధాలను వివరించాలి. ఈ ఏర్పాట్ల వల్ల ప్రధానంగా రెండు లాభాలు ఉంటాయి. ప్రశ్న పత్రాలు కూర్చేవారు ఏకాగ్రతతో ఆ పని చేస్తారు. రెండోది పరీక్ష, నిర్వహణ... రెండింటిపై నమ్మకం పెరుగుతుంది. ర్యాంకుల నిర్ధారణకు పర్సంటైల్స్, స్కేల్డ్ స్కోర్లను జాగ్రత్తగా వినియోగించడం అవసరం. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షల్లో ఒక్కో విద్యార్థికి ఒక్కో రకమైన ప్రశ్న పత్రం వస్తుంది కాబట్టి సమాధానాల ద్వారా వచ్చిన మార్కులు అర్థం లేనివిగా మారిపోతాయి. అందుకే వీటికి బదులుగా అందరికీ తెలిసిన సైకోమెట్రిక్ టెక్నిక్‌ల సాయంతో స్కేల్డ్ స్కోర్లను నిర్ధారించాల్సిన అవసరముంది. ఈ స్కేల్డ్ స్కోర్స్ ఆధారంగా పర్సంటైల్ మార్కులు సిద్ధమవుతాయి. మోసాలను పసిగట్టేందుకు నిరర్థక ప్రశ్నలు, సైకోమెట్రిక్ అనాలసిస్, స్టాటిస్టిక్స్ వంటివి ఎంతో ఉపయోగపడతాయి. ఒకవేళ ఏదైనా నిరర్థక ప్రశ్న వస్తే వాటిని పక్కనపెట్టాలి. తప్పుడు మార్గాల్లో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేసిన వారిని డిస్‌క్వాలిఫై చేయాలి.

జేఈఈ మెయిన్స్ పరీక్ష నిర్వహణకు ప్రస్తుతం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడుతోంది. నీట్‌ను మాత్రం స్వయంగా నిర్వహిస్తోంది. నాణ్యమైన, అందరికీ ఆమోద యోగ్యమైన ప్రశ్న పత్రం తయారీ ఎన్‌టీఏకు కష్టమేమీ కాబోదు. అయితే ఈ రకమైన ప్రశ్న పత్రం తయారీని చాలా శ్రద్ధతో, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో తయారు చేయాల్సి ఉంటుంది. బోధనాంశాలపై పట్టున్నవారు, ప్రత్యేకమైన ఏజెన్సీలు, ప్రశ్నల రూపకల్పన, సమాధానాల విశ్లేషణలకు అత్యాధునిక సైకోమెట్రిక్ పద్ధతులను ఉపయోగించడం అవసరమవుతుంది. ఎందుకంటే ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఎన్‌టీఏ విశ్వసనీయతపై, అది నిర్వహించే పరీక్షలపై పెద్ద ప్రశ్న చిహ్నం పడింది కాబట్టి! సమాజం మొత్తం ఈ రకమైన స్థితికి చేరడం భవిష్యత్తులో వృత్తినిపుణులుగా ఎదగాల్సిన విద్యార్థులకు ఏమంత మంచిది కాదు.

వ్యాసకర్త 'ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్' సహ–వ్యవస్థాపకుడు ('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అభిప్రాయాలపై ఆంక్షలా?



తైవాన్ ప్రజల రాజకీయ అభిప్రాయాలకు వారి మీద ఆంక్షలు విధించే, సరిహద్దులకు ఆవల వారిని విచారణ జరిపే హక్కు చైనాకు లేదు. ప్రజాస్వామ్యం నేరం కాదు. నియంతృత్వమే నిజంగా దుర్మార్గమైనది. తైవాన్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వంతో చైనా చర్చలు జరపాలని మరోసారి నేను కోరుతున్నాను.
– లై చింగ్ టె, తైవాన్ అధ్యక్షుడు

పెరగాల్సిన పెళ్లిళ్లు



కులాంతర వివాహాలు, కులాంతర భోజనాలు మాత్రమే కులాన్ని ఓడించే మార్గాలని అంబేడ్కర్ వాదించారు. అదే తర్కాన్ని మత ఛాందసవాదాన్ని ఓడించటానికి వర్తింపజేయొచ్చు. అందుకోసమే మనం సోనాక్షి (సిన్హా)– జహీర్ (ఇక్బాల్) వివాహాన్ని ఉత్సవం చేయాల్సిన అవసరం ఉంది.
– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

సైన్యంతో సమస్యలు



'లష్కర్', 'జైశ్', 'సిపహ్'– అన్నింటి అర్థం ఒకటే. సైన్యం అని! ఇదివరకే ఉన్న భారీ సైన్యానికి తోడుగా భావజాల ఆధారిత పౌరసైన్యాన్ని సృష్టించినప్పుడే పాకిస్తాన్ సమస్యలు రెట్టింపయ్యాయి. అఫ్గానిస్తాన్, ఇండియాకు వ్యతిరేకంగా జరుపుతున్న సంప్రదాయేతర యుద్ధవ్యూహాలు పాకిస్తాన్‌కు భద్రత లేకుండా చేస్తున్నాయి.
– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

మేలు జరిగితే చాలు...



భారత మధ్యతరగతి నిజంగా అవినీతి రాహిత్యాన్ని కోరుకోదు. అవినీతిపరులకు లాగానే వాళ్లూ అంతే లాభపడుతూ, ఎవరికీ దొరికిపోకుండా ఉండే వ్యవస్థ ఒకటి వారికి కావాలి.
– ప్రియాంక లాహిరి, ఫిట్‌నెస్ కోచ్

అదిరిన చట్నీ



వెస్ట్ ఇండీస్‌లోని నాలుగో తరం భారతీయులు కరీబియన్ రెగెయ్ సంగీతానికి, ఇండియన్ పాటలను కలిపి దాన్ని చట్నీ మ్యూజిక్ అంటున్నారు.
– అనంత్ రూపనగుడి, రైల్వేమాన్

ఇన్ బాక్స్

మనం మరచిన గాంధీజీ రక్షకుడు

జాతిపిత మహాత్ముడి ప్రాణాలు కాపాడిన ఓ త్యాగశీలి జన్మదినం నేడు. ఆయన పేరు బతఖ్ మియా అన్సారీ. 1869 జూన్ 25న బిహార్‌లోని మోతీహార్ గ్రామంలో జన్మించారు. బిహార్ లోని చంపారణ్ జిల్లాలో ఆహార పంటలు వదలి, నీలిమందు లాంటి వాణిజ్య పంటలు పండించమని బ్రిటిష్ వలస పాలకులు రైతులను నిర్బంధించేవారు, హింసించేవారు. ఈ అకృత్యాలను వివరించి అక్కడి రైతులను పరామర్శించమని ఆ ప్రాంతంవారు కొందరు గాంధీజీని అభ్యర్థించారు. దీంతో 1917 ఏప్రిల్‌లో ఆయన అక్కడికి వెళ్లారు. దీంతో ఇర్విన్ అనే బ్రిటిష్ ఇండిగో ఎస్టేట్ మేనేజర్ గాంధీజీని భోజనానికి ఆహ్వానించి అంతం చేయాలని పథకం పన్నాడు. తన వంటమనిషి బతఖ్ మియా అన్సారీని పిలిచి, గాంధీజీకి పాలలో విషం కలిపి ఇచ్చి చంపాలని ఆదేశించాడు. ఈ పని చేస్తే జీతం పదింతలు పెంచుతాననీ, విలువైన భూములు ఇస్తాననీ చెప్పాడు. బాబూ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గాంధీజీ భోజనానికి వచ్చారు. ఇర్విన్ ఆజ్ఞను ధిక్కరిస్తే గతి ఏమవుతుందో తెలిసినప్పటికీ, పాలు అందిస్తూనే అందులో విషం కలిపిన విషయాన్ని ఆయన గాంధీజీకి చెప్పి ఆయన ప్రాణాలు రక్షించారు. అగ్గిమీద గుగ్గిలమైన ఇర్విన్ ఆ తరువాత అన్సారీ ఇంటినీ, ఆయనకున్న కొద్దిపాటి భూమినీ జప్తుచేయించి ఊరి నుండి వెళ్ళగొట్టాడు.



బతఖ్ మియా అన్సారీ

1950లో మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ మోతీహార్ వెళ్ళి ఒక సభలో ప్రసంగిస్తుండగా తనను కలవడానికి ప్రయత్నిస్తున్న అన్సారీని వేదికపైకి పిలిచి ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నారు. ఇర్విన్ అకృత్యాలు విని విచలితుడై అప్పటికప్పుడు 50 ఎకరాల భూమిని అన్సారీ, ఆయన ముగ్గురు కుమారుల కుటుంబాలకూ కేటాయించాల్సిందిగా ఆదేశించారు. అన్సారీ ఏడేళ్ళపాటు కార్యాలయాల చుట్టూ తిరిగినా రాష్ట్రపతి ప్రకటించిన భూమి ఆయనకు దక్కలేదు. చివరికి 1957 డిసెంబర్ 4న కన్ను మూశారు. మొత్తంమీద ఒక ఆరు ఎకరాల భూమిని ఓ నది ఒడ్డున జిల్లా కలెక్టర్ కేటాయించారు. ప్రస్తుతం నది కోతకు గురై ఐదెకరాల భూమి మాయమై ఎకరం మిగిలింది. ఇప్పటికీ తమకు రావలసిన భూమికోసం అన్సారీ కుటుంబీకులు అర్జీలు పట్టుకుని తిరుగుతూనే ఉన్నారు.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు బతఖ్ మియా అన్సారీ జయంతి)

శాస్త్రీయత లేని మద్దతు ధరల నిర్ణయం

అభిప్రాయం



సారంపల్లి మల్లారెడ్డి

కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి గాను 14 రకాల పంటలకు మద్దతు ధరను ప్రకటించింది. గత ఏడాది మద్దతు ధరలపై 5 శాతం నుండి 7 శాతం వరకు మాత్రమే పెంచి ప్రకటించింది. వాస్తవానికి ఈ పెంచిన ధరలు ప్రైవేట్ మార్కెట్లలో ఇప్పటికే అమలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్కెట్లలో ఏనాడూ అమలు కాలేదు, ఇప్పుడూ కావడం లేదు. పత్తి, వరి మినహా మిగిలిన పంటలకు ధరలు అమలు జరపడానికి ఏలాంటి వ్యవస్థా లేదు. కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్టు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి ధర నిర్ణయం అయ్యింది.

మద్దతు ధర నిర్ణయంలో ఉత్పత్తి ధర కీలకంగా ఉంటుంది. 2024–25 సంవత్సరానికి ధాన్యం ఉత్పత్తి ధర క్వింటాల్‌కు రూ. 1,523గా నిర్ణయించి దానికి 50 శాతం కలిపారు. వాస్తవానికి 2023–24లో క్వింటాల్ ధాన్యం ఉత్పత్తి ధర రూ. 2,100గా తెలంగాణతో సహా అనేక రాష్ట్రాలు కేంద్రానికి నోట్ పంపాయి. దానిని గమనంలోనికి తీసుకున్నప్పుడు క్వింటాల్ ధాన్యానికి రూ. 3,150గా నిర్ణయించాలి. క్వింటాలున్నర ధాన్యానికి క్వింటాల్ బియ్యం వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ బియ్యం ధర రూ. 5,500 నుండి రూ. 6,000 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. క్వింటాల్ ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు రూ. 3,150 నిర్ణయించినప్పటికీ క్వింటాలు బియ్యానికి రూ. 4,650 లకు అమ్మవచ్చు. అయినప్పటికీ క్వింటాల్‌కు రూ. 500 నుండి రూ. 1,500ల వరకు లాభం ఉంటుంది.



పప్పుధాన్యాలకు నిర్ణయించిన ధరల ప్రకారం ముడిపప్పును క్వింటాలుకు కందులు రూ. 7,550కి కొనుగోలు చేసినప్పటికీ 80 కిలోల పప్పు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పప్పు ధర కిలో రూ. 150 నుండి రూ. 180 వరకు ఉంది. అనగా 80 కిలోలు రూ. 12,000 నుండి రూ. 14,640 వరకు గిట్టుబాటు అవుతుంది. ధాన్యం కానీ, పప్పు ధాన్యాలు కానీ మిల్లు ఆడించినందుకు మిల్లర్‌కు దాని నుండి వచ్చిన ఊక, నూక, పరం, తవుడు తీసుకొని తయారైన సరుకులు ఇస్తారు. కొన్ని సందర్భాల్లో క్వింటాలుకు రూ. 100ల లోపు చార్జీ వేస్తారు. దీనిని బట్టి పరిశీలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరలు రైతుకు కనీసం పెట్టుబడి వచ్చే విధంగా లేవు. ధరల నిర్ణయ విధానంలో తీసుకున్న 'ఉత్పత్తి ధర' అత్యంత మోసపూరితమైనది. వాస్తవ ఉత్పత్తి ఖర్చును ఏనాడూ లెక్కలోకి తీసుకోలేదు.

'ధరల నిర్ణాయక కమిషన్' (సీఏసీపీ) గణాంకాల ద్వారా సేకరించిన సగటు ఉత్పత్తి ధరను కేంద్ర ప్రభుత్వం ఏనాడూ పరిగణనలోకి తీసుకోలేదు. ఆ కమిషన్ రికమండేషన్‌ను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం నిర్ణయించిన మద్దతు ధరలు 60 శాతానికి పైగా పెరగాలి. కమిషన్ రికమండేషన్‌ను క్యాబినెట్ కమిటీ చర్చించి మద్దతు ధరలను నిర్ణయిస్తుంది. వాస్తవానికి కమిషన్ రికమండేషన్‌ను క్యాబినెట్ కమిటీ పరిగణనలోకి తీసుకున్నట్టు కనపడదు.

క్యాబినెట్ కమిటీ ప్రకటించిన ధరలు అమలు జరుపడానికి మార్కెట్ యంత్రాంగం లేదు. మార్కెట్లు రాజ్యాంగం రీత్యా రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. మార్కెట్ కమిటీలు మధ్యదళారీలకు, కార్పొరేట్ సంస్థలకు లోబడి ఉంటాయి. అందువల్ల నిర్ణయించిన మద్దతు ధరలు కూడా అమలు జరుగడం లేదు. మద్దతు ధరలు శాస్త్రీయంగా నిర్ణయించకపోవడం, నిర్ణయించిన వాటిని అమలు జరుపకపోవడం వలన ఏటా రైతులు రూ. 4 లక్షల కోట్ల ఆదాయాన్ని నష్టపోతున్నారు. ఇతర రంగాలకు ఇస్తున్నట్లు ఉచితాలు, మినహాయింపులూ వ్యవసాయ ఉత్పత్తులకు లేవు. పైగా బ్యాంకులు పంట రుణాలు తగ్గించడం వల్ల అత్యధిక వడ్డీకి ప్రైవేట్ అప్పులు తెచ్చి రుణగ్రస్థులు అవుతున్నారు. ఆ రుణాలు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

భారతదేశంలో వ్యవసాయదారుల ఉత్పత్తులకు తక్కువ ధరలు నిర్ణయించి, ఆ ఉత్పత్తులు వినియోగదారులకు చేరేటప్పటికి అత్యధిక ధరలుగా మారేలా వ్యవస్థ ఉండటంతో మధ్య దళారీలు, కార్పొరేట్ సంస్థల వాళ్లు 50 శాతం నుండి 100 శాతం వరకు లాభాలు సంపాదిస్తున్నారు. ఈ లాభాలు మరిన్ని పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వంపై ప్రభావం చూపి కనీస మద్దతు ధరలు పెరగకుండా చూస్తున్నారు.

ఈ పరిస్థితిని అధిగమించడానికి రైతులు, రైతు సంఘాలు గత మూడేళ్లుగా 'మద్దతు ధరల చట్టాన్ని' పార్లమెంటు ఆమోదించాలని పార్లమెంట్‌లో ముసాయిదా బిల్లును కూడా ప్రవేశపెట్టారు. కార్పొరేట్ సంస్థల ప్రభావానికి లొంగి ఆ చట్టాన్ని చర్చించకుండా పెండింగ్‌లో పెట్టింది ప్రభుత్వం. ఒకవైపున ప్రధాని ఆ చట్టాన్ని చర్చిస్తానని రాతపూర్వకంగా రైతుసంఘాలకు హామీ ఇవ్వడంవల్ల అవి తాము సాగిస్తున్న 11 మాసాల పోరాటాన్ని ఉపసంహరించుకున్నాయి. కేంద్రం మాట తప్పడంతో తిరిగి 135 రోజులుగా (జూన్ 25 నాటికి) ఢిల్లీలో వేల మంది రైతులు ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. కొద్దిమంది దళారీలు, కార్పొరేట్ల ప్రయోజనాన్ని, లాభాలను పెంచడానికి చేస్తున్న ఈ ప్రయత్నం వల్ల వ్యవసాయంపై ఆధారపడి ఉన్న 52 శాతం ప్రజలు అనగా 70 కోట్ల మంది జనం నష్టపోతున్నారు. అందుకే మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించాలంటే ఉత్పత్తి వ్యయాన్ని న్యాయంగా నిర్ణయించాలి.

వ్యాసకర్త ఏఐకెఎస్ మాజీ ఉపాధ్యక్షులు ၊ 94900 98666

ఆచరణ ముఖ్యం

జ్యోతిర్మయం

ఒక రోజు బోధివనానికి వచ్చిన ఓ నడివయస్కుడు బోధిసత్త్వుని పాదపద్మాలను తాకి నమస్కరించాడు. చిరునవ్వుతో అతని వివరాలు అడిగాడాయన. 'దేవా నా పేరు అభినందనుడు. నేను పేద వాడిని. నాకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. లౌకిక పాశాల్లో చిక్కుకుని తల్లడిల్లుతున్నాను. మీరే దైనా పరిష్కారం చెప్పాలి. మీరే నాకు జ్ఞానమార్గం చూపాలి' అని వేడుకున్నాడు ఆ వ్యక్తి.

బోధిసత్త్వుడు 'అభినందనా, ఈ చెట్లకున్న ఆకులను చూడు. అవన్నీ ఎందుకు కదులుతున్నాయో తెలుసా... గాలి వచ్చి ఢీకొనడంతో కదులుతున్నాయి. పాశమనే గాలి వచ్చి ఢీకొన్నప్పుడల్లా మనిషి ఆకులా ఇలా ఊగుతాడు. మొదట నీ మనసులో ఉన్న లౌకిక పాశాలను తెంచుకో. అప్పుడే నీవు జ్ఞానమార్గంలో నడవగలవు. అది నీ వల్ల సాధ్యమేనా?' అన్నాడు. సాధ్యమే అన్నాడు అభినందనుడు. అయితే ఈరోజు నుంచి నువ్వు ఇక్కడే ఉండన్నాడు బోధిసత్త్వుడు.

అభినందనుడు అక్కడే ఉండిపోయాడు. కొద్ది రోజులు సన్యాసి జీవితం చక్కగానే గడిపాడు. క్రమంగా అతడు మళ్లీ లౌకిక బంధనాల్లోకి జారుకోవడాన్ని బోధిసత్త్వుడు గమనించాడు.

ఒక రోజు అభినందనుని పిలిచి రెండు పాత్రలు తీసుకున్నాడు. ఓ పాత్రలో రకరకాల పదార్థాలు ఉన్నాయి. మరొకటి ఖాళీ పాత్ర. పదార్థాలు ఉన్న పాత్రను నీటిలో వదిలేశాడు. అది లోపలికి మునిగిపోయింది. ఖాళీ పాత్రను నీటిలో వేశాడు. అది తేలియాడుతూ కనిపించింది. 'బరువైన పాత్ర కనిపించకుండా పోయింది. ఖాళీ పాత్ర తేలుతోంది. ఖాళీ పాత్ర ఉంది చూశావూ, అది జ్ఞానపాత్ర. బరువైన పాత్ర ఉంది చూశావూ, అది బంధనాల పాత్ర. నేను సన్యాసినవుతాననీ, జ్ఞానినవుతాననీ చెప్పడం సులభం. కానీ ఆచరణ కొచ్చేటప్పటికి అది చాలా కష్టం. అది అంత సులభమైన విషయం కాదు. ఆశనూ, లౌకిక పాశాలనూ వదులుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. ఇప్పుడు నువ్వేంటో నీకు అర్థమై ఉండాలి' అన్నాడు బోధిసత్త్వుడు. అప్పటి నుంచి పూర్తిగా ఆధ్యాత్మిక మార్గంలో నడిచాడు అభినందనుడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.చవితి రా.1.08 వరకు, తదుపరి పంచమి; **నక్షత్రం:** శ్రవణం సా.4.50 వరకు, తదుపరి ధనిష్ఠ; **వర్జ్యం:** రా.8.36 నుండి 10.06 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.39 వరకు; **అమృత ఘడియలు:** ఉ.6.54 నుండి 8.24 వరకు, తిరిగి తె.5.52 నుండి 7.24 వరకు(తెల్లవారితే బుధవారం); **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు; **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **సూర్యోదయం:** 5.31; **సూర్యాస్తమయం:** 6.34. సంకటహర చతుర్థీ

నేతన్నల ఆత్మహత్యలు..ప్రభుత్వహత్యలే

- ఇప్పటికే పదిమంది ఆత్మహత్య చేసుకున్నారు
- బాధిత కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: గడిచిన పదేళ్లుగా కళకళలాడిన చేనేతరంగం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విషాదకర పరిస్థితిని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయిన కార్మికుల జీవితాలు దుర్భరంగా మారినా ప్రభుత్వం కనికరించక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సోమవారం బహిరంగలేఖ రాశారు. 'నేతన్నల కోసం గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఆపేయడంతో ఉపాధి కోల్పోగా, పవర్ లూమ్స్ పూర్తిగా మూతపడ్డాయి. దీంతో చేనేత కార్మికులు, పవర్‌లూమ్ యజమానులు రోడ్డున పడ్డారు. మరమగ్గాలను తూకం వేసి అమ్ముకునే దుస్థితి వచ్చింది. నేతన్నలకు పని లేక మళ్లీ ఆకలి చావులే దిక్కై ఆత్మగౌరవం చంపుకోలేక తమను తాము చంపుకుంటున్నారు. సిరిసిల్ల, కరీంనగర్‌తో పాటు టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మంతో కలుపుకొని ఇప్పటి వరకు పదిమంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యంతోనే నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు చోటు చేసుకుంటున్నాయి. వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలుగా భావిస్తున్నాం. బాధిత కుటుంబాలకు వెంటనే రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

నేతన్నల కష్టాలు పట్టించుకోరా?

'కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ నేత కార్మికుల కష్టాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ ఉద్యమకాలం నుంచే నేత కార్మికుల కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారు. సిరిసిల్ల కార్మికుల కోసం రూ.50లక్షలతో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నేత పరిశ్రమను ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించారు. చేనేతమిత్ర, నేతన్నకు చేయూత, నేతన్న బీమా వంటి కార్యక్రమాలు ప్రారంభించడంతో పాటు మగ్గాల ఆధునికీకరణ, రుణమాఫీ, మార్కెట్ అనుసంధానంతో కూడిన విధానం అవలంబించింది. కార్మికులకు చేతినిండా పనికల్పిస్తూ బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ కానుకలకు ఆర్డర్లు ఇచ్చింది. సంక్షోభం నుంచి గట్టెక్కిందనుకున్న చేనేత రంగంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. నేత పరిశ్రమను దెబ్బతీస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం వెంటనే తన తీరు మార్చుకోవాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను భేషజాలకు వెళ్లకుండా కొనసాగించాలి. మరణశయ్యపై ఉన్న మరమగ్గాల పరిశ్రమను ఆదుకోవాలి. పవర్‌లూమ్స్, నేత పరికరాలపై 90 శాతం సబ్సిడీని వెంటనే అమలు చేయాలి. లేని పక్షంలో కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది' అని కేటీఆర్ హెచ్చరించారు.

భూమి లేకుంటే..బతికున్నా లేనట్టే

నాలుగోసారి రైతు ఆత్మహత్యాయత్నం



జనగామ కలెక్టరేట్‌పై పురుగుల మందు తాగుతున్న నర్సింగరావు

జనగామ: వారసత్వంగా రావాల్సిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల నుంచి తిరిగి ఇప్పించాలని పోరాటం చేస్తున్న ఓ రైతు నాలుగోసారి ఆత్మహత్యకు యత్నించిన ఘటన జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింగరావు తాత మైసయ్య పేరిట 8 ఎకరాల భూమి ఉంది. 22 ఏళ్ల క్రితం నర్సింగరావు కుటుంబం ములుగుజిల్లాకు వలస వెళ్లింది. తాత పేరిట ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇద్దరు సోదరులతో కలిసి ఐదేళ్ల క్రితం రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లగా, భూమి మరొకరి పేరు మీద పట్టా అయ్యింది. దీంతో వారు ఆందోళనకు గురయ్యారు. అప్పటి తహసీల్దార్ జె.రమేష్, వీఆర్‌ఓ క్రాంతి తప్పుడు ధ్రువీకరణతో అదే గ్రామానికి చెందిన నలుగురి పేరుపై రిజిస్ట్రేషన్ చేసినట్టు బాధితుడు నర్సింగరావు వాపోయాడు. న్యాయం జరగకపోవడంతో 2021 నుంచి మూడుసార్లు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం పైన నిలబడి ఫ్లెక్సీతో నిరసన తెలుపుతూ, అందరూ చూస్తుండగానే పురుగుల మందు తాగి అక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అక్కడికి చేరుకొని బాధితుడిని బుజ్జగించారు. ఇంతలోనే సీఐ రఘుపతిరెడ్డి భవనంపైకి చేరుకొని నర్సింగరావును కిందకు తీసుకొచ్చి తన వాహనంలోనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. విచారణ చేపట్టాలని ఇన్‌చార్జ్ డీపీఓ అనిల్‌కు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదేశాలు జారీ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు మరణ వాంగ్మూలం

'సీఎం రేవంతన్న.. మంత్రి సీతక్క నేను చనిపోతున్నా. నా భూమిని రెవెన్యూ అధికారులు మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఎవరూ పట్టించుకోలేదు. నేనే చనిపోతున్నా.. ఇదే మరణ వాంగ్మూలం అనుకోండి. న్యాయం చేసేలా చూడాలి'అని కోరుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింగరావు ఫ్లెక్సీ ద్వారా తన బాధ వెళ్లగక్కారు. నా భూమి లేనప్పుడు..బతికి ఉన్నా లేనట్టే అంటూ విలపించాడు.

'రైతు నేస్తంలో రైతు భరోసాపై అభిప్రాయాలు చెప్పండి'

సాక్షి, హైదరాబాద్: 'రైతు నేస్తం'వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం జరుగుతుందని, రైతు భరోసాపై రైతులు తమ అభిప్రాయాలు తెలిపేలా చూడాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీ ఏకకాలంలో పూర్తి చేస్తామంటే ఒకరేమో కట్టింగ్ మాస్టర్ అన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి కట్టింగ్ మాస్టర్ కాదని.. కరెక్షన్ మాస్టర్ అని తుమ్మల వెల్లడించారు.

ఊరంతా అండగా నిలిచారు..

- మృతుడి కుటుంబానికి రూ.1.64 లక్షల ఆర్థికసాయం
- ఆదర్శంగా నిలిచిన తొగర్రాయి గ్రామస్తులు



రఘు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న తొగర్రాయి గ్రామస్తులు

దుగ్గొండి: ఓ నిరుపేద దళిత యువకుడు అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబం రోడ్డున పడింది. దీంతో ముగ్గురు చిన్నారుల భారం తల్లిపై పడింది. ఆ కుటుంబ దీనస్థితిని చూసిన గ్రామస్తులంతా చలించిపోయారు. తలాకొంత జమచేసి ఆర్థికంగా అండగా నిలిచారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన హన్మకొండ రఘు (36), జమునలకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రెండు నెలల క్రితం రఘు తీవ్ర అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో పిల్లలను ఎలా సాదాలంటూ జమున బోరున విలపించింది. వారి దీనస్థితిని చూసిన గ్రామస్తులంతా ఒక్కటై తలాకొంత డబ్బు జమచేశారు. రూ. 1,64,000 ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి సోమవారం అందించారు. కార్యక్రమంలో ఓడేటి తిరుపతిరెడ్డి, కాట్ల భద్రయ్య, ఆవుల నర్సింహారెడ్డి, రాస చేరాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో మండల కేంద్రానికి చెందిన తోకల సాక్షి ఉరఫ్ సోని (17) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లిలో ఉంటున్న తోకల రవి-లక్ష్మి దంపతులకు కొడుకు సిద్ధార్థ, కూతురు సాక్షి సంతానం. రవి బీడీ కంపెనీ నడిపిస్తుండగా లక్ష్మి ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నారు. కూతురు సోని మండేపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదువుతోంది. సెకండియర్ గణితంలో ఫెయిల్ కావడంతో ఇటీవల సప్లిమెంటరీ పరీక్ష రాసింది. అయితే సోమవారం వెలువడిన ఫలితాల్లోనూ తిరిగి ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి మత్తడిలో పడిన కారు

- నీట మునిగి రైతు మృతి
- ఎస్సారెస్పీ వరద కాలువ కట్టపై ప్రమాదం



గాదెపల్లి రమేశ్(ఫైల్)

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామం వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ కట్టపై కారు అదుపుతప్పి కింద ఉన్న మత్తడివాగులో పడిపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పడగల్ గ్రామానికి చెందిన గాదెపల్లి రమేశ్ (56)కు పోచంపల్లి గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. వరద కాలువ కింద నుంచి పోచంపల్లి మత్తడివాగు పంట భూముల వైపు ప్రవహిస్తుంది. వాగులో పంపుసెట్లు ఏర్పాటు చేసుకొని రమేశ్ తన పంటభూములకు పైపులైను ద్వారా నీటిని తీసుకుంటాడు. ఈ క్రమంలో సోమవారం తన ఇద్దరు పాలేర్లను కారులో ఎక్కించుకొని పడగల్ నుంచి వరద కాలువ కట్టపై ప్రయాణించి మత్తడివాగు వరకు చేరుకున్నారు. పాలేర్లను పంపుసెట్ల వద్దకు వెళ్లాలని చెబుతూ వారిని దించేశాడు. తాను కారును అక్కడే రివర్స్ తీసుకొని పడగల్ వైపు తిప్పుకునే ప్రయత్నంలో కారు అదుపుతప్పి కట్టపై నుంచి మత్తడి వాగులో పడిపోయింది. వరద కాలువ కట్ట ఎత్తు సుమారు 20 మీటర్లు ఉండటం, మత్తడి లోతు కూడా ఎక్కువగా ఉండడంతో కారు పల్టీలు కొడుతూ మత్తడిలో పడిపోయింది. పాలేర్లు వెంటనే పడగల్‌కు చేరుకొని గ్రామస్తులను ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వినయ్‌కుమార్ అగ్నిమాపక సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మత్స్యకారులు అశోక్, ఠాకూర్, కిషన్‌ల సహాయంతో కారును వెలికి తీయించారు. కారులోని రమేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. రమేశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, కుమారుడు, కోడలు అమెరికాలో ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్నెల్ల క్రితం రమేశ్ సోదరి, మూడు నెలల క్రితం తల్లి చనిపోయారు. ఇప్పుడు రమేశ్ చనిపోవడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

రామచంద్రయ్యకు అంతిమ వీడ్కోలు



ఐటీడీఏ అధికారులతో మాట్లాడుతున్న సకిని బాబూరావు, కుటుంబ సభ్యులు

మణుగూరు టౌన్: కంచు తాళం, కంచుమేళం వాయిద్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య దహన సంస్కారాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బావి కూనవరం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ముగిశాయి. తన తండ్రికి ప్రభుత్వం ప్రకటించిన నజరానా, ఇంటి స్థలం, ఐటీడీఏలో ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నెలకు రూ.25 వేల గౌరవ వేతనం కాగితాలకే పరిమితం అయ్యాయని, కనీసం అంత్యక్రియలైనా అధికార లాంఛనాలతో నిర్వహించాలని రామచంద్రయ్య కుమారుడు బాబూరావు కోరారు. అయితే, అది సాధ్యం కాదని అధికారులు సర్దిచెప్పడంతో చివరకు సాధారణంగానే జరిపించారు. కాగా, ఉద్యోగులు మృతిచెందితే దహన సంస్కారాలకు ఇచ్చే రూ.20 వేల మొత్తాన్ని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, రామచంద్రయ్య కుటుంబసభ్యులకు అందజేశారు. నెలకు రూ.25 వేల చొప్పున గౌరవ వేతనం ఏరోజూ ఇవ్వకుండా.. తోటి ఉద్యోగి అనడంలో ఆంతర్యం ఏంటని రామచంద్రయ్య కుటుంబీకులు నిలదీయడంతో.. గిరిజన సంక్షేమ శాఖ నుంచి మాత్రమే ఇస్తున్నామని అధికారులు వివరించారు. కాగా, రామచంద్రయ్య భౌతిక కాయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.





ఎంపీగా ప్రమాణం చేశాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ప్రధాని మోదీ ● పార్లమెంట్ నూతన భవనంలో కొలువుదీరిన 18వ లోక్‌సభ

సభ్యుల ప్రమాణ స్వీకారం

తొలుత ప్రమాణం చేసిన మోదీ

- తర్వాత ప్యానెల్ స్పీకర్లు, మంత్రులు..
- తర్వాత అక్షరమాల ప్రకారం రాష్ట్రాలవారీగా సభ్యుల ప్రమాణం

న్యూఢిల్లీ: లోక్‌సభ తొలిరోజు సమావేశాల్లో ప్రమాణస్వీకార పర్వం కొనసాగింది. సోమవారం ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్యానెల్ స్పీకర్‌లు రాధా మోహన్ సింగ్, ఫగన్ సింగ్ కులస్తేలు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు రాష్ట్రపతిభవన్‌లో భర్తృహరి చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణంచేయించారు. ఆ తర్వాత లోక్‌సభ ప్రారంభం అయిన వెంటనే వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన రాజీనామాను ఆమోదించినట్లు ప్రొటెం స్పీకర్ మెహతాబ్ ప్రకటించారు. అనంతరం 11:07 గంటలకు ప్రధాని మోదీ వరుసగా మూడోసారి ఎంపీగా హిందీలో ప్రమాణం చేయడంతో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆరంభమైంది. ప్రధాని తర్వాత ప్యానెల్ స్పీకర్లు రాధామోహన్, కులస్తేలు ప్రమాణం చేశారు. తర్వాత మంత్రిమండలి సభ్యులు ఒకరి తర్వాత ఒకరు ప్రమాణం చేశారు. ముందుగా కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ తదితర మంత్రులు ప్రమాణం చేశారు. తర్వాత స్వతంత్ర హోదా ఉన్న సహాయకమంత్రులు తర్వాత సహాయక మంత్రులు ప్రమాణంచేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణం చేసేందుకు వెళ్తున్న సమయంలో 'నీట్ ఫెయిల్డ్ మినిస్టర్', నీట్–నెట్ అంటూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. తర్వాత మెహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించినందుకు నిరసనగా కాంగ్రెస్ సభ్యుడు కె.సురేశ్, డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, టీఎంసీ సభ్యుడు సుదీప్ బంధోపాధ్యాయ్‌లు స్పీకర్‌ప్యానెల్ సభ్యులుగా ప్రమాణం చేయలేదు. ఎనిమిదిసార్లు ఎంపీగా గెలిచిన దళిత నేత సురేశ్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపికచేయనందుకు నిరసన తెలపాలని విపక్షపార్టీలు నిర్ణయించిన నేపథ్యంలో ఈ ముగ్గురు ప్యానెల్ స్పీకర్ల పదవులకు దూరంగా ఉండిపోయారు. ప్రమాణస్వీకారం మొదలుకాగానే సురేశ్, టీఆర్ బాలు, సుదీప్‌లు సభ నుంచి వాకౌట్‌చేశారు. ప్యానెల్ సభ్యుల ప్రమాణంవేళ ' రాజ్యాంగ ఉల్లంఘన' అని విపక్షసభ్యులు నినాదాలు చేశారు. తర్వాత అక్షరమాల ప్రకారం రాష్ట్రాలవారీగా సభ్యులు ప్రమాణంచేశారు. మిగతా సభ్యులు మంగళవారం ప్రమాణం చేయనున్నారు.

పలు భాషల్లో ప్రమాణాలు

ప్రమాణస్వీకారం వేళ సభలో భాషా వైవిధ్యం కనిపించింది. పలువురు ఎంపీలు తమ మాతృభాషలో ప్రమాణంచేశారు. ఇంగ్లిష్‌తోపాటు సంస్కృతం, డోగ్రీ, బెంగాలీ, అస్సామీ, ఒడియా, మరాఠీ, తదితర భాషల్లో ప్రమాణంచేశారు. అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ, జ్యోతిరాదిత్య సింధియా, ఖట్టర్ హిందీలో ప్రమాణంచేశారు. ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కన్నడలో, విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒడియాలో, పోర్ట్‌లు, నౌకాయాన మంత్రి సర్బానంద సోనోవాల్ అస్సామీలో, విద్యుత్, పునరుత్పాదక ఇంధన సహాయ మంత్రి శ్రీపాద్‌వై నాయక్ సంస్కృతంలో, పర్యాటకం , పెట్రోలియం మంత్రి సురేష్ గోపి మలయాళంలో సభ్యులుగా ప్రమాణం చేశారు. లోక్‌సభ ప్రారంభానికి శుభసూచకంగా సభ్యులంతా తొలుత లేచి నిలబడి కొద్దిసేపు మౌనంగా ఉన్నారు.

తొలి వరుసలో రాహుల్, అఖిలేశ్

సభలో విపక్షాలకు కేటాయించిన కుర్చీల్లో మొదటి వరుసలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, టీఎంసీ నేత కళ్యాణ్ బెనర్జీ, ఎస్పీ నేతలు అఖిలేశ్ యాదవ్, అవధేశ్ ప్రసాద్‌లు కూర్చున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మూడో వరుసలో కూర్చున్నారు. తొలిసారి సభకు ఎన్నికైన దివంగత సుష్మాస్వరాజ్ కుమార్తె భాన్సురీ స్వరాజ్ సభలో అందరినీ పలకరిస్తూ కనిపించారు. సెల్ఫీలు దిగారు. ఎస్పీ సభ్యులు ఎర్రని టోపీలు, ఎర్ర కండువాలు ధరించి హిందీలో ముద్రించిన రాజ్యాంగ ప్రతులను పట్టుకొచ్చారు.

సభలో హైలైట్స్

- రైతు నేత, సీపీఐ (ఎం) ఎంపీ అమ్రా రామ్ ట్రాక్టర్‌లో పార్లమెంట్‌కు వచ్చారు.
- 'రేసుగుర్రం' నటుడు, బీజేపీ ఎంపీ రవికిషన్ ధోతీలో అలరించారు.
- శ్వేతవర్ణ చీరకట్టులో మండీ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
- తిహార్ జైలులో ఉన్న బారాముల్లా స్వతంత్ర ఎంపీ, నిందితుడు అబ్దుల్లా రషీద్ షేక్ బెయిల్ దొరక్కపోవడంతో ప్రమాణం చేయలేకపోయారు.
- టీవీ రాముడు అరుణ్ గోవిల్ అందరితో మాట్లాడుతూ కనిపించారు.
- కొందరు సభ్యులు తమ రాష్ట్ర సంప్రదాయ వస్త్రధారణలో కనిపించారు.
- తొలిసారి ఎంపీగా గెలిచిన మధ్యప్రదేశ్ బీజేపీ నాయకురాలు అనిత నగర్‌సింగ్ చౌహాన్ వేళ్లకు పెద్ద ఉంగరాలు, మెడలో భారీ సంప్రదాయ నగలతో సభకు వచ్చారు.
- మోదీ ప్రమాణం చేసేటపుడు ఎన్‌డీఏ నేతలంతా జైశ్రీరాం అని నినాదాలు చేశారు. అప్పుడు విపక్ష సభ్యులంతా లేచి రాజ్యాంగ ప్రతిని చూపించారు. కొందరు సభ్యులు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి లోపలికి వచ్చారు

రాజ్యాంగం వర్ధిల్లాలి

పార్లమెంట్ ప్రాంగణంలో 'ఇండియా' ఎంపీల నినాదాలు

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ ప్రారంభమైన తొలి రోజే ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీల నినాదాలతో పార్లమెంట్ ప్రాంగణం దద్దరిల్లింది. సోమవారం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా పార్లమెంట్ ప్రాంగణంలో గతంలో గాంధీజీ విగ్రహం ఉన్నచోట విపక్ష ఎంపీలు గుమికూడారు. రాజ్యాంగం ప్రతులను చేతబూని నినాదాలు చేశారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలి, రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం, మనమంతా కలిసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి అంటూ బిగ్గరగా నినదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం జోలికి రావొద్దు: రాహుల్

పవిత్రమైన మన రాజ్యాంగంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా నిస్సిగ్గుగా దాడి చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగం జోలికి రావొద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష కూటమి సందేశం ప్రజల్లోకి వెళ్లిందన్నారు. రాజ్యాంగంపై ఎవరు దాడికి దిగినా సహించబోమని తేల్చిచెప్పారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. దేశంలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనలకు ప్రధాని మోదీ బాధ్యత వహించాలన్నారు. దేశంలో ఏ శక్తి కూడా రాజ్యాంగాన్ని టచ్ చేయలేదని తేల్చిచెప్పారు. రాజ్యాంగాన్ని కచ్చితంగా కాపాడుకుంటామని స్పష్టంచేశారు.

ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ప్రజా సమస్యలను పక్కనపెట్టి, ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో ప్రధాని మోదీ బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. రాజ్యాంగంపై దాడి చేయడాన్ని తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రజల గొంతుకను సభలో వినిపిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నుంచి మోదీ తప్పించుకోలేరని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 15 రోజుల్లో ఎన్నో ఘోరాలు, ప్రమాదాలు జరిగాయని, పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని, ధరలు పెరిగిపోయాయని రాహుల్ గాంధీ విమర్శించారు.



పార్లమెంట్ ఆవరణలో రాజ్యాంగ ప్రతులు చేబూని నినదిస్తున్న విపక్ష సభ్యులు

పదేళ్లపాటు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీ

నైతికంగా ఓడిపోయినా మోదీలో అహంకారం తగ్గలేదు: ఖర్గే

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తిప్పికొట్టారు. అప్పట్లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి అమలు చేస్తే, గత పదేళ్లలో నరేంద్ర మోదీ ఎమర్జెన్సీ ప్రకటించకుండానే అమలు చేశారని విమర్శించారు. మోదీ విధించిన అప్రకటిత అత్యవసర పరిస్థితికి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ముగింపు పలికారని పేర్కొన్నారు. ఈ మేరకు ఖర్గే సోమవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని వెల్లడించారు. ఎన్నికల్లో నైతికంగా ఓడిపోయినప్పటికీ మోదీలో అహంకారం మాత్రం ఇంకా తగ్గలేదని మండిపడ్డారు. పరీక్ష పేపర్లు లీక్ కావడంతో యువత నష్టపోయారని, ప్రధాని మోదీ కనీసం సానుభూతి తెలపడం లేదని తప్పుపట్టారు. బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదంపై మాట్లాడడం లేదని ఆక్షేపించారు.

క్షీణిస్తున్న ఢిల్లీ మంత్రి అతిశి ఆరోగ్యం



న్యూఢిల్లీ: హరియాణా నుంచి ఢిల్లీకి వాటా కింద రావాల్సిన తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జలశాఖ మంత్రి అతిశి చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆమె ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని, ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలంటూ డాక్టర్లు సూచించారని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు వెల్లడించారు. అయితే, చికిత్స పొందడానికి అతిశి నిరాకరించారు. హరియాణా నుంచి నీటి సరఫరా ప్రారంభమయ్యేదాకా దీక్ష కొనసాగిస్తానని తేల్చిచెప్పారు. తన శరరంలో రక్తపోటు, చక్కెర స్థాయిలు పడిపోయాయని, బరువు తగ్గిపోతున్నానని అతిశి పేర్కొన్నారు. ప్రమాదకరమైన కీటోన్ స్థాయి పెరిగిపోతోందన్నారు. తన ఆరోగ్యం ఎలా ఉన్నప్పటికీ దీక్ష మాత్రం ఆపబోనని స్పష్టం చేశారు. ఈ నెల 21న దీక్ష ప్రారంభించినప్పుడు అతిశి 65.8 కిలోల బరువు ఉండగా, సోమవారం 63.6 కిలోలకు చేరుకున్నారు.

ప్రధాని మోదీకి ఢిల్లీ మంత్రుల లేఖ

దేశ రాజధాని నగరంలో నీటి సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీ కేబినెట్ మంత్రులు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. హరియాణా నుంచి ఢిల్లీకి వాటా కిం రావాల్సిన నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో వడగాడ్పులు వీస్తున్నాయని, సరిపడా నీరు రాకపోవడంతో జనం కష్టాలు ఎదుర్కొంటున్నారని లేఖలో ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు.

రాజ్యసభ నేతగా జేపీ నడ్డా



న్యూఢిల్లీ: బీజేపీ చీఫ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా రాజ్యసభాపక్ష నేతగా నియమితులయ్యారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. ఇటీవలి ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికైన గోయల్ సోమవారం లోక్‌సభ సభ్యునిగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నారు. నడ్డాతోపాటు మరో 11 మంది కేంద్ర మంత్రులు రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెల్సిందే. రాజ్యసభ నేతగా నియమితులైన జేపీ నడ్డాను కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అభినందించారు. సభలో అభిప్రాయాలను స్వేచ్ఛగా వినిపించేందుకు ప్రతిపక్షానికి అవకాశం కల్పించాలని నడ్డాను కోరారు.

నీట్‌ను ఎత్తివేయండి: మమత

ప్రవేశ పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకే వదిలేయండి



కోల్‌కతా: వైద్య విద్యలో ప్రవేశాల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీకృత నీట్‌ను ఎత్తివేయాలని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఇదివరకటిలాగే రాష్ట్రాలకు ప్రవేశ పరీక్షలను నిర్వహించునే వెసులుబాటును కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నీట్ పేపర్ లీక్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మమత ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. నీట్–యూజీలో అవకతవకలను బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 'వైద్య విద్యలో ప్రవేశాలకు రాష్ట్రాలు సొంతంగా పరీక్షలు నిర్వహించే పాత పద్ధతిని తేవడానికి తక్షణం చర్యలు తీసుకోవాలి. కేంద్రీకృత నీట్ పరీక్షను రద్దు చేయాలి' అని మమత కోరారు. అప్పుడే విద్యార్థులకు వ్యవస్థపై విశ్వాసం కల్పించగలమని, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలుగుతామని పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ' మాయని మచ్చ

▶ మొదటి పేజీ తరువాయి

ధన్యవాదాలు తెలియజేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చామని, తమ ప్రభుత్వ బాధ్యత మూడు రెట్లు పెరిగిందని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గతంలో కంటే మూడు రెట్లు కష్టపడి పనిచేస్తుందని, మూడు రెట్లు ఫలితాలను తీసుకొస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ''ప్రజాస్వామ్య పార్లమెంటరీ చరిత్రలో ఇదొక గర్వించదగ్గ, అద్భుతమైన రోజు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తొలిసారి నూతన పార్లమెంట్ భవనంలో ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్త ఎంపీలకు నా అభినందనలు. సామాన్య ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కొత్త ఉత్సాహంతో సరికొత్త శిఖరాలను అధిరోహించేందుకు ఇదొక సువర్ణావకాశం. 2047 నాటికి వికసిత్ భారత్ అనే లక్ష్య సాధనకు మనమంతా కలిసి పనిచేద్దాం. అభివృద్ధి చెందిన భారత్ అనే సంకల్పాన్ని నెరవేర్చడానికి, ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి మనం చేతులు కలపాలి'' అని మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మెజార్టీ అవసరం అయినప్పటికీ, దేశాన్ని ముందుకు నడిపించేందుకు ఏకాభిప్రాయం చాలా ముఖ్యమని తాము విశ్వసిస్తున్నానని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఇదే సంప్రదాయాన్ని నెలకొల్పేందుకు తాము ప్రయత్నించామన్నారు. 140 కోట్ల మంది పౌరుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ ఏకాభిప్రాయం సాధించడం ద్వారా దేశానికి సేవ చేయాలనేది తమ ప్రభుత్వ ప్రయత్నమని పేర్కొన్నారు. ఇదే సమయంలో 18వ సంఖ్య ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. ''18వ లోక్‌సభలో చాలామంది యువ ఎంపీలు ఎన్నికయ్యారు. భారతీయ సంప్రదాయాల ప్రకారం 18 సంఖ్యకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. భగవద్గీతలో కర్మ, కర్తవ్యం, కరుణ సందేశాన్ని అందించే 18 అధ్యాయాలు ఉన్నాయి. పురాణాలు, ఉప పురాణాల సంఖ్య 18. దీనికితోడు దేశంలో చట్టపరమైన ఓటింగ్ వయస్సు 18 ఏళ్లు. అమృతకాల సమయంలో 18వ లోక్‌సభ ఏర్పాటు కావడం శుభసూచకం '' అని అన్నారు.

స్పీకర్ పదవిపై వీడని సస్పెన్స్



న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎవరుంటారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్డీఏలోని మిత్రపక్షాలతో బీజేపీ సంప్రదింపులు మొదలుపెట్టింది. ఈ నెల 26న జరిగే స్పీకర్ ఎన్నికకు మంగళవారం నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. 293 మంది ఎంపీలతో ఎన్డీఏ సంకీర్ణానికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఎన్డీఏ తమ స్పీకర్ అభ్యర్థి ఎవరనే దానిపై ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. పలు ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. అయితే విపక్ష ఇండియా కూటమికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని భావిస్తోంది. మరోవైపు ఇండియా కూటమి స్పీకర్ పదవికి పోటీపడే అంశాన్ని చురుకుగా పరిశీలిస్తోందని విశ్వసనీవర్గాలు తెలిపాయి. స్పీకర్‌పై ఎలాంటి తుది నిర్ణయాన్ని తమకు తెలుపలేదని, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో సహా కూటమి నేతలందరూ కలిసి నిర్ణయం తీసుకుంటారని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. బీజేపీ నాయకత్వం తనతో సంప్రదింపులు జరిపిందని ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నాయకుడొకరు తెలిపారు. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. బీజేపీ తమ అగ్రనేతలందరికీ మునుపటి శాఖలే కేటాయించి.. కొనసాగింపును భూమికగా ఎంచుకున్నందున 17వ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కొనసాగించొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఎన్డీఏ వైఖరిని బట్టి స్పీకర్ పోస్టుకు తమ అభ్యర్థిని పోటీకి నిలుపడంపై నిర్ణయం తీసుకుంటామని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయించడం సంప్రదాయంగా వస్తోందని, బీజేపీకి అందుకు ముందుకు రాకపోతే పోటీచేయక తప్పదని ఇండియా కూటమి నేతలు అంటున్నారు. కొత్త స్పీకర్‌పై ఏకాభిప్రాయాన్ని నిర్మించడానికి విపక్షాలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతుందని, అలా జరపని పక్షంలో తాము స్పీకర్ పదవికి పోటీ పెడతామని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షమైన రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎంపీ ఎన్‌కే ప్రేమచంద్రన్ సోమవారం విలేకరులతో అన్నారు. ఎన్డీఏ అభ్యర్థి ఎవరనేది మాకు తెలిపిన తర్వాత పోటీపై నిర్ణయం తీసుకుంటామని ఇండియా కూటమికి చెందిన నాయకుడొకరు అన్నారు. బలహీనవర్గాలకు చెందిన అభ్యర్థిని పోటీ పెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండియా కూటమికి 234 మంది ఎంపీల బలముంది.

సరోగసీతో తల్లులయ్యే వారికీ ప్రసూతి సెలవు

తాజాగా నిబంధనలు మార్చిన కేంద్రం



న్యూఢిల్లీ: సరోగసీ(అద్దె గర్భం) ద్వారా సంతానవంతులైన ప్రభుత్వ ఉద్యోగినులు కూడా ఇకపై 180 రోజుల ప్రసూతి సెలవు తీసుకోవచ్చు. ఇందుకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం 50 ఏళ్లనాటి సెంట్రల్ సివిల్ సర్వీసెస్(లీవ్) రూల్స్–1972లోని నిబంధనలను తాజాగా సవరించింది. దీని ఫలితంగా, సరోగసీ ద్వారా తండ్రి అయ్యే ఉద్యోగులు సైతం 15 రోజుల పితృత్వ సెలవు తీసుకోవచ్చు. 'ఇద్దరు కంటే తక్కువ మంది జీవించి ఉన్న సంతానం కలిగిన అద్దెగర్భం ధరించిన మహిళ, కాబోయే తల్లి..వీరిలో ఏ ఒక్కరైనా లేదా వీరిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ 180 రోజుల ప్రసూతి సెలవుకు అర్హులే'అని సిబ్బంది వ్యవహారాల శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అదే సమయంలో, ఇద్దరు కంటే తక్కువ మంది జీవించి ఉన్న సంతానం కలిగి, సరోగసీ ద్వారా తండ్రయ్యే ప్రభుత్వ ఉద్యోగి కూడా బిడ్డ జన్మించిన తేదీ నుంచి ఆరు నెలల్లోపు ఎప్పుడైనా 15 రోజుల మాతృత్వ సెలవును వాడుకోవచ్చని కూడా ఈ నెల 18న విడుదల చేసిన ఆ నోటిఫికేషన్‌లో వివరించింది.

అయోధ్య గర్భాలయంలోకి

వర్షపు నీరు

అయోధ్య: హోరు వర్షం ధాటికి అయోధ్య రామాలయం గర్భాలయ నిర్మాణంలో లోపాలు వెలుగుచూశాయని రామజన్మభూమి ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ సోమవారం ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం అర్ధరాత్రి అయోధ్యలో కురిసిన భారీ వర్షం కారణంగా గర్భగుడిలో బాలరాముడిని పూజించేందుకు పూజారులు కూర్చునే చోట, దర్శనార్థం వీఐపీ భక్తులు వచ్చే మార్గంలోనూ వర్షపు నీరు లీక్ అవుతోందని దాస్ ఆరోపించారు. వర్షపు నీరు బయటకు వెళ్లడానికి ఎలాంటి డ్రైనేజీ వ్యవస్థ గుడిలో లేదని తెలిపారు. దీనిని తీవ్రమైన సమస్యగా పరిగణించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆలయ యాజమాన్యాన్ని ఆయన కోరారు. '' దేశవ్యాప్తంగా దిగ్గజ ఇంజనీర్లు అయోధ్య ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. జనవరి 22న ఆలయానికి ప్రాణ ప్రతిష్ఠచేశారు. ప్రపంచప్రఖ్యాత ఆలయం ప్రారంభమయ్యాక పడిన తొలి భారీ వర్షానికే నీరు లీక్ అవడం ఆశ్చర్యంగా ఉంది. ఎందుకిలా జరుగుతోంది? అనుభవజ్ఞులైన ఇంజనీర్లు కట్టినా ఇలాంటి ఘటన జరగడం పెద్ద తప్పే' అని అన్నారు. దీంతో హుటాహుటిన ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా అక్కడికి చేరుకున్నారు. తక్షణం కప్పుకు మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. '' ఆలయం మొదటి అంతస్తులో ఇంకా పనులు పూర్తికాలేదు. జూలైకల్లా పూర్తిచేస్తాం. డిసెంబర్‌కల్లా మొత్తం ఆలయనిర్మాణం పూర్తిఅవుతుంది' అని వివరణ ఇచ్చారు.

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

- హైకోర్టు తప్పు చేస్తే తాము కూడా చేయాలా? అని ప్రశ్నించిన ధర్మాసనం
- హైకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురుచూడాలని కేజ్రీవాల్‌కు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మరోసారి నిరాశే ఎదురయ్యింది. సుప్రీంకోర్టులో ఆయనకు ఊరట దక్కలేదు. తనకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన రెగ్యులర్ బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేసేందుకు నిరాకరించింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనూ సింఘ్వీ వాదనలు వినిపించారు. ట్రయల్ కోర్టు నుంచి లిఖిత పూర్వక ఆదేశాలు రాకముందే బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే ఇవ్వడం సరికాదని చెప్పారు. కింది కోర్టు ఆర్డర్‌ను చూడకుండా హైకోర్టు స్టే ఇచ్చినప్పుడు, హైకోర్టు ఆర్డర్‌పై సుప్రీంకోర్టు ఎందుకు స్టే ఇవ్వకూడదని అన్నారు. జస్టిస్ మిశ్రా స్పందిస్తూ.. హైకోర్టు తప్పుడు చేస్తే మమ్మల్ని కూడా తప్పు చేయమంటారా? అని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాలను రిజర్వ్ చేయడం అసాధారణ పరిణామమని వ్యాఖ్యానించారు. సాధారణంగా బెయిల్‌పై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవచ్చని, రిజర్వ్ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అయితే, ఢిల్లీ హైకోర్టు నుంచి ఆదేశాలు వెలువడక ముందే సుప్రీంకోర్టు విచారణ జరపడం ముందుగానే చర్యలు తీసుకుంటున్నట్లుగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వులు వెలువడిన తర్వాతే కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణ చేపడతామని వెల్లడించింది. హైకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురుచూడాలని కేజ్రీవాల్‌కు సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తుది ఉత్తర్వులు జారీ చేయనుంది.



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాత్రి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందులో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, మంత్రులు

రష్యాలో మరో ఉగ్రఘాతుకం

- రెండు చర్చిలు, యూదు ప్రార్థనా మందిరంపై దాడి
- 15 మంది పోలీసులు సహా 20 మంది మృతి

మాస్కో: రష్యాలోని ముస్లిం ప్రాబల్య దక్షిణ ప్రాంత దగెస్తాన్ రిపబ్లిక్‌లో ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. ఆదివారం సాయంత్రం ఏకకాలంలో దగెస్తాన్ రాజధాని మఖచ్కాలాలోని ఓ చర్చి, ఓ ట్రాఫిక్ పోలీస్ పోస్ట్‌పైనా కాల్పులు జరపడంతోపాటు డెర్బెంట్ నగరంలోని ఒక చర్చి, ఒక యూదు ప్రార్థనా మందిరంలో దాడి చేసి నిప్పుపెట్టారు. ఉగ్రవాదులు డెర్బెంట్ ట్రినిటీ సండే చర్చిలో ఉన్న రెవరెండ్ నికోలాయ్ కొటెల్నికోవ్ (66)గొంతుకోసి చంపడంతోపాటు ఆ చర్చికి నిప్పుపెట్టారని అధికా రులు తెలిపారు. రెండు ఘటనల్లో 15 మంది పోలీసులు, ఒక బోధకుడు సహా 20 మంది చనిపోయారు. క్షతగాత్రులైన 46 మందిలో 13 మంది పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. నలుగురు పోలీసు అధికారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భద్రతా బలగాల ఎదురు దాడిలో ఆరుగురు ఉగ్రవాదులు హతమ య్యారన్నా రు. అయితే, ఈ ఘటనల్లో ఎందరు ఉగ్రవా దులు పాల్గొన్నదీ వారు వివరించలేదు. హతమైన వారిలో ఉగ్రవాదుల్లో ముగ్గురిని రష్యాలోని ప్రధాన యునైటెడ్ రష్యా పార్టీకి దగెస్తాన్ హెడ్‌గా ఉన్న మగొమెద్ ఒమరోవ్ ఇద్దరు కుమారులు, బంధువుగా అధికారులు గుర్తించారు.

లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీలో పేలుడు

దక్షిణ కొరియాలో 22 మంది కార్మికుల దుర్మరణం



సియోల్: దక్షిణ కొరియాలోని లిథియం బ్యాటరీ తయారీ కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో 22 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిది మంది గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం దేశరాజధాని సియోల్ దగ్గర్లోని హవాసియాంగ్ సిటీలో ఎరిసెల్ కంపెనీకి చెందిన లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీ ఉంది. సోమవారం ఉదయం 10.30గంటలపుడు 102 మంది కార్మికులు పనిచేస్తున్న సమయంలో అక్కడి కొన్ని బ్యాటరీలు పేలాయి. దీంతో రెండో అంతస్తుల్లో మంటలంటుకుని ఫ్యాక్టరీలో దావానంలా వ్యాపించాయి. దీంతో 22 మంది అగ్నికి ఆహుతయ్యారు. వీరిలో 18 మంది చైనా కార్మికులు ఉన్నారు. తయారైన బ్యాటరీలను తనిఖీచేసి ప్యాక్ చేస్తుండగా ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది. అయితే పేలుడుకు ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ఒకరి జాడ తెలీడంలేదు. ఘటనా స్థలిని ప్రధాని హాన్ డ్యూక్ సో సందర్శించారు.

ఐబీ చీఫ్ డేకా పదవీకాలం ఏడాది పొడిగింపు



న్యూఢిల్లీ: ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ కుమార్ డేకా పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2025 జూన్ వరకు బాధ్యతల్లో కొనసాగుతారని సోమవారం కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ నెల 30వ తేదీన ముగియనున్న డేకా పదవీ కాలాన్ని ఏడాది పాటు పొడిగించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించిందని వెల్లడించింది. 1988 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అయిన డేకా 1998లో ఐబీలో చేరారు. 2022 జూలై ఒకటో తేదీన ఆయన ఐబీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా, జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) సెక్రటరీ జనరల్ భరత్ లాల్ పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగిస్తూ సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులిచ్చింది.

సాక్షి
హైదరాబాద్

మంగళవారం । 25 । జూన్ । 2024



భార్య విలాసాల కోసం...

భార్య విలాసాల కోసం భర్త చోరీల బాట పట్టాడు. చైన్‌స్నాచర్‌గా మారాడు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి డీడీ కాలనీలో జరిగిన ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు.

-8లో



బాలికపై సామూహిక అత్యాచారం

సెల్‌ఫోన్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తన స్నేహితులతో కలిసి సామూహిక అత్యాచారానికీ ఒడిగట్టాడు. నిందితులను కాచిగూడ పోలీసులు అరెస్టు చేశారు.

-8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/24.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉరుములు, ఈదురు గాలులు కూడా వీయవచ్చు.



గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న జూడాలు

జూడాల సమ్మెబాట



కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో..

జూనియర్ డాక్టర్లు సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జూడాలు రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించారు. ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో సోమవారం నుంచి సాధారణ విధులను బహిష్కరించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, ఉస్మానియా వైద్య కళాశాల ప్రాంగణంలో జూడాలు బైఠాయించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలో జూడాలు పెద్దఎత్తున నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఔట్ పేషంట్ సేవలు, ఎలక్టిక్ సర్జరీలు, ఇతరత్రా డ్యూటీలను జూనియర్ డాక్టర్లు బహిష్కరించారు. ఆరు నెలలుగా జూడాలకు ప్రభుత్వం స్టైపెండ్ ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమ్మెకు సంబంధించి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో/గాంధీఆస్పత్రి/సుల్తాన్‌బజార్

ఐటీ కారిడార్‌లో మెట్రో లగ్జరీ బస్సు

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణుల కోసం ఐటీ కారిడార్‌కు రాకపోకలు సాగించేవిధంగా ఎలక్ట్రిక్ ఏసీ మెట్రో లగ్జరీ బస్సును ప్రవేశపెట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు (127కె) కోఠీ నుంచి కొండాపూర్ వరకు ప్రతి 24 నిమిషాలకు ఒకటి చొప్పున నడుస్తుంది. కొండాపూర్ నుంచి మొదటి బస్సు ఉదయం 5.06 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.17 గంటలకు బయలుదేరుతుంది. కోఠీ నుంచి మొదటి బస్సు ఉదయం 6.16 గంటలకు, చివరి బస్సు రాత్రి 11.27 గంటలకు బయలుదేరుతుంది. ఈ బస్సు లక్డీకాపూల్, మాసాబ్‌ట్యాంక్, పెద్దమ్మగుడి, మాదాపూర్, హైటెక్‌సిటీ, కొత్తగూడ ఎక్స్‌రోడ్, ఐటీ కారిడార్‌ల మీదుగా కొండాపూర్ వరకు చేరుకుంటుంది.

సీబీఐటీకి జాతీయ స్థాయిలో 41వ ర్యాంక్



జాతీయ ర్యాంకుల వివరాల మ్యాగజైన్‌ను అందించిన ది వీక్ ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలకు జాతీయ స్థాయిలో 41వ ర్యాంక్ దక్కిందని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. ది వీక్ మ్యాగజైన్ దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలలో ఉన్న సౌకర్యాలు, ఫ్యాకల్టీ, ఇతర సదుపాయాలను గమనించి దేశ వ్యాప్తంగా ఉన్న కళాశాలలకు ర్యాంకింగ్ ఇచ్చిందన్నారు. ఆల్ ఇండియా ప్రైవేట్ కళాశాలల కేటగిరీలో సీబీఐటీకి 16వ స్థానం దక్కిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ మొదటి స్థానంలో నిలవగా రెండవ స్థానంలో సీబీఐటీ నిలిచిందని ఆయన తెలిపారు. ది వీక్ మేగజైన్ ప్రతినిధులు సోమవారం కళాశాలకు వచ్చి ఆ విషయాన్ని తెలియజేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ–సీబీఐటీ సలహాదారుడు డాక్టర్ ఎస్ఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 45.61 శాతం ఉత్తీర్ణత

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా బాలికల హవా కొనసాగింది. మొత్తం మీద 45.61 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వృత్తివిద్యా విభాగంలో 54.02 శాతం మంది పాసయ్యారు. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ కలిపి 75,062 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 34,239 మంది ఉత్తీర్ణులయ్యారు. వృతి విద్యా విభాగంలో 3,006 మంది విద్యార్థులకు గాను 1,624 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ఫస్ట్ ఇయర్‌లో 42,390 విద్యార్థులకు గాను 23,557 మంది, సెకండ్ ఇయర్‌లో 32,672 మంది విద్యార్థులకు గాను 10,682 మంది, వృతి విద్యా విభాగంలో ఫస్ట్ ఇయర్‌లో 1,565 విద్యార్థులకు గాను 834 మంది, సెంకడ్ ఇయర్‌లో1,441, విద్యార్థులకు గాను 790 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో బాలురు 50.83 శాతం, సెకండ్ ఇయర్‌లో 29.47 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు ఫస్ట్ ఇయర్‌లో 62.80 శాతం, సెకండ్ ఇయర్‌లో 38.18 శాతం ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా విభాగంలో ఫస్ట్ ఇయర్‌లో బాలురు 44.45 శాతం, సెకండ్ ఇయర్‌లో 53.44 శాతం, బాలికలు ఫస్ట్ ఇయర్ లో 67.5 శాతం, సెకండ్ ఇయర్‌లో 58.48 శాతం ఉత్తీర్ణ సాధించారు.

నాగోలు పీఎస్ ఎస్‌ఐ, ఏఎస్‌ఐ సస్పెన్షన్



ఎస్‌ఐ మధు

నాగోలు: నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత యువకుడిపై దాడి ఘటనలో కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఇన్‌స్పెక్టర్ పరశురాంపై రాచకొండ పోలీస్ కమిషనర్ బదిలీ వేటు వేశారు. దీనిలో భాగంగానే ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాగోలు ఎస్‌ఐ మధు, ఏఎస్‌ఐ అంజయ్యలను కూడా సస్పెండ్ చేస్తూ ఆదివారం రాత్రి రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి చర్యలు తీసుకున్నారు. ఎల్‌బీనగర్‌లోని భరత్‌నగర్ కాలనీ చెందిన దాసరి గౌతమ్ అలియాస్ బద్దు ప్రైవేట్ ఉద్యోగి. ఇతనికి నాగోలు సాయినగర్ కాలనీలో నివాసం ఉండే వేముల మల్లేష్, అతని కుమారుడు (16) మైనర్ మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన గౌతమ్ పోలీసులను ఆశ్రయించగా వారు స్పందించలేదు. దీంతో తనపై జరిగిన దాడి ఘటన గురించి పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టి ముగ్గురిపై చర్యలు తీసుకున్నారు.

బిగ్ చేంజ్!

కీలకమైన మూడు పోస్టుల్లో కొత్త బాస్‌లు

జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డులకు మారిన సారథులు

- ఆమ్రపాలి, సర్ఫరాజ్, అశోక్‌రెడ్డిలకు బాధ్యతలు
- ఈవీడీఎం డైరెక్టర్‌గా రంగనాథ్
- బల్దియా నాలుగు జోన్లకు కొత్త కమిషనర్లు
- ఓఆర్ఆర్ పరిధి లక్ష్యంగా పనులు
- సమూల ప్రక్షాళన దిశగా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు ముఖ్య విభాగాలైన జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డుల్లో ఉన్న బాస్‌లు మారారు. వారిస్థానే కొత్త బాస్‌లను నియమించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రేటర్ పరిధిలో భారీ స్థాయిలో అధికారుల బదిలీలు జరగడం ఇదే ప్రథమం. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచీ ఆయా విభాగాల చీఫ్‌లు మారతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇప్పటిదాకా జరగలేదు. తాజాగా జరిగిన ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా నగరంలోని ముగ్గురు చీఫ్‌లతో పాటు మరికొందరు అధికారులను కూడా బదిలీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత బీఆర్ఎస్ హయాంలో కీలకశాఖల్లో ఉన్నవారిని వెంటనే మారుస్తారనుకున్నప్పటికీ, రాజకీయ పరిణామాలు, లోక్‌సభ ఎన్నికలు, ఇతరత్రా కారణాలతో పూర్తిస్థాయిలో బదిలీలు జరగలేదు. పాలనలో, అభివృద్ధిలో తమదైన మార్కు చూపించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. వాటిని అమలు చేయడం, నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ఆయా సంస్థల్లో ప్రక్షాళనలో భాగంగా ఈ బదిలీలు జరిగినట్లు భావిస్తున్నారు.

ప్రజా సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా..

నగరానికి సంబంధించినంత వరకు ఓఆర్ఆర్ వరకు యూనిట్‌గా పనులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఓఆర్ఆర్ వరకున్న శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కూడా జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం..ఒకటే పెద్ద కార్పొరేషన్ లేదా మూడు నాలుగు కార్పొరేషన్లుగా చేసే ఆలోచనలున్నాయి. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీయేల్లో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి భారీ అవినీతి జరిగిందనే అభిప్రాయాలున్నాయి. వాటిపై ఉన్న ఆ ముద్రను తొలగించడంతోపాటు పౌరులకు సకాలంలో సేవలు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. అంతేకాకుండా 'వైబ్రెంట్ హైదరాబాద్' కోసం మెగా మాస్టర్‌ప్లాన్–2050తో ఆయా పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో ఆర్థికాభివృద్ధితోపాటు మొబిలిటీ, బ్లూ, గ్రీన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్ కీలకంగా ఉన్నాయి. ఓవైపు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు మరోవైపు పెరుగుతున్న జనావాసాలన్నింటికీ సురక్షిత నీరు, వందశాతం మురుగుజలాల శుద్ధి కోసం ఎస్టీపీల పనులు జరుగుతున్నాయి. ఓఆర్ఆర్ వరకు ఎలాంటి విపత్తులు జరిగినా వెంటనే ఆదుకునేలా ఉండేందుకు విపత్తు నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. అందులో భాగంగానే ఈవీడీఎం విభాగంలోని డీఆర్ఎఫ్ టీమ్‌లను పెంచుతున్నారు.



ఆమ్రపాలి

ఏవీ రంగనాథ్

సర్ఫరాజ్



అశోక్‌రెడ్డి

ఏడాది గడవకుండానే బదిలీ అయిన రోనాల్డ్‌రాస్

- గత జూలై 5వ తేదీన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోనాల్డ్‌రాస్‌ను ఇంధనశాఖ సెక్రటరీగా బదిలీ చేశారు.
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా హెచ్‌ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీ ఆమ్రపాలికి పూర్తిస్థాయి బాధ్యతలప్పగించారు.
- హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఈసీలో జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు.
- హార్టికల్చర్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డిని వాటర్‌బోర్డు ఎండీగా నియమించారు.
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం.. కొత్తగా జాయింట్ ఎండీ పోస్టును సృష్టించి రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.గౌతమిని నియమించింది.

ఈవీడీఎం డైరెక్టర్‌గా రంగనాథ్

భారీ వర్షాలు, అగ్నిప్రమాదాలు వంటి ఘటనలు జరిగినప్పుడు ఎదురవుతున్న విపత్తులను ఎదుర్కొనేందుకు తక్షణ స్పందనతో పనిచేస్తున్న ఈవీడీఎం డైరెక్టర్‌గా ఉన్న ప్రకాశ్‌రెడ్డిని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను నియమించారు.

డిప్యూటీ కలెక్టర్లు రిలీవ్

ఎన్నికల సందర్భంగా జీహెచ్‌ఎంసీకి వచ్చిన డిప్యూటీ కలెక్టర్లలో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు కె. శివకుమార్, డి. శ్రీధర్, ఎస్. విజయలక్ష్మిలను ఐఏఎస్‌ల బదిలీ ఉత్తర్వులకు ముందే జీహెచ్‌ఎంసీ నుంచి రిలీవ్ చేశారు. వీరిలో శివకుమార్ సంతోష్ నగర్ సర్కిల్ డీసీగా పనిచేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు కూడా ముగిసినందున వీరికి పెద్దగా పనులేమీ లేక పోవడంతో రిలీవ్ చేసినట్లు తెలుస్తోంది.

నాలుగు జోన్లకు కొత్త కమిషనర్లు..

జీహెచ్‌ఎంసీ జోన్ల ప్రక్షాళనే లక్ష్యంగా నాలుగు జోన్లలో కొత్త జోనల్ కమిషనర్లను నియమించారు. ఇటీవల ఖాళీ అయిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతిని, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా జోగులాంబ గద్వాల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌ను నియమించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా ఉన్న పి.ఉపేందర్‌రెడ్డిని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నియమించారు. జోన్లలో అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ బదిలీలతో మొత్తం ఆరు జోన్లకు గాను మూడు జోన్లలో ఐఏఎస్ అధికారులున్నారు. ఇప్పటి వరకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌తో పాటు రెవెన్యూ, ఐటీ విభాగాల అడిషనల్ కమిషనర్‌గా ఉన్న స్నేహశబరీష్‌ను జడ్‌సీ పోస్టు నుంచి బదిలీ చేశారు.

ఆయన స్టైలే వేరు..



ఉపేందర్‌రెడ్డి

కీలకమైన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా పి.ఉపేందర్‌రెడ్డిని నియమించడం జీహెచ్‌ఎంసీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఆయన పనితీరు, ట్రాక్ రికార్డు ఆధారంగానే ప్రభుత్వం ఆయనను శేరిలింగంపల్లి జడ్‌సీగా నియమించినట్లు తెలుస్తోంది. గతంలో ఎల్‌బీనగర్ జడ్‌సీగా, బోడుప్పల్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు ఆయన పలు అవార్డులు, రివార్డులు పొందారు. బోడుప్పల్‌లో పచ్చదనం పెంపు కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నగదు రివార్డు అందజేసింది. బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆయన చేసిన పారిశుధ్య కార్యక్రమాలు చూసే అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ ఆయన్ను జీహెచ్‌ఎంసీకి రప్పించారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు అక్కడ వరదనివారణకు ఆయన రూపొందించిన ప్రాజెక్టు రిపోర్టుతోనే నగరమంతటికీ ఆ విధానాన్ని వర్తింపచేస్తూ ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం)కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సుదీంద్ర

ప్రస్తుతం ఏసీబీలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు



నగర పోలీసు విభాగానికి గుండెకాయ వంటి హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నాన్–క్యాడర్ ఎస్పీ స్థాయి అధికారి వైవీఎస్ సుదీంద్రను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సుదీంద్ర అవినీతి నిరోధక శాఖలో (ఏసీబీ) జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌కే చెందిన ఈయన బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజీ నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందారు. 2012లో గ్రూప్–1 ద్వారా డీఎస్పీగా ఎంపికై పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. సుదీంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ముగ్గురు మహిళా అధికారుల తర్వాత..

గడిచిన తొమ్మిది నెలల కాలంలో టాస్క్‌ఫోర్స్‌కు ముగ్గురు మహిళా అధికారులు నేతృత్వం వహించారు. సుదీర్ఘకాలం టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పని చేసిన పి.రాధాకిషన్‌రావును గత ఏడాది అక్టోబర్‌లో ఎన్నికల సంఘం బదిలీ చేసింది. అప్పట్లో తొలి మహిళా డీసీపీగా ఐపీఎస్ అధికారి నిఖిత పంత్ నియమితులయ్యారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి, కొత్త సర్కారు కొలువు తీరిన తర్వాత గత ఏడాది డిసెంబర్‌లో తొలిసారిగా పోలీసు బదిలీలు జరిగాయి. ఆ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నిఖిత పంత్ స్థానంలో నాన్–క్యాడర్ ఎస్పీగా ఉన్న శ్రీ బాల దేవి నియమితులయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈమెను బదిలీ చేసిన ప్రభుత్వం సాధన రష్మి పెరుమాల్‌ను నియమించారు. ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఈమె హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా వెళ్లారు.

ఐటీ విస్తరణపై సర్కారు దృష్టి

మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు వైపు అడుగులు

- ఇప్పటికే 226 ఎకరాల భూ సేకరణ పూర్తి
- నగర శివారులో సరిపోయేంత భూనిధి
- 783 కొత్త పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తల చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లక్ష్యంగా ఐటీ విస్తరణపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం నగర శివారులో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా తూర్పు ప్రాంతమైన ఉప్పల్ వైపు చూస్తోంది. ఓఆర్ఆర్ సమీపంలోని ఘట్‌కేసర్ మండలం మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపనకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే స్థానిక రైతుల అంగీకారంతో భూసేకరణ కార్యక్రమాన్ని రెవెన్యూ నిర్వహిస్తోంది. రైతులకు భూ పరిహారంతోపాటు ఇండస్ట్రియల్ పార్కుకు ఏర్పాటుకు అవసరమైన పనులన్నీ చకచకా పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. నగర శివారు మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపనకు సంబంధించి మేడ్చల్ జిల్లా పరిశ్రమల శాఖ టీఎస్ ఐపాస్ ద్వారా అన్నీ అనుమతులు ఇప్పించటంతో.. భూసేకరణ, సర్వే కార్యక్రమం, రైతులకు నష్ట పరిహారంపై దృష్టి సారించింది. దీంతో మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపనకు అవసరమైన 226 ఎకరాల భూమి అప్పగించే కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది.

అనుకూల పరిస్థితులతో..

నగర శివారు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి. దీంతో పారిశ్రామికాధిపతులు కూడా కొత్త పరిశ్రమలను నెలకొల్పేందుకు టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు పొందటానికి ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్తగా 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో నెలకొల్పేందుకు పారిశ్రామికాధిపతులు ముందుకు వచ్చారు. దీంతో పరిశ్రమల స్థాపనకు రెవెన్యూ యంత్రాంగం భూసేకరణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు పరిశ్రమల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

శివారుల్లో భూ నిధి ఎక్కువే..

నగర శివారుల్లోని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు తగినంత భూనిధి ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిధిలో 66.8 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 65 కిలో మీటర్ల రాష్ట్రీయ రహదారులు ఉన్నాయి. వీటికితోడు ఔటర్ రింగ్ రోడ్డు ఉండటంతో కొత్త పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతంగా పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారు. అన్ని రకాల రహదారుల సమీపంలో దాదాపు 10 వేల ఎకరాల భూములు ఉండగా, ఇందులో ప్రైవేట్ భూములు ఉన్నాయి. శివారులోని మేడ్చెల్–మల్కాజిగిరి జిల్లాలో 6,084.72 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.



పోలీసు అధికారి కొడుకు అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో ఓ పోలీసు అధికారి కొడుకు అదృశ్యమయ్యాడు. వివరాలు...రాష్ట్ర పోలీసు శాఖలోని అక్టోపస్ విభాగం డీఎస్పీ వీరరాజు యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 21న ఆయన కొడుకు టీకే రామ్ తరుణ్(28) ఇంట్లో ఎవరికీ ఏమీ చెప్పకుండా తన యూనికార్న్ బైక్ (టీఎస్ 09 జీడీ 6641)పై బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం తల్లి ఫోన్ చేయగా జూబ్లీహిల్స్‌లో ఉన్నానని, కొద్దిసేపట్లో వస్తానని చెప్పాడు. రాత్రి 9 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో బంధుమిత్రుల ఇళ్లలోనూ ఆరా తీశారు. ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో తన కొడుకు కనిపించడం లేదంటూ డీఎస్పీ వీరరాజు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని రామ్‌తరుణ్ కోసం గాలింపు చేపట్టారు.

సాహితీ ఇన్‌ఫ్రాకు వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

సిటీ కోర్టులు: ఒప్పందం మేరకు నిర్మాణం పూర్తి చేయని సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు హైదరాబాద్ వినియోగదారుల కమీషన్–3 మొట్టికాయ వేసింది. ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరించడం సేవల్లో లోపమేనని స్పష్టం చేసింది. పిటిషనర్ నుంచి తీసుకున్న రూ.42 లక్షలను 12 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. అదేవిధంగా రూ.50 వేలు పరిహారం, రూ.5 వేలు కోర్టు ఖర్చులకు చెల్లించాలని, మరో రూ.10 వేలు లీగల్ ఎయిడ్ నిధికి జమ చేయాలని కమిషన్ అధ్యక్షుడు ఎం.రాంగోపాల్‌రెడ్డి, సభ్యులు నారాయణ రెడ్డి తీర్పు వెల్లడించారు.వివరాలు... అమెరికాలో నివసిస్తున్న అశోక్ వుప్పాడ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్‌లో 2020, సెప్టెంబర్ 27న ఫ్లాట్ బుక్ చేసుకున్నారు. ఇందుకు అడ్వాన్స్‌గా కొంత డబ్బు చెల్లించారు. కంపెనీ యాజమాన్యం ప్రీలాంచ్ ఆఫర్ కింద 9వ టవర్, 13వ అంతస్తులో 1,615 అడుగులతో ఉన్న ఫ్లాట్ నం.1308ను పిటిషనర్‌కు కేటాయించారు. 2021 ఏప్రిల్ 9న మొత్తం రూ.42 లక్షలను చెల్లించడంతో పాటు ఒప్పందపత్రం రాసుకున్నారు. అయితే నెలలు గడిచినా నిర్మాణం మొదలు పెట్టకుండా కాలయాపన చేస్తుండటంతో పిటిషనర్ కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను పరిశీలించిన కమిషన్ తీర్పు చెప్పింది.

ట్రాఫిక్ విధుల్లోకి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

- అవగాహన కల్పించడానికి వీరి సేవలు వినియోగం
- రెండు విడతల్లో 600 మందికి సిటీ టీటీఐలో శిక్షణ
- కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ రవిగుప్తా
- ఒక్కో కూడలి వద్ద విధుల్లో 20- 30 మంది వలంటీర్లు




ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ రవిగుప్తా తదితరులు, హాజరైన వలంటీర్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ విభాగంలో సిబ్బంది సంఖ్య ఉండట్లేదు. ఈ కారణంగా నగర జీవి రోడ్లపై నిత్యం నరకం చవి చూస్తున్నాడు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న విద్యా శాఖ పోలీసు విభాగానికి సహకరించడానికి ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) వలంటీర్లను ట్రాఫిక్ విధులకు వినియోగించనున్నారు. దీనికోసం వీరికి కనీస శిక్షణ అవసరం. ప్రస్తుతం నగరంలో 30 వేల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు. వీరందరికీ పోలీసు విభాగంలో శిక్షణ ఇవ్వడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ విధానంగా 600 మందిని తీర్చిదిద్దనున్నారు. తొలి బ్యాచ్ శిక్షణను సోమవారం రాష్ట్ర డీజీపీ రవి గుప్తా ప్రారంభించారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, అదనపు సీపీ (ట్రాఫిక్) ఎన్.విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గంటల పాటు రెండు అంశాల్లో...

ఈ ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ కార్యక్రమానికి 600 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎంపిక చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 100 మంది చొప్పన తొలి విడత 300 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (టీటీఐ) ఒక రోజు, ఆరు గంటలపాటు ఈ ట్రైనింగ్ ఉంటుంది. ఇందులో భాగంగా ఇండోర్ విభాగంలో నిబంధనలు, చట్టంలోని ప్రాథమిక అంశాలు బోధిస్తారు. ఔట్ డోర్ విభాగంలో రహదారులపై విధులు నిర్వర్తించే విధానం, ట్రాఫిక్ నిర్వహణలో కీలకాంశాలు నేర్పిస్తారు. రెండు విడతల్లో శిక్షణ పొందే 600 మంది మిగిలిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ ఇస్తారు. నెల రోజుల్లో నగరంలో ఒక్కో కూడలి వద్ద 20- 30 మంది వలంటీర్లు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీసులు వీరి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే విధులు కేటాయిస్తారు. ప్రధానంగా ఫ్రీ లెఫ్ట్ అమలు, పాదచారుల భద్రత తదితర అవగాహన కార్యక్రమాలు వీరి ద్వారా చేయించనున్నారు.

ఏటా లక్షల మంది బాధితులుగా



ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకపోవడం వల్ల ఏటా దేశ వ్యాప్తంగా లక్షల మంది బాధితులుగా మారుతున్నారు. వీరిలో కొందరు చనిపోతుండగా, మరికొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. వాహనాలు నడుతున్న, రోడ్డున్న నడుస్తున్న.. ఇలా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి. జపాన్‌లో కిండర్ గార్డెన్ స్థాయి నుంచే ట్రాఫిక్ అంశాన్ని పిల్లలకు బోధిస్తారు. క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి చూపిస్తారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కంటే ఎడ్యుకేషన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. తెలంగాణ కంటే కేరళలో ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు అవుతాయి. అక్కడి ప్రజల్లో ఉన్న అవగాహనే దానికి కారణం. – రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ

ప్రభుత్వాలు కొన్ని నిబంధనలు వద్దంటాయి



ట్రాఫిక్ అనేది అత్యంత ప్రధానమైన అంశం. ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ సిబ్బంది సమర్థంగా పని చేస్తున్నారు. పలు కారణాలతో లైన్ డిసిప్లేన్ పక్కాగా అమలు చేయలేకపోతున్నాం. కొన్నిసార్లు ప్రభుత్వాలు కూడా కొన్ని ట్రాఫిక్ నిబంధనల అమలును పట్టించుకోవద్దని చెప్తుంటాయి. ఎక్కడా ట్రాఫిక్ ఆగకుండా సాగితేనే అంతా సక్రమంగా ఉన్నట్లు. ఇలా కాకపోవడానికి అక్రమ పార్కింగ్ ఓ కారణమే. – కొత్తకోట శ్రీనివాసరెడ్డి, నగర పోలీసు కమిషనర్

పోలీసులతో అనుబంధం, అనుభవం ఉన్నాయి



కొన్నాళ్లు హోం సెక్రటరీగా పని చేశా. ఐసీసీసీ, వరంగల్ పోలీసు కమిషనరేట్ నిర్మాణంతో పాటు ట్రాఫిక్ విభాగానికి 30 శాతం అదనంగా చెల్లింపు వంటి ఆర్డర్స్ జారీ చేశా. నాకు పోలీసు శాఖతో అనుబంధం, అనుభవం ఉన్నాయి. ఓ భవనంపై ఉండి కింద స్లోగా వెళ్తున్న ట్రాఫిక్‌ను చూస్తే ఆహ్లాదంగా ఉంటుంది. అదే ట్రాఫిక్‌లో మనం ఉంటే ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్‌పై ఎన్ఎస్ఎస్ సేవలు వినియోగించడం మంచిదే. – బుర్రా వెంకటేశం, ముఖ్యకార్యదర్శి, విద్యాశాఖ

ఎన్‌ఫోర్స్‌మెంట్ కంటే ఎడ్యుకేషనే కీలకం

ప్రపంచంలో ఉన్న వాహనాల్లో 1 శాతం, రోడ్లలో 2 శాతం మాత్రమే భారతదేశంలో ఉన్నాయి. అయితే ప్రపంచంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 11 శాతం ఇక్కడే చోటు చేసుకుంటున్నాయి. రహదారి నిబంధనలు, చట్టాలను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉంది. ప్రస్తుతం రోజూ 15 వేల మంది ఉల్లంఘనులకు చలాన్లు విధిస్తున్నాం. అయితే ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ కంటే నిబంధనలపై అవగాహన కల్పిస్తూ చేసే ఎడ్యుకేషనే కీలకం. ఈ దిశలోనే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు వినియోగించుకున్నాం. – ఎన్.విశ్వప్రసాద్, అదనపు సీపీ, హైదరాబాద్ ట్రాఫిక్

పోలీస్ తూటాలు మళ్లీ పేలాయి..

- తనిఖీ చేస్తుండగా నెట్టి పారిపోయిన పాత నేరస్తుడు
- వెంబడిస్తూ గాల్లోకి తుపాకీ కాల్చిన కానిస్టేబుల్
- సైదాబాద్‌లో చోటుచేసుకున్న ఘటన

సైదాబాద్: నగరంలో పోలీసుల తుపాకీ మళ్లీ పేలింది. రెండురోజుల క్రితం సికింద్రాబాద్‌లో ద్విచక్ర వాహనంపై పరారవుతున్న స్నాచర్లను పట్టుకునే క్రమంలో యాంటీ స్నాచింగ్ టీమ్ పోలీసులు కాల్పులు జరిపిన విషయం విదితమే. అదే తరహా ఘటన ఆదివారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... యాంటీ డెకాయిటీ టీం సభ్యుడు కానిస్టేబుల్ ఎన్.శివ, సైదాబాద్ కానిస్టేబుల్ పి.రాజేష్ ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో స్నాచర్ల గురించిన సమాచారం అందడంతో శంకేశ్వరబజార్ వద్దకు చేరుకున్నారు. అక్కడి పెట్రోల్ బంక్ సమీపంలో పాతనేరస్తుడు అమీర్ అనుమానాస్పదంగా తచ్చాడుతుండటాన్ని గమనించారు. అతడిని ఆపి తనిఖీ చేయబోతుండగా అమీర్ పోలీసులను నెట్టి సమీపంలోని చిన్న సందులోంచి పారిపోయాడు. అతడిని వెంబడిస్తూ ఇద్దరు కానిస్టేబుళ్లు కొంద దూరం వెళ్లారు. అతడిని ఆగాలని హెచ్చరిస్తూ కానిస్టేబుల్ శివ 9 ఎంఎం గ్లాక్ పిస్టల్‌తో రెండు రౌండ్లు గాలిలోకి కాల్చాడు. అయినా నేరస్తుడు తప్పించుకొని పరారయ్యాడు. అయితే సరూర్‌నగర్‌లో నివసించే సదరు నేరస్తుడు అమీర్‌ను మరునాడు తెల్లవారుజామున సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అమీర్‌పై ఎల్‌బీ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో పలు నగలు, సెల్ స్నాచింగ్ కేసులు ఉన్నాయి.

భార్య విలాసాల కోసం భర్త స్నాచర్‌గా మారాడు...



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్

అంబర్‌పేట: భార్య విలాసాల కోసం భర్త చోరీల బాట పట్టాడు. చైన్‌స్నాచర్‌గా మారాడు. చివరికి పోలీసులకు చిక్కాడు. అతడికి సహకరించిన మరో ఇద్దరు కూడా జైలుపాలయ్యారు. సోమవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ అశోక్, డీఐ మల్లేశ్వర్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్ రాఘవేంద్రనగర్ కాలనీలో నివసించే గడ్డం సునీత్‌కుమార్(26) ఓ ఇవెంట్ నిర్వహణ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇతడి భార్య విలాసాల కోసం అడ్డదారిలో డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు డీడీ కాలనీలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పారిజాతం(65) నడుచుకుంటూ వెళుతుండగా సునీత్‌కుమార్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. అతడి స్నేహితుడు పొతంశెట్టి రవి ద్వారా ఈసీఐఎల్ గాయిత్రినగర్‌లో కృష్ణ జ్యువెలర్స్ నిర్వాహకుడు రాజేష్ రాథోడ్ వద్ద గొలుసును తనఖా పెట్టి రూ.65 వేలు తీసుకున్నాడు. అనంతరం అతడు తన భార్యతో గోవాకు వెళ్లి జల్సా చేసి వచ్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అంబర్‌పేట పోలీసులు విచారణ చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఉప్పల్‌లో ఆ ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4 తులాల రెండు గొలుసులు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సునీత్‌కుమార్, రాజేశ్, రవిని రిమాండ్‌కు తరలించారు. కేసును సకాలంలో ఛేదించిన అంబర్‌పేట క్రైమ్ టీంను డీసీపీ అభినందించి నగదు బహుమతి అందించారు.

పోలీసుల అదుపులో టిప్పర్ డ్రైవర్

అతివేగమే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతికి కారణం

బంజారాహిల్స్: నిర్లక్ష్యం, అతివేగంగా టిప్పర్ నడిపిస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతికి కారకుడైన డ్రైవర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ... వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం లక్ష్మీపల్లికి చెందిన శివశంకర్(30) ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ముందు నుంచి వెళ్తుండగా వెనక నుంచి టిప్పర్ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో డ్రైవర్ ఎస్.మునిచందర్(24) టిప్పర్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. పోలీసులు ఆదివారం మధ్యాహ్నం నిందితుడిని అదుపులోకి తీసుకుని టిప్పర్‌ను సీజ్ చేశారు. శామీర్‌పేటకు చెందిన శ్రీకాంత్ వాహన యజమానిగా పోలీసులు గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఘటనల్లో 20 మంది అరెస్ట్

- హత్య కేసులో 12 మంది, హత్యాయత్నంలో 8 మంది..
- మొత్తం నిందితులు 31 మంది
- వివరాలు వెల్లడించిన దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా

చాంద్రాయణగుట్ట: డబ్బుల విషయంలో తలెత్తిన గొడవ కారణంగానే శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వారం క్రితం యువకుడి హత్యోదంతం చోటుచేసుకుందని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ హత్య కేసులో మొత్తం 18 మందికి ప్రమేయం ఉండగా, సోమవారం 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్యకు లింక్‌గానే ఉన్న కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో 13 మందికి ప్రమేయముండగా, ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా సోమవార మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస రావు, ఛత్రినాక ఏసీపీ సి.హెచ్.చంద్రశేఖర్, శాలిబండ, కాలాపత్తర్‌ల ఇన్‌స్పెక్టర్లు ఎస్.రవికుమార్, ఆర్.గోపి పాల్గొన్నారు.

బావబామ్మర్దులే విరోధులుగా మారి...

శాలిబండకు చెందిన మజ్హర్, సోహెల్ బావబామ్మర్దులు. సోహెల్‌కు మజ్హర్ రూ.9 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై కొన్నిరోజులుగా ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఈ విషయమై మాట్లాడుకునేందుకు ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి ఫాతిమా ఆసుపత్రి పరిసరాల్లో కలుద్దామనుకున్నారు. ముందస్తు పథకంలో భాగంగా మజ్హర్ కాలాపత్తర్ రౌడీషీటర్ మహ్మద్ అసద్(35) గ్యాంగ్‌ను పిలిపించుకున్నాడు. వీరంతా కలిసి సోహెల్‌ను బెదిరించసాగారు. సమాచారం తెలుసుకున్న సోహెల్ స్నేహితులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే కత్తులతో వేచి ఉన్న అసద్ గ్యాంగ్ అక్కడికి వచ్చిన సోహెల్ స్నేహితులైన వాజిద్, సాజిద్, ఖదీర్, రఫిక్, షిమ్లాన్‌లపై దాడికి దిగింది. రఫిక్, షిమ్లాన్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ హత్యకేసుతో సంబంధం ఉన్న అసద్, హుస్సేన్ పాషా, సుభాన్ ఖాన్, అన్వర్, మహ్మద్ అద్నానుద్దీన్(26), మహ్మద్ ఇస్మాయిల్(37), సైఫ్ అలీ ఖాన్(21), అబ్దుల్లా ఖాన్(18), షేక్ దస్తగిర్ (20), సయ్యద్ యూకుబ్ అలీ(19), ఉస్మాన్ బిన్ ఖాలీద్ యెమనీ(22), అమాన్ అలీ హష్మీ(18)లను శాలిబండ పోలీసులు అరెస్ట్ చేయగా, మిగిలినవారు పరారీలో ఉన్నారు.

మరొకరిని కత్తితో బెదిరించి...

హత్య అనంతరం కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాన్‌షాప్ నిర్వాహకుడైన అష్వాఖ్ అలియాస్ చోటా అష్వాఖ్ ఇంటికి అసద్ వెళ్లాడు. తన శత్రువుకు తన కదలికల గురించి చెబుతున్నాడనే అనుమానంతో ఆషూ, సుభాన్‌తో కలిసి అసద్ బెదిరించాడు. ఇప్పుడే ఓ శత్రువును చంపేసి వచ్చామంటూ కత్తిని చూపించి వెళ్లిపోయారు. హుస్సేన్ పాషా(ఆషూ), అతడి సోదరుడు మహ్మద్ పాషా(30) ఆక్టివాపై అటుగా వస్తుండటాన్ని గమనించిన అష్వాఖ్ తన అనుచరులతో కలిసి కత్తులతో దాడి చేశాడు. హత్యాయత్నం కేసు నమోదు చేసుకున్న కాలాపత్తర్ పోలీసులు 13 మంది నిందితుల్లో ఓ ఎనిమిది మందిని అరెస్ట్ చేయగా, మిగిలినవారు పరారీలో ఉన్నారు.

స్థల వివాదంలో మాజీ ఎంపీటీసీ హత్య

- కళ్లల్లో కారంపొడి చల్లి కర్రలతో దాడి
- జేసీబీతో డంపింగ్ యార్డులో మృతదేహం పూడ్చివేత
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిందితుల ఇళ్లపై బాధితుల రాళ్ల దాడి



మహేశ్ మృతదేహం



మృతుడు గడ్డం మహేశ్ (ఫైల్)

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో ఈ నెల 15న అదృశ్యమైన కాంగ్రెస్ నేత, ఘట్‌కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేశ్(45) హత్యకు గురయ్యాడు. ప్లాటు వివాదంలో జోక్యం చేసుకుంటూ తమ ఆస్తిని కాజేయాలని ప్రయత్నిస్తున్నాడని నిందితులు కక్ష పెంచుకొని మహేశ్‌ను దారుణంగా హత్య చేసి డంపింగ్ యార్డులో పూడ్చిపెట్టారు. ఈ ఘటన వివరాలను సీఐ సైదులు సోమవారం వెల్లడించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గడ్డం మహేశ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. కొంతకాలంగా అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్,(36), కడుపొల్ల ప్రవీణ్(27)తో ప్లాటు విషయమై వివాదం నెలకొంది. ఈ క్రమంలో శ్రీనివాస్‌పై మహేశ్ క్రిమినల్ కేసు పెట్టాడు. దీంతో అతడిని చంపాలని ప్రవీణ్‌ను శ్రీనివాస్ సంప్రదించాడు. మహేశ్ తమ బంధువుతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని ప్రవీణ్ ఆగ్రహంగా ఉన్నాడు. దీంతో ఇరువురు కలిసి మహేశ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు.

రాజీ చేసుకుందామని పిలిచి అంతమొందించారు....

ఘట్‌కేసర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద గల మహేశ్ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఈ నెల 14 రాత్రి రాజీ చేసుకుందామని చెప్పి ఆఫీసుకు రావాలని కోరారు. అందుబాటులో లేనని మహేశ్ చెప్పడంతో తిరిగి 15న ఉదయం రావాలని కోరారు. మహేశ్ తన ఆఫీసుకు చేరుకోగానే కళ్లల్లో కారం పొడి చల్లి, కర్రలతో దాడి చేసి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం ఆఫీస్ షెటర్ మూసి వెళ్లిపోయారు. రాత్రివేళ మహేశ్ కారులోనే అతడి శవాన్ని శ్రీరాములు, రాజు అనే వ్యక్తుల సాయంతో కొండాపూర్ డంపింగ్ యార్డుకు తరలించి జేసీబీతో పూడ్చిపెట్టారు. అందుకు జేసీబీ ఓనర్ నరేశ్, డ్రైవర్ సోహన్ కూడా సహకరించారు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా మహేశ్ కనిపించకపోవడంతో అతడి సోదరుడు విఠల్ ఈ నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు శ్రీనివాస్, ప్రవీణ్, నరేశ్, సోహన్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. శవాన్ని పూడ్చడానికి సహకరించిన ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన శ్రీరాములు, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రాజు పరారీలో ఉన్నారు. సోమవారం నాయబ్ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శవ పంచనామా, గాంధీ ఆస్పత్రి వైద్యాధికారి మహేందర్‌రెడ్డి బృందం పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంతకుముందు మృతుడి బంధువులు నిందితుడు ప్రవీణ్ ఇంటిపై రాళ్లతో దాడి చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను కస్టడీకి తీసుకొని మహేశ్‌కు సంబంధించిన కారు, ఇతర వివరాలు తెలుసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం

- గర్భం దాల్చడంతో గుట్టురట్టు
- ఐదుగురు నిందితులపై కేసు నమోదు



కాచిగూడ: సెల్‌ఫోన్ వాడటమే ఆ మైనర్ బాలికకు శాపంగా మారింది. సెల్‌ఫోన్‌లో పరిచయమైన ఓ వ్యక్తి ఆమెకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడటమే గాక తన నలుగురు స్నేహితులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ బాలిక గర్భం దాల్చడంతో వారి గుట్టు రట్టయింది. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక మహిళ తన కుమార్తె (15)తో కలిసి వలస వచ్చి కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటోంది. కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. కుమార్తె ఆరవ తరగతిలో చదువు మానేసి ఇంటివద్దనే ఉంటోంది. సెల్‌ఫోన్‌లో నేరెడ్‌మెట్ వినాయకనగర్‌కు చెందిన విజయ్ కుమార్ (23)తో బాలికకు పరిచయం ఏర్పడింది. 2023 ఆగస్టు నుంచి బాలికను విజయ్ కుమార్ పలుమార్లు నేరెడ్‌మెట్ తీసుకొని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. తన వాహనంపై ఆమెను ఎక్కించుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో తిరిగేవాడు. కొన్ని రోజుల క్రితం విజయ్ కుమార్ బాలికను నేరెడ్‌మెట్ వినాయకనగర్‌కు తీసుకువెళ్లి తన స్నేహితులైన బాలు (20), కృష్ణ (21), కిరణ్ (20), అజయ్ (22)లకు పరిచయం చేశాడు. ఐదుగురు కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ తర్వాత కొద్దిరోజులకు బాలికకు నెలసరి రుతుస్రావం రాకపోవడంతోపాటు అనారోగ్యం బారిన పడింది. దీంతో బాలికను తల్లి నిలదీయగా అత్యాచారం విషయం చెప్పింది. ఈ విషయమై తల్లి నాలుగు రోజుల క్రితం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఆ మైనర్ బాలికను భరోసా సెంటర్‌కు పంపారు. భరోసా సెంటర్ నిర్వాహకురాలు మైనర్ బాలిక పరిస్థితిని చూసి కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో పోలీసులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా రేకుర్తి గ్రామానికి చెందిన ద్యావ మల్లారెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి(27) హైదరాబాద్ శివారు బాలాపూర్‌లో డైరీఫామ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో రూమ్ నెంబర్ 209ను అద్దెకు తీసుకున్నాడు. సోమవారం హోటల్ మేనేజర్ శ్రీరామ్ తలుపుతట్టినా తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాచిగూడ పోలీసులు వచ్చి రూమ్ తలుపులు తీయగా అనుమానాస్పదస్థితిలో పురుగులమందు తాగి వంశీకృష్ణారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపుల మూసివేత నిబంధనలు మారలేదు

సాక్షి,సిటీబ్యూరో: సోషల్ మీడియా వేదికగా సిటీ పోలీసులు రాత్రి 10.30 లేదా 11 గంటలకే షాపులను మూసివేయిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న నిబంధనల మేరకే దుకాణాలు, సంస్థలు తెరిచే, మూసివేసే సమయాలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా ఎక్స్ వేదికగా సిటీ పోలీసులు సూచించారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నేడు విద్యార్థుల ర్యాలీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నెక్లెస్ రోడ్ జలవిహార్ వేదికగా మంగళవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన దాదాపు 2000 మంది విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి


జెడ్‌సీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా 2015వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అనురాగ్ జయంతి సోమవారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన సిరిసిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనురాగ్‌ను జోనల్ పరిధిలోని డీసీలు, ఏఎంహెచ్‌ఓలు, ఇంజినీర్లు, ట్యాక్స్ విభాగం అధికారులు కలిసి అభినందించారు.

అనూహ్యారెడ్డికి అరుదైన అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ అనూహ్యారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: నగరానికి చెందిన కోవిద సహృదయ ఫౌండేషన్ ద్వారా వేలాదిమందికి సేవాకార్యక్రమాలను నిర్వహించిన డాక్టర్ జి.అనూహ్యారెడ్డికి అరుదైన అవార్డు లభించింది. యూకే పార్లమెంట్ డాక్టర్ జి.అనూహ్యారెడ్డికి సేవారత్న–2024 అవార్డుతో సత్కరించింది. సోమవారం లండన్ పార్లమెంట్ వేదికగా హౌస్ ఆఫ్ లార్డ్‌లో వర్లడ్ క్రికెట్ కౌన్సిల్ యూకే చైర్మన్ డాక్టర్ హరిఓం త్యాగి, లండన్ మాజీ ఎంపీ పాల్‌స్కలీలు అనూహ్యారెడ్డికి జ్యువెల్ ఆఫ్ సర్వీల్‌లో భాగంగా సేవారత్న అవార్డును అందించారు. గత పది సంవత్సరాలుగా సేవాకార్యక్రమలను నిర్వహిస్తున్నామని, ఈ అవార్డు నాకు మరింత భాధ్యతను పెంచిందని అనూహ్యారెడ్డి తెలిపారు. ఎంఎస్‌జీ అడ్వర్డ్ కంపెనీ జ్యూరీ మెంబర్స్ గగ్నీత్ కోర్, నితిష్ అరోరాలను ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

‘ప్రజావాణి’కి స్పందన



బంజారాహిల్స్: జలమండలి డివిజన్–6 పరిధిలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల అర్జీలను స్వీకరించారు. నీటి వినియోగదారులు బిల్లులకు సంబంధించిన అంశాలతో పాటు మీటరు రీడింగ్‌లో తలెత్తుతున్న లోపాలు, నీటి సరఫరాలో లో ప్రెషర్ తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జలమండలి సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ స్పష్టం చేశారు. డీజీఎంలు వంశీ, శ్రీనివాసులు, మేనేజర్లు శివకుమార్, రాజేందర్, శ్యాంకుమార్, శ్రీనివాస్, మౌనిక, హిందూజ, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద వసతులు కల్పిస్తాం


ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమైన తహసీల్దార్ అనితారెడ్డి, డీఎంసీ ప్రశాంతి

బంజారాహిల్స్: ఆషాఢ మాస బోనాల జాతర నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద అన్ని వసతులు కల్పించనున్నట్లు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతిలు తెలిపారు. అమ్మవారి ఆలయాల కమిటీ సభ్యులతో సోమవారం వారు సమావేశమయ్యారు. బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరిగిందని, ఆలయాల వద్ద ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు పలు అంశాలను ప్రస్తావించగా వాటిని అధికారులు నోట్ చేసుకున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

- జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి తరలివచ్చిన ప్రజలు
- సమస్యలపై ఫిర్యాదు చేసిన 152 మంది




హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి తమకు అలాట్‌మెంట్ అయిన డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజావాణికి ఇతర కారణాల వల్ల మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, కమిషనర్ ఆమ్రపాలిలు హాజరు కాకపోవడంతో అడిషనల్ కమిషనర్లు కె.శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, నళిని ప్రసాద్, చంద్ర కాంత్ రెడ్డి, సీపీఐ రాజేంద్ర ప్రసాద్ నాయక్‌లు ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు. ప్రజావాణిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, హౌసింగ్ ఎస్‌ఈ విద్యాసాగర్, డిప్యూటీ సీఈ కె.ఎస్.రెడ్డి, కంట్రోల్ రూం ఓఎస్‌డీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

27న బొజ్జా తారకం జయంతి పుస్తకాల ఆవిష్కరణ

కాచిగూడ: పీడిత ప్రజల గొంతుక, సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం 85వ జయంతి పుస్తకాల ఆవిష్కరణ సభ ఈ నెల 27వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుందని బొజ్జా తారకం ట్రస్ట్ సమన్వయ కర్త గనుమల జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనతో తెలిపారు. రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ చంద్రయ్య, ప్రొఫెసర్ జి.సత్యనారాయణ, ప్రొఫెసర్ సుధారాణి, న్యాయవాది నిమ్మ నారాయణ, రచయిత్రి కొండవీటి సత్యవతి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ‘బుద్ధు ని ప్రవచనం’, ‘బొజ్జా తారకం వ్యాసాలు’, ‘స్వతంత్ర భా రతదేశం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా..?’ అనే పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

నిఘా.. కట్టుదిట్టం



లాఠీలు చేతబట్టిన పోలీసులు | అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు | అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు | ఆవారాగాళ్లపై స్పెషల్ ఫోకస్

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

బంజారాహిల్స్: నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవలికాలంలో పెరుగుతున్న హత్యలు, రౌడీషీటర్ల ఆగడాలను దృష్టిలో పెట్టుకుని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీసులు నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు.

- వెస్ట్‌జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, మధురానగర్, ఎస్‌ఆర్‌నగర్, పంజగుట్ట, మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్లలో పరిధిలో గడచిన మూడు రోజులుగా పోలీసులు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.
- ఇన్నాళ్లు మూలన పెట్టిన లాఠీలను చేతుల్లోకి తీసుకున్నారు. బీరువాలో భద్రపరిచిన రివాల్వర్‌లను బెల్టుకు వేలాడదీశారు.
- అర్ధరాత్రి రౌడీలు, ఆవారాగాళ్లు, గంజాయి బ్యాచ్ మద్యం మత్తులో వీరంగం చేస్తున్న వారితో శాంతిభద్రతలకు విఘాగం కలగడమే కాకుండా హత్యలు, దొమ్మీలు, దోపిడీలు, స్నాచింగ్‌లు జరుగుతున్నాయని భావించిన పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పక్కనబెట్టేశారు.
- కొన్నేళ్లుగా ఫ్రెండ్లీ పోలిసింగ్ అంటూ పోలీసులు చేతులు ముడుచుకోగా, రౌడీలు, మందుబాబులు, ఆవారాగాళ్లు రెచ్చిపోయారు. దీంతో శాంతిభద్రతల సమస్య తలెత్తింది.
- ఈ నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. రివాల్వర్లు జేబులో పెట్టుకుని లాఠీలతో వెపన్ పార్టీలు రంగంలోకి దిగాయి.
- ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ హోంగార్డు మొదలు ఏసీపీ, డీసీపీ వరకు రాత్రిపూట ఈ తనిఖీల్లో పాల్గొననున్నారు.
- ఆదివారం నుంచి గురువారం దాకా రాత్రి 10 నుంచి 12 గంటల వరకు, శుక్ర, శనివారాల్లో రాత్రి 10 నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఈ ఆకస్మిక తనిఖీలను అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తారు.


లాఠీలు చేతబట్టిన బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర

- ఇన్‌స్పెక్టర్, డీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు, హోంగార్డులు అందరూ లాఠీలు చేతబట్టుకుని సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెడుతున్నారు.
- ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని అన్నివైపులా నుంచి పోలీసులు చుట్టుముట్టి అర్ధరాత్రి సంచరించే అనుమానితులను తనిఖీలు చేస్తున్నారు.
- ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై ఫోకస్ పెట్టారు. పోలీస్ స్టేషన్‌కు రప్పించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు.
- రోజూ రౌడీషీటర్లు, తల్లిదండ్రులు లేదా, భార్యాపిల్లలు లేదా స్నేహితులతో తమ పరిధి పోలీస్ స్టేషన్‌కు వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఏదైనా కేసులో ఇరుక్కుంటే కఠిన చర్యలు తథ్యమని వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.
- మరోవైపు హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఐదుగురు చొప్పున సాయుధ బలగాలను కేటాయించారు. ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో అక్కడున్న పోలీసులకు అదనంగా ఈ ఐదుగురు చేరి ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు.
- ప్రజలకు శాంతిభద్రతలు అందించడం, సామరస్యపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పోలీసులు ఈ కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని పోలీసులు పేర్కొంటున్నారు.
- ఇదిలా ఉండగా పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల వద్ద కూడా అర్ధరాత్రి నిఘా పెడుతున్న పోలీసులు అనుమానితుల కదలికలను గమనిస్తున్నారు. అవసరమైతే వారిని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.
- కత్తులు, కటార్లు, గంజాయి ప్యాకెట్లు, బ్లేడ్లు ఇతరత్రా మారణాయుధాలను కలిగి ఉంటే వారిని అరెస్టు చేయనున్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

సేవాభావంతో ముందుకు సాగాలి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్


విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: రెండు దశాబ్దాలుగా పేద విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోటుపుస్తకాలు అందజేస్తూ వస్తున్న మహేష్‌యాదవ్ సేవలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం మంగళవారపు శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ... మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తన వంతుగా ప్రతి ఒక్కరికీ షూస్ అందజేస్తానని హామీ ఇచ్చారు. మహేష్‌యాదవ్ మాట్లాడుతూ... తాను సంపాదించిన దాంతో కొంత సేవా కార్యక్రమాలకు కేటాయిస్తానని తెలిపారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ రామన్‌గౌడ్ హేమలత, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్, నేతలు నవీన్‌యాదవ్, బాక్సర్ అశోక్, పృథ్వీరాజ్, రాజు, సురేందర్, సుజాత, రమాదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు



బంజారాహిల్స్: కాలనీల్లో గ్రీన్‌వేస్టేజ్‌ను తొలగించాలని అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బంజారాహిల్స్ కాలనీలతో పాటు ఫిలింనగర్ సొసైటీ, జూబ్లీహిల్స్ సొసైటీ కాలనీల్లో పెద్ద ఎత్తున ఎక్కడ చూసినా గ్రీన్ వేస్టేజ్ కుప్పలు కనిపిస్తున్నాయి. రోజుల తరబడి వీటిని తొలగించకుండా వదిలేస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రమై దోమలు పెరిగిపోతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం దారిలో ఎండిపోయిన కొమ్మలు నెలలు దాటుతున్నా తొలగించకుండా అలాగే వదిలేశారని కాలనీవాసులు ఫిర్యాదు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌లపై మొక్కలు

బంజారాహిల్స్: హరితహారం కార్యక్రమంలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌పై గతేడాది మొక్కలు నాటిన ప్రాంతాల్లో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను అధికారులు నాటుతున్నారు. ఇప్పటికే పార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌పై మొక్కలు నాటేందుకు గుంతలు తీశారు. మరో రెండు రోజుల్లో పార్కు చుట్టూ మొక్కలు నాటే పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.


మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఇంటెలిజెన్స్ ఎస్‌ఐ శ్రీశైలంకు ఉత్తమ సేవా పతకం


పగడాల శ్రీశైలం

హిమాయత్‌నగర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2వ తేదీన తెలంగాణ ప్రభుత్వం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు మహోన్నత సేవ, ఉత్తమ సేవ, కఠిన సేవా పథకాలను ప్రతి సంవత్సరం ప్రకటిస్తుంది. 2024 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 22న రాష్ట్ర ప్రభుత్వం సేవా పథకాలను ప్రకటించింది. ఇందులో భాగంగా అంబర్‌పేట్‌కు చెందిన ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్‌ఐగా పని చేస్తున్న పగడాల శ్రీశైలంకు ప్రభుత్వం ఉత్తమ సేవా పథకం ప్రకటించింది. 1989లో కానిస్టేబుల్‌గా జాయిన్ అయిన శ్రీశైలం విధి నిర్వహణలో స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్ విభాగాలలో పనిచేసిన సమయంలో అనేక క్యాష్ రివార్డులు, ప్రశంస పత్రాలు పొందారు. తన సర్వీసులో దాదాపు 380 రివార్డులు పొందారు.

సహజ యోగాతో మానసిక ప్రశాంతత


- జూన్ 26 నుంచి 30 వరకు ‘హైదరాబాద్ రియలైజేషన్ టూర్’
- సహజ యోగా తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గౌరు కృష్ణ


కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సహజ యోగా ప్రతినిధులు

హిమాయత్‌నగర్: తెలంగాణలో ఉన్న ప్రతి మనిషికి సహజ యోగా ద్వారా వచ్చే ప్రశాంతతను, ఆనందాన్ని అందించటానికి ఈనెల 26 నుంచి 30 వరకు ‘హైదరాబాద్ రియలైజేషన్ టూర్ ని’ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు సహజ యోగా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గౌరు కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... విదేశాల నుంచి, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతానని చెప్పారు. వీరంతా నాలుగు రోజుల పాటు సహజయోగా పరిచయ కార్యక్రమాలు, స్ట్రెస్ మానేజ్ మెంట్ సెషన్స్‌ని వివిధ కళాశాలల్లో, పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 28 నుంచి 30 వరకు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, 29 నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో, 30న పీజేఆర్ స్టేడియం చందానగర్‌లో సాయంత్రం 5 గం. నిర్వహిస్తామన్నారు. సహజ యోగాభ్యాసం ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా అందిస్తున్నామన్నారు. వివరాలకు ఫోన్ : 89889 82200లో సంప్రదించాలన్నారు. పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి స్థాపించిన సహజయోగా సుమారు 170 దేశాలలో లక్షలాది మంది కుల, మత, ప్రాంత, భాష, వయస్సుతో నిమిత్తం లేకుండా సహజయోగా సాధన చేస్తూ దైనందిన జీవితంలో తాము ఎదుర్కొంటున్న శారీరిక, మానసిక, భావోద్వేగ సమస్యలను పరిష్కరించుకుంటూ, ఆధ్యాత్మికమైన సంతృప్తిని పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కె.సుబ్బిరెడ్డి, రామ్మోహన్ రావు, మల్లారెడ్డి, సుప్రజ, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లిచ్చారు.. అక్కడికెళ్తే గెంటేస్తున్నారు

జీహెచ్‌ఎంపీ ప్రధాన కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా


లబ్ధిదారులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

హిమాయత్‌నగర్: మాకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చారు కానీ అక్కడికి వెళితే మమ్మల్ని గెంటేస్తున్నారని డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా దారుణంగా తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఉన్నాయని చెబుతున్నారు. సోమవారం లిబర్టీ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం గేటు ముందు ప్రజావాణి జరుగుతున్న సమయంలో సీపీఐ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, ఇతర సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ... పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గత ప్రభుత్వం ఆగస్టు,సెప్టెంబర్‌లో లబ్ధిదారులకు కేటాయించినప్పటికీ ఆ ఇళ్లను వారికి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు.

28న సీఎం ఇంటిని ముట్టడిస్తాం

లక్డీకాపూల్: లంబాడీ సామాజిక వర్గానికి కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వాలని లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘాలు రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను సాధించుకునే క్రమంలో ఈ నెల 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామనని హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన అందిస్తామని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఒక్కరంటే ఒక్కకికి కూడా మంత్రులు లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య


జ్యోత్స్నశ్రీ (ఫైల్)

వెంగళరావునగర్: తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు నామవరపు జ్యోత్స్న శ్రీ (17) భద్రాచలంలో 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివింది. అనంతరం ఆమెను ఇంగ్లిష్ మీడియంలోకి మారుస్తూ తల్లి రజిని భద్రాచలంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో బైపీసీలో వేసింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేసుకున్న జ్యోత్స్నశ్రీ తనకు ఇంగ్లిష్ పాఠాలు అర్థం కావడం లేదంటూ చదువు మానేసి హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలోని తన పిన్ని స్వరూప ఇంటికి వచ్చింది. భర్తతో విభేదాలు రావడంతో గత ఏడాది నుంచి జ్యోత్స్నశ్రీ తల్లి కూడా స్వరూప ఇంట్లోనే ఉంటుంది. నాలుగురోజులుగా ఆ యువతి అమీర్‌పేటలోని ఓ షోరూంలో పని చేస్తుంది. ఆమె సరిగ్గా పని చేయకపోవడంతో షాపు ఓనర్ నాగమణి యువతి తల్లికి ఫోన్ చేసి చెప్పింది. ఇటీవల యువతి తల్లి భద్రాచలం వెళ్లింది. అక్కడ నుంచి తన కుమార్తెకు ఫోన్ చేసి అటు చదువుకోకపోగా పని కూడా సరిగ్గా చేయకపోతే ఎలా అంటూ మందలించింది. దాంతో ఆ యువతి తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన స్వరూప తలుపు గడియ కూడా పెట్టకుండా ఉండటంతో లోపలకు వెళ్లింది. స్వరూపకు జ్యోత్స్న ఉరేసుకుని ఉండటం చూసి 108కి ఫోన్ చేసి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే యువతి మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలి పిన్ని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత అదృశ్యం


అదృశ్యమైన పార్వతిరావల్

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో వివాహిత అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–13లోని ప్లాట్ నెంబర్–77లో దామర్‌రావల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య పార్వతిరావల్ (29) ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. పాఠశాల నుంచి పిల్లలకు వచ్చిన పిల్లలకు తల్లి కనిపించకపోవడంతో ఇదే విషయాన్ని తండ్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆందోళనతో ఇంటికి వచ్చిన భర్త భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పార్వతి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 95506 26571లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

బాలుడి అదృశ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సూరేపల్లి జయరాజు జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 22న అతని కుమారుడు అఖిల్ తమ రూం నుంచి బయటకు వెళ్ళాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. అతనికి చెవుడు కూడా ఉంది. గాలించగా తమ కుమారుడిని ఒక మహిళ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లినట్టు పూలు విక్రయించే మహిళ తెలియజేసింది. దాంతో అఖిల్ తండ్రి జయరాజ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ డ్రైవింగ్ చేస్తున్న మూడు వాహనాలు స్వాధీనం

వెంగళరావునగర్: రాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులను అదుపులోనికి తీసుకుని వాహనాలను మధురానగర్ పీఎస్‌కు తరలించిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం నెంబర్‌ప్లేట్ లేకుండా, సైలెన్సర్ తొలగించిన, లైసెన్స్ లేకుండా నడుపుతున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన మూడు వాహనాలను పట్టుకుని మధురానగర్ పీఎస్‌కు తరలించారు. వాహనదారులను అదుపులోనికి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



థామస్ బాబు (ఫైల్)

హిమాయత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పనిచేస్తున్న కార్యాలయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారాయణగూడ ఎస్‌ఐ నరేష్‌కుమార్ సమాచారం మేరకు... గాంధీనగర్‌కి చెందిన పులిమూతిన్ థామస్ బాబు కుట్టి బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమేలాలోని తిరుమల అపార్ట్‌మెంట్‌లోని శాట్ నెట్ కేబుల్ ఆఫీస్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటలకు నివాసం నుంచి కార్యాలయానికి బయలుదేరాడు. సుమారు ఉ.11:30 గంటలకు లోపల నుంచి తలుపు లాక్ చేసి కార్యాలయంలో నైలాన్ తాడుతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుమారుడు మైఖేల్ థామస్ బాబుకు కార్యాలయ సిబ్బంది ఫోన్ చేసి చెప్పారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో, బ్యాంక్‌లలో తీసుకున్న అప్పులు కట్టలేక, డిప్రెషన్‌తో తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని, తన తండ్రి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మైఖేల్ థామస్ బాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

మానసిక ఒత్తిడి తట్టుకోలేక...

వెంగళరావునగర్: మానసిక ఒత్తిడి తట్టుకోలేకఓమహిళ ఆత్మహత్య చేసుకుంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... ఎస్.యాదగిరిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 23న మధ్యాహ్నం తమ కోడలు కొత్త వాషింగ్ మెషీన్ వచ్చిందని, దానిని తీసుకోవాలని ఫోన్ ద్వారా యాదగిరిరెడ్డికి తెలియజేసింది. దీంతో అతను ఐదో అంతస్తు నుంచి రోడ్డు మీదికి వచ్చి దానిని తీసుకుని తిరిగి తమ ఫ్లాట్‌కు వెళ్లాడు. అప్పటికే విజయలక్ష్మి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు వచ్చిన 108 అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి ఆమె మృతి చెందినట్టు తెలిపారు. చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులు మృతి చెందారు. చిన్న విషయాలకే ఆమె మానసికంగా ఒత్తిడికి గురవుతూ ఉండేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె మృతికి ఇతర కారణాలుగానీ, అనుమానాలుగానీ లేవని యాదగిరిరెడ్డి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కిడ్నీలు జర భద్రం!



డయాలసిస్ ప్రక్రియతో రోగులకు మేలు

- పది కాలాల పాటు జీవించేందుకు ఆస్కారం
- నిత్యం డయాలసిస్ చేయించుకుంటే ఎంతో మేలు
- మంచి ఆహారపు అలవాట్లు, శుభ్రమైన నీరు తప్పనిసరి
- చిన్న పిల్లల్లో జన్యుపరంగా కిడ్నీ సమస్యలు
- కాస్త ఆలస్యమైనా ప్రాణాలకే ప్రమాదం
- కొన్ని రకాల క్యాన్సర్లు కిడ్నీ పరీక్షల్లో బయటపడే అవకాశం
- చిన్న పిల్లలకు డయాలసిస్ చేయడం ఎంతో క్లిష్టం
- పెయిన్ కిల్లర్, యాంటీ బయాటిక్స్‌తో కిడ్నీ ఫెయిల్యూర్

సాక్షి స్పెషల్ స్టోరీ

సాక్షి, సిటీబ్యూరో: మూత్రపిండాలు మానవ శరీరంలో చాలా కీలకమైన అవయవాలు. అవి సక్రమంగా పనిచేస్తేనే శరీరంలోని మిగతా అన్ని అవయవాలు సరిగ్గా ఉంటాయి. ఆరోగ్యంగా నాలుగు కాలాల పాటు జీవించగలడు. మూత్ర పిండాలు సరిగ్గా పనిచేయకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే కిడ్నీ సమస్యలు ఉన్నట్టు తొలి దశలో అర్థం కాదు. ఎలాంటి లక్షణాలు కూడా బయటపడవు. దాదాపు 80 శాతంపైగా కిడ్నీలు పాడైన తర్వాతే చాలా మందికి అర్థం అవుతుంది. అప్పటికే జరగాల్సిన అనర్థం జరిగిపోతుంది. కొందరిలో కిడ్నీ సమస్యలు ఉన్నాయని తెలిసిన రెండు మూడు వారాలకే మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోతే శరీరంలో పేరుకుపోయే వ్యర్థ పదార్థాలను బయటకు వెళ్లిపోవు. దీంతో అవి కాస్తా విషపదార్థాలుగా మారి శరీరంలోని ఒక్కో అవయవం దెబ్బతింటుంది. అలా ప్రాణాంతకంగా మారుతుంది. అందుకే కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యం.

వారికి అదొక్కటే మార్గం..

కిడ్నీ ఫెయిల్యూర్ రెండు రకాలుగా ఉంటుంది. కొందరికి తాత్కాలికంగా, మరికొందరు పూర్తిగా కిడ్నీలు పాడైపోతాయి. డీహైడ్రేషన్, పెయిన్ కిల్లర్స్ అతిగా వాడటం, ఇన్ఫెక్షన్లు, గుండెకు రక్త ప్రసరణ నిలిచిపోవడం తదితర కారణాల వల్ల కిడ్నీలు తాత్కాలికంగా పనిచేయవు. తాత్కాలిక కిడ్నీ ఫెయిల్యూర్‌కు కూడా డయాలసిస్ చేయాలి. అయితే శాశ్వత కిడ్నీ ఫెయిల్యూర్‌కు మాత్రం దీర్ఘకాలిక డయాలసిస్ ఒక్కటే మార్గం. డయాబెటిస్, బీపీ, ఆటో ఇమ్యూన్ డిసీజ్, జన్యుపరమైన సమస్యల వల్ల మూత్రపిండాలు శాశ్వతంగా పాడవుతాయి.

డయాలసిస్ అంటే ఏంటి?

సాధారణంగా కిడ్నీలు రక్తంలోని వ్యర్థాలను వడపోస్తాయి. కిడ్నీలు 80 శాతం పాడయ్యే వరకు ఆ పనిని చక్కగా నిర్వర్తిస్తాయి. అప్పటివరకు ఎలాంటి లక్షణాలు బయటపడవు. అంతకుమించి పాడైతే మాత్రం కిడ్నీలు చేయాల్సిన పనులను చేయలేక మొరాయిస్తాయి. అలాంటి సమయంలో వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఇలాంటి వారికి డయాలసిస్ ప్రక్రియ వరప్రదాయిని అని చెప్పొచ్చు. డయాలసిస్ ప్రక్రియలో కిడ్నీలు చేయాల్సిన పనిని మెషీన్ సాయంతో రక్తాన్ని వడపోసి వ్యర్థాలను తొలగిస్తారు. హీమోడయాలసిస్ ప్రక్రియను వారానికి మూడు సార్లు చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ నాలుగు గంటల పాటు జరుగుతుంది.

ఆలస్యమైతే ఏమవుతుంది?

కిడ్నీలు పాడైన వారు నిరంతరం డయాలసిస్ చేయించుకోవాలి. డయాలసిస్ ఆలస్యమైతే రక్తంలో వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి మిగతా అవయవాల్లో ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. ఈ విషయంలో కాస్త అలసత్వం వహించినా.. సమస్య మరింత జఠిలం కావచ్చు. కొద్ది రోజులు ఆగి చేయించుకుందామని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం ఉంటుంది. మూత్రం సరిగ్గానే వస్తోందని, ఆరోగ్యం బాగానే ఉందని ఆలస్యం చేసినా జరగాల్సిన నష్టం జరుగుతుంది. మూత్రపిండాలు మందకొడిగా పనిచేస్తాయి. నీటిని వడగట్టలేకపోవడంలో విఫలమవుతాయి. విషపదార్థాలు రక్తంలోనే ఉండిపోతాయి. కొన్నిసార్లు నీరు ఊపిరితిత్తుల్లోకి చేరుతుంది. దీనివల్ల 'పల్మనరీ ఎడిమా' అనే సమస్య ఏర్పడుతుంది. దీంతో శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులు, ఆయాసం వస్తుంది. సమయానికి డయాలసిస్ చేయించుకునేవారు ఎక్కువ కాలం జీవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

అలసత్వం వద్దు..



డయాలసిస్ చేయించుకోవడంలో అస్సలు అలసత్వం వద్దు. వారానికి మూడుసార్లు కచ్చితంగా చేయించుకుంటే ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉంటారు. రేపు, మాపు అంటూ నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. కుటుంబంలో ఎవరికైనా కిడ్నీ సమస్యలు ఉంటే అందరూ పరీక్షలు చేయించుకోవడం మంచిది. దీంతో ప్రాథమిక దశలోనే చికిత్స తీసుకోవచ్చు. ముఖ్యంగా పారిశ్రామికవాడల్లో ఉండేవారు కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. సౌందర్య సాధనాల వల్ల కూడా కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

– శ్రీభూషణ్ రాజు, నెఫ్రాలజీ విభాగం అధిపతి, నిమ్స్

ఫిస్టులా చేయించుకోవాల్సిందే..

డయాలసిస్ కన్నా ముందు ఫిస్టులా అనే ప్రక్రియ తప్పనిసరి. ఈ పద్ధతిలో చేయి పైన ధమని, సిరాను ఫిస్టులా అనే లావు పాటి సూది(క్యాథటీర్) ద్వారా కలుపుతారు. డయాలసిస్ ప్రక్రియ చేసే సమయంలో ఫిస్టులా లేకపోవడం వల్లే చాలా వరకు రోగి ప్రాణాపాయ స్థితిలో వెళ్లి.. చనిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే డయాలసిస్ ముందు ఫిస్టులా వేయించుకోవడం చాలా ముఖ్యం అని డాక్టర్లు చెబుతున్నారు.

నీరు తీసుకోకపోవడం వల్లే..

చాలావరకు కిడ్నీ సమస్యలు పరిశుభ్రమైన నీరు తీసుకోకపోవడం వల్ల వస్తుంటాయి. ముఖ్యంగా నీళ్లలో ఉండే పాదరసం, సీసం, ఫ్లోరిన్ వంటి లోహాలు కిడ్నీలను పాడు చేస్తాయి. పారిశ్రామికవాడల్లో ఉండే వారు తరచూ కిడ్నీ పరీక్షలు చేయించుకుంటే ముందుగానే సమస్యలను గుర్తించవచ్చు. దీంతో సరైన సమయంలో చికిత్స తీసుకుని ప్రాణాపాయస్థితి నుంచి బయటపడొచ్చు. సౌందర్య సాధనాల్లో ఉండే కెమికల్స్ కూడా కిడ్నీలు పాడయ్యేందుకు కారణం అవుతాయి.

ఆహారం విషయంలో అపోహలొద్దు..

సాధారణంగా కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు మంచి ఆహారం తీసుకోవాలి. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా వైద్యులు సూచించిన మేరకు సరైన ఆహారం తీసుకోవాలి. అప్పుడే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. సరైన ఆహారం లేకపోతే ఎముకలు, కండరాలు, రక్తనాళాలు, నరాలు బలహీనమై సమస్య మరింత జఠిలమవుతుంది. అది ప్రాణాపాయస్థితికి కూడా దారి తీయొచ్చు. డయాలసిస్ ప్రక్రియ ఇప్పుడు దాదాపు అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంది. ఎలాంటి భయం, అనుమానాలు, అపోహలు లేకుండా రెగ్యులర్‌గా డయాలసిస్ చేయించుకుంటే ప్రాణాపాయస్థితి నుంచి బయటపడొచ్చని మూత్రపిండాల నిపుణులు చెబుతున్నారు.

డయాబెటిస్, హైబీపీ కూడా కారణమే..

డయాబెటిస్ వల్ల కూడా కిడ్నీలు పాడవుతున్నాయి. డయాబెటిస్ సోకిన తర్వాత సరైన శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల పదేళ్లలో కిడ్నీలు పాడవుతుంటాయి. 30- 40 ఏళ్ల వయసు వారు ఎక్కువగా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇక అధిక రక్తపోటు ఉన్న వారిలో కూడా కిడ్నీలు సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. బీపీ ఉన్న వారు కిడ్నీ సంబంధిత పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలి. పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్ వంశపారంపర్యంగా వస్తుంది. ప్రతి నలుగైదుగురిలో ఒకరిలో వస్తుంది. ఇంట్లో ఎవరికైనా ఇలాంటి సమస్య ఉంటే మిగిలిన వారు కూడా పరీక్షలు చేయించుకుంటే ముందుగానే సమస్యలు గుర్తించి సరైన చికిత్స తీసుకోవచ్చు.

పెయిన్ కిల్లర్స్ వల్ల..

చిన్న నొప్పి వచ్చినా ఇటీవల పెయిన్ కిల్లర్ మందులు వాడటం ఎక్కువైంది. అలాగే కడుపులో మంట తగ్గించే మందులు, యాంటీ బయాటిక్స్ వంటి మందులను ఎక్కువగా వాడటం వల్ల కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. కిడ్నీల్లో రాళ్లు వస్తే సరైన చికిత్స తీసుకోకపోవడం, వాటిని తొలగించుకోకపోవడంతో ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. దీంతో కిడ్నీలు పాడైపోతాయి. 60 ఏళ్లు దాటిన వారిలో ఎక్కువగా ఇన్ఫెక్షన్ల వల్ల, పెయిన్ కిల్లర్ల, ఎసిడిటీ మందులు వాడకం వల్ల కిడ్నీలు చెడిపోతుంటాయి. కొందరిలో క్యాన్సర్ సోకిన వారిలో కూడా కిడ్నీలు పాడయ్యే అవకాశం ఉంటుంది. మైలోమా, బోన్‌మ్యారో, ల్యుకేమియా కొన్ని రకాల క్యాన్సర్లు కిడ్నీ పరీక్షల ద్వారా కూడా తెలుస్తుంది.

కిడ్నీ సమస్యలు ఎందుకు వస్తాయి?

చిన్నపిల్లల్లో కిడ్నీ సమస్యలు పుట్టుకతోనే వస్తున్నాయి. కడుపులో ఉండగానే స్కానింగ్‌ల ద్వారా ఈ విషయాలను గుర్తిస్తున్నారు. కిడ్నీలు సరిగ్గా ఎదగకపోవడం, మూత్ర నాళాలు సరిగ్గా అభివృద్ధి చెందకపోవడం, ఫిల్టర్లు పాడైపోవడం వల్ల చిన్న వయసులోనే డయాలసిస్ అవసరం పడుతోంది. ఈ పరిస్థితి జన్యుపరమైన లోపాల వల్ల వస్తుంటుంది. ఈ సమస్యలు ఉన్న పిల్లలు వాడే మందుల వల్ల కూడా సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంది. వీరి శరీరాల్లో రక్త నాళాలు సరిగ్గా అభివృద్ధి చెందకపోవడం వల్ల వారికి డయాలసిస్ ప్రక్రియ చేయడం కాస్త సంక్లిష్టంగా ఉంటుంది. యువతీ యువకుల్లో కిడ్నీలో రాళ్లు, అనవసరమైన మందులు వాడటం వల్ల కిడ్నీలు పాడవుతున్నాయి.

ప్రజాపాలన పేరుకేనా..?

- ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- మల్కాజిగిరిలో సమస్యలు పరిష్కరించండి
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తా..
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడ, రాజశ్రీనివాసనగర్, రాజానగర్ తదితర ప్రాంతాల్లో నత్తనడకన కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆగిపోయిన బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి స్థానిక నాయకులు, ఆయా కాలనీవాసులతో కలిసి ధర్నాకు దిగారు. అధికారుల మొండి వైఖరి నశించాలని నినాదాలు చేశారు. ప్రజాపాలన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని నీరుగారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్జాలగూడ, రాజశ్రీనివాసనగర్, రాజానగర్, వెంకటాద్రినగర్ కాలనీవాసులకు ముంపు సమస్య పరిష్కారానికి రూ.1.30 కోట్లతో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని తాను జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, మల్కాజిగిరి సర్కిల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేసినా పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, సంబంధిత మంత్రులను కలుస్తానని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న సర్కిల్ డీఈ లౌక్య ధర్నా స్థలానికి చేరుకొని బాక్స్‌డ్రైన్ పనులు చేపడుతున్న చోట విద్యుత్ పోల్స్ ఉన్నాయని, వాటిని తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు తొలగించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ మేకల సునీత, బీఆర్‌ఎస్ నాయకులు రాముయాదవ్, సిద్ది రాములు, భిక్షపతి, మల్లేష్ యాదవ్, భైరు అనిల్, అనిత, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం



విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అన్నారు. తక్షణమే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేవలం ఓట్ల కోసమే కాంగ్రెస్ మోసపూర్తి వాగ్దానాలు చేసిందని విమర్శించారు. గ్రూప్–2, 3 పోస్టులను పెంచాలని, 25 వేలతో మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్–46ను రద్దు చేయాలన్నారు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొంపల్లి రాజు, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ దత్తాత్రేయతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోజుకు 3 వేల పాస్‌పోర్టులు జారీ

- దరఖాస్తుదారుల పొరపాట్లతోనే కొన్ని ఆలస్యం
- ఎవరూ దళారులను నమ్మి నష్టపోవద్దని సూచన
- పాస్‌పోర్టు సేవా దివస్ సందర్భంగా 'సాక్షి'తో రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ జె.స్నేహజ





కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: దరఖాస్తుదారుల పొరపాట్ల వల్లే కొన్ని పాస్‌పోర్టుల జారీ జాప్యమవుతోందని, పలు దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ అన్నారు. గుర్తింపు కార్డుల్లో వివరాలు, దరఖాస్తుల్లోని అంశాలు పక్కాగా ఉంటే వెంటనే పాస్‌పోర్టులు జారీ చేస్తున్నామని ఆమె తెలిపారు. పాస్‌పోర్టు దివస్ నేపథ్యంలో సోమవారం స్నేహజ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

దేశంలోనే ఐదో స్థానంలో హైదరాబాద్ ఆర్పీవో..

ఇటీవల కాలంలో అనేకమందికి ఖర్చు చేసే సామర్థ్యం పెరిగింది. దీంతో సెలవుల కోసం దుబాయ్ వంటి చోట్లకు వెళ్లి వస్తున్నారు. ఇక్కడ నుంచి వెళ్లి అమెరికా, లండన్ తదితర దేశాల్లో స్థిరపడినవాళ్లు అనేక మంది ఉన్నారు. వీరి వద్దకు కుటుంబీకులు వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే పాస్‌పోర్టులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. పాస్‌పోర్టుల జారీలో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం గతేడాది దేశంలోనే ఐదోస్థానంలో నిలిచింది. గతంలో సాధారణ పాస్‌పోర్టు దరఖాస్తు అపాయింట్‌మెంట్‌కు 25 రోజులు పట్టేది. ఈ సమయాన్ని గణనీయంగా తగ్గించాం. ఇప్పుడు ఇది 18 పనిదినాలు, తత్కాల్‌కు గరిష్టంగా వారం పడుతోంది. సాధారణ పాస్‌పోర్టును ఏడు నుంచి పది పని దినాల్లో (పోలీసు వెరిఫికేషన్ సమయం అదనం), తత్కాల్ కింద ఒకటి నుంచి మూడు పని దినాల్లో జారీ చేస్తున్నాం.

ఈ వివరాలు పక్కాగా చూసుకోండి..

పుట్టిన తేదీ, చిరునామా, గుర్తింపు పత్రాల్లో పేరు, ఇతర వివరాలు పక్కాగా ఉండాలి. కొందరికి ఒక్కో దాంట్లో ఒక్కో విధమైన స్పెల్లింగ్స్ ఉంటున్నాయి. ఈ కారణంగానూ పాస్‌పోర్టు దరఖాస్తు తిరస్కరణకు గురవుతోంది. అలాంటప్పుడు వాళ్లు మళ్లీ ఆ పొరపాట్లు సరి చేసుకుని వచ్చే వరకు పాస్‌పోర్టు జారీ కాదు. ప్రతి ఒక్కరూ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసే ముందు వారి పేర్లు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు ఒకేలా ఉండేలా చూసుకోవాలి. మరోపక్క పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు పోలీసులు వచ్చినప్పుడు, డెలివరీ కోసం పోస్టల్ సిబ్బంది వచ్చినప్పుడు దరఖాస్తుదారుడు అందుబాటులో లేకపోవడం ఆలస్యానికి కారణంగా మారుతోంది. కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి కోర్టు అనుమతులు రావడంలో ఆలస్యం అవుతోంది. పాస్‌పోర్టు సేవా కేంద్రాలకు అనేక మంది అవసరం లేకపోయినా తత్కాల్ స్కీమ్ కోసం వెళ్తున్నారు. అలాంటి వారి దరఖాస్తుల్ని సాధారణ పాస్‌పోర్టులుగా మార్చి ఆ స్లాట్లు అత్యవసరమైన వారికి కేటాయిస్తున్నాం.

దళారుల్ని ఆశ్రయించవద్దు..

పాస్‌పోర్టు కోసం ఎవరూ దళారుల్ని ఆశ్రయించవద్దు. వెబ్‌సైట్ ద్వారా నేరుగా స్లాట్ బుక్ చేసుకోండి. ప్రస్తుతం రాష్ట్రంలోని ఐదు పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీఎస్కే) మూడు హైదరాబాద్‌లో మరో రెండు నిజామాబాద్, కరీంనగర్‌ల్లో ఉన్నాయి. వీటితో పాటు మరో 14 చోట్ల పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీఓపీఎస్కే) పని చేస్తున్నాయి. వీటి ద్వారా ప్రతిరోజూ దాదాపు 4 వేల అప్లికేషన్లు ప్రాసెస్ చేస్తున్నాం. అర్హులైన 2,800 నుంచి 3,000 మందికి పాస్‌పోర్టులు జారీ చేస్తున్నాం. ఏ ప్రాంతంలో డిమాండ్ ఎక్కువగా ఉంటే అక్కడకు ఎక్కువ స్లాట్స్ రిలీజ్ చేస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎవరైనా ఆధారాలతో సహా సంప్రదిస్తే వారికి ప్రత్యేక తత్కాల్ స్లాట్లు కేటాయిస్తున్నాం. దరఖాస్తుదారుడు, దరఖాస్తుల్లో జరుగుతున్న పొరపాట్ల వల్లే మిగిలినవి జారీ కావట్లేదు. వీరిలో అనేక మందికి గుర్తింపు పత్రాలు పక్కాగా ఉండట్లేదు. మరోపక్క పీఎస్కే, పీఓపీఎస్కేల్లో దరఖాస్తు నింపేప్పుడు పక్కాగా చూసుకోవట్లేదు.

రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సంప్రదించాలంటే:

ఫోన్: 040-27806657
టోల్ ఫ్రీ: 1800-258-1800
https://www.facebook.com/MEAINDIA
ట్విట్టర్: @rpohyderabad
ఈ-మెయిల్: rpo.hyderabad@mea.gov.in

ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తూ..

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలని, ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని కోరుతూ సోమవారం ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గిరియాదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనం రూ.35 వేలతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ ఉపాధ్యాయులు విష్ణు, సుమన్, రాజు, నాగరాజు, రమేష్, కృష్ణవర్ధన్, మధు, పావని, వజ్రతో పాటు అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

'మీడియా మేనేజ్‌మెంట్'పై శిక్షణ



శిక్షణలో జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు

బంజారాహిల్స్: శ్రీలంక జర్నలిస్టులు, మీడియా ప్రతినిధుల కోసం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో 'మీడియా మేనేజ్‌మెంట్'పై రెండు వారాల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ సహకారాన్ని అందించింది. భారత టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో–ఆపరేషన్(ఐటీఈసీ)లో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ మాట్లాడారు. సమాజాభివృద్ధిలో మీడియా నిపుణులు కీలకపాత్ర పోషిస్తారని, ప్రజల గొంతుకగా పనిచేస్తారని, పాలనలో పారదర్శకతను ప్రోత్సహిస్తారని అన్నారు. మీడియా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో జర్నలిస్టులు, మీడియా నిపుణుల పాత్ర గతంలో కంటే చాలా కీలకంగా మారిందన్నారు. ఈ తరుణంలో మీడియా ప్రతినిధులు అత్యాధునిక నైపుణ్యాలు, పరిజ్ఞానంతో సన్నద్ధమవడం అత్యవసరమన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సీఎల్పీ అండ్ సీఐఎస్ విభాగాల అధినేత్రి డాక్టర్ మాధవి రావులపాటి, సీనియర్ అకడమిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో అధికారులు, నిథమ్ ఫ్యాకల్టీ

- 'నిథమ్' చరిత్రలో మొదటిసారిగా..
- 26 మందికి వంటకాల తయారీపై..
- పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్ల ప్రదానం

రాయదుర్గం: సమాజంలోని ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు చేయూత అందించేందుకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పైలట్ బ్యాచ్‌లో 26 మంది ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు వంటకాల తయారీపై ప్రత్యేక రెసిడెన్షియల్ శిక్షణ అందించింది. 12 మంది ట్రాన్స్‌జెండర్లు, 14 మంది దివ్యాంగులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. నిథమ్ ప్రాంగణంలో జూన్ 10న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. 15 రోజుల రెసిడెన్షియల్ శిక్షణలో పలు ప్రత్యేక వంటకాల తయారీపై థియరీ క్లాసులు తీసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో నల్గొండ జిల్లా సంక్షేమ డైరెక్టర్ వేణుగోపాలరావు, సమన్వయకర్తలు నాగిరెడ్డి, సతీష్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు గౌరవంగా బతికేలా వారికి ప్రోత్సాహం, భరోసా కల్పించాలనే తపనతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

భూదాన్ భూములపై విచారణ జరిపించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా



శంకర్ నాయక్‌ను అభినందిస్తున్న సయ్యిద్ అజీజ్‌పాషా

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో రూ.వందల కోట్ల విలువైన భూదాన్ భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. పేదలకు చెందాల్సిన భూదాన్ భూములను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ సర్వోదయ మండలి 3వ రాష్ట్ర మహాసభ సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సయ్యిద్ అజీజ్ పాషా, అఖిల భారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్, దక్షిణ భారత సమన్వయకర్త మోటూరి కృష్ణప్రసాద్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. భూదాన్ భూములు గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వేలాది ఎకరాలు కబ్జాకు గురయ్యాయని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకంగా భూదాన్ భూములను ప్రైవేట్ పరిశ్రమలకు కేటాయించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును పునరుద్ధరించి, కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని, పేదలకు పంపిణీ చేయాలన్నారు. తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్.శంకర్ నాయక్‌ను అభినందించారు. సర్వోదయ మండలి రాష్ట్ర నేతలు గిరి ప్రసాద్, మునీరుద్దీన్, షేక్ మహమూద్, యాదమ్మ, ఫైమీద పాల్గొన్నారు.

యూకే జ్యోతిష శాస్త్ర సదస్సుకు డా.వేణుగోపాలరావుకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: ఆస్ట్రోలాజికల్ అసోసియేషన్(యూకే) ఆధ్వర్యంలో యూకేలోని బర్మింగ్‌హామ్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక 56వ వార్షిక జ్యోతిష్య శాస్త్ర సంఘం సదస్సులో భారతీయ జ్యోతిషంపై ఉపన్యాసం ఇవ్వడానికి ప్రముఖ జ్యోతిష, వాస్తు పండితులు డా.వేణుగోపాలరావు వీరమేనేనికి ఆహ్వానం అందింది. ఈ సదస్సు ఆగస్టులో జరగనుంది. ప్రపంచంలోని 120 పైగా దేశాల నుంచి 300 మంది ప్రముఖ జ్యోతిషులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం
25, జూన్, 2024

'ఇన్నోవేషన్ ఫర్ ఇండియా అవార్డ్స్'కి దరఖాస్తులు..

డిస్రప్టివ్ ఇన్నోవేటర్స్ డ్రైవింగ్ ఛేంజ్ లీగ్ అవార్డులు..

దేశవ్యాప్తంగా వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఇన్నోవేషన్ ఫర్ ఇండియా అవార్డ్స్' అందించనున్నారు. డిస్రప్టివ్ ఇన్నోవేటర్స్ డ్రైవింగ్ ఛేంజ్ లీగ్‌లో భాగంగా సామాజిక, పర్యావరణ, ఆర్థిక రంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు జాతీయ అవార్డులను అందించనున్నామని మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు హర్ష్ మారివాలా తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పదో ఎడిషన్‌లో భాగంగా దేశంలోని వినూత్న అంకుర సంస్థలు, వ్యాపార సంస్థలుతో పాటు లాభాపేక్షలేని మరో విభాగంలో ప్రభుత్వ సంస్థలు, దాతృత్వ సంస్థలు, ఛారిటబుల్ ట్రస్ట్‌లు, కమ్యూనిటీ ఫౌండేషన్‌లు, ఎన్‌జీఓలు, కార్పొరేట్ ఫండ్‌లు వంటి సంస్థలకు ఈ అవార్డులను అందించనున్నామని పేర్కొన్నారు. ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి జులై 17 చివరి తేదీ అని, ఔత్సాహిక ఆవిష్కర్తలు ఎంట్రీలను అధికారిక వెబ్‌సైట్ https:// form. jotform.com/ MIFAwards/ mif& innovation& for& india& awards& app ద్వారా సమర్పించాలని సూచించారు.

సింక్రోనీకి 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' పురస్కారం...

సానుకూల, ఉద్యోగ–కేంద్రీకృత సంస్కృతిని పెంపొందించడం ద్వారా మాదాపూర్‌లోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ దేశంలో పనిచేసేందుకు ఎంచుకోదగ్గ అత్యుత్తమ కంపెనీల్లో ఒకటిగా గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇన్ ఇండియా పురస్కారం దక్కించుకుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఏడేళ్లుగా ఈ పురస్కారాన్ని అందుకుంటున్నామని, ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించడం ద్వారా తమ ఉద్యోగులు పూర్తి సామర్థ్యాన్ని వెచ్చించేలా ప్రోత్సహిస్తుండడమే ఈ ఘనతకు కారణమని వివరించారు.

27న ఇన్‌ఫ్యూజన్.. షో



నగరానికి చెందిన ఇన్‌ఫ్యూజన్ రాక్ బ్యాండ్ ప్రదర్శన గురువారం నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం.36లోని గ్రీస్ మంకీ రెస్టారెంట్ ఆవరణలో ఈ కార్యక్రమం ఉంటుంది. విభిన్న సినీ, ప్రైవేట్ గీతాలతో పాటు సొంతంగా సమకూర్చిన ఆల్బమ్స్ ద్వారా కూడా పాప్యులరైన ఈ బ్యాండ్‌కు నగరంలో తగినంత పాపులారిటీ ఉంది. రెస్టారెంట్‌లో ఈ బ్యాండ్ ప్రదర్శన రాత్రి 8గంటల నుంచి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బెస్ట్ ఫ్యాషన్ షో నిర్వాహకునిగా జోసెఫ్ సుందర్...

'మోడల్స్‌ను తీర్చిదిద్దడంతో పాటు ర్యాంప్‌పై వారి అందాన్ని మెరిపించే విధంగా నడిపించడంలో కొరియోగ్రాఫర్ పాత్ర అత్యంత కీలకం' అని చెప్పారు జోసెఫ్ సుందర్. నగరంలో జరిగే ఫ్యాషన్ కొరియోగ్రాఫర్/ఫ్యాషన్ షో నిర్వాహకులు జోసెఫ్ సుందర్ తాజాగా తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ (టీసీఇఐ)ఆధ్వర్యంలో బెస్ట్ కొరియోగ్రాఫర్/షో ఆర్గనైజర్‌గా అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వరుసగా ఐదోసారి ఈ అవార్డ్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. దాదాపు మూడు దశాబ్దాల నుంచి ఫ్యాషన్ రంగంతో మమేకమై సాగుతున్న తన ప్రయాణంలో 2వేలకు పైగా ఫ్యాషన్ ప్రదర్శనలు నిర్వహించానని, మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడంతో పాటు అనేక ఫ్యాషన్ ఈవెంట్స్‌లో జడ్జిగా వ్యవహరించానన్నారు. నగరంలో మోడలింగ్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని, అయితే యువత ఆషామాషీగా కాకుండా దీన్నొక ప్రొఫెషన్‌గా స్వీకరించాలని సూచించారు.



ముక్కవోని దీక్షతో..







ఇప్పటి వరకూ పెన్సిల్ పెయింటింగ్, హ్యాండ్ పెయింటింగ్, నెయిల్ ఆర్ట్, బ్రష్ ఆర్ట్, నైఫ్ ఆర్ట్, ఆఖరికి కాళ్లతోనూ బొమ్మలు వేసేవాళ్లను.. ఇలా.. అనేక రకాల పెయింటింగ్స్ వినుంటాం... కానీ అతను ముక్కునే కుంచెగా ఎంచుకున్నాడు.. ముక్కుతో ఆర్ట్ ఎలా వేస్తారండీ బాబూ అనొచ్చు... అదే ఇందులో ఉన్న గొప్పతనం.. పూర్తిగా చూస్తూ వేస్తేనే చాలా కష్టమనిపించే ఆర్ట్‌ని ముక్కుతో వేయడమంటే.. ఎంతో టాలెంట్, కృషి, పట్టుదల ఉండాలి.. ఎందరో ప్రముఖుల చిత్రాలను సైతం తన ముక్కుతో గీసి వారికి అభిమానాన్ని చూరగొన్నాడు. అతడే నిజాంపేటకు చెందిన సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ సత్యవోలు రాంబాబు. తన చిత్రకళా ప్రస్థానంలో ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.. ఆయన గురించి మరిన్ని వివరాలు మీ కోసం... – సనత్‌నగర్

డాక్టరో..యాక్టరో..సాఫ్ట్‌వేరో..ఇలా తాము ఎంచుకున్న రంగాన్ని ఏలేసేయాలన్న కసితో నగరానికి వచ్చేవారెందరో..వారందరి లాగే ఓ యువకుడు చిత్ర కళను తన ఊపిరిగా చేసుకుని, భుజాన ఓ సంచి..అందులో కొన్ని ఖాళీ పేపర్లు.. నాలుగైదు పెన్సిళ్లు.. చాలన్నట్లు హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. చిత్రకళ కడుపు నింపుతుందా 'భాయ్'.. ఏదైనా ఉద్యోగం చేసుకోవచ్చు కదా.. అన్నవాళ్ల నోరెళ్లబెట్టేలా చేశాడు.. ఎంచుకున్న కళే జీవితంగా బతికాడు.. రాణించాడు.. మరెందరికో ఆదర్శంగా నిలిచాడు.. అయితే అందరిలా గుర్తింపు తెచ్చుకుంటే మజా ఏంటి అనుకున్నాడో ఏమో.. కొనదేలిన నాసికాన్నే తన కుంచెగా ఎంచుకున్నాడు. క్షణాల్లో ఔరా.. అనే చిత్రాలను సాక్షాత్కరింపజేస్తున్నాడు.



ముక్కుతో ఏడేళ్ల సాధన

తన కెరీర్‌లో మామూలు చిత్రకారుడిగా మిగిలిపోకూడదని తన మస్తిష్కంలో మెదిలిన ఆలోచనే నాసికా చిత్రకారుడిగా మలిచింది. ఏడేళ్ల పాటు సాధన చేసి ముక్కును కుంచెగా చేసుకుని వందలాది బొమ్మలను గీసి ఎందరో మన్ననలను పొందారు. ముక్కుతో బొమ్మలు గీసే అరుదైన చిత్రకారుడంటూ అతని ప్రతిభను గుర్తించిన బీబీసీ వార్తా సంస్థ సైతం ప్రశంసించింది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రజల సమక్షంలో నాసికా చిత్రాలు గీశారు. ప్రముఖ కార్టూనిస్ట్ జయదేవ్ సమక్షంలో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం బొమ్మను చిత్రించి శభాష్ అనిపించుకున్నారు. అబ్దుల్‌కలాం సైతం అబ్బురపడి ప్రశంసిస్తూ రాంబాబుకు లేఖ రాశారు.

ముక్కే.. కుంచై..

కొనతేలిన ముక్కునే కుంచెగా.. అబ్బురపరుస్తున్న చిత్రకారుడు

ఆకర్షించే వందలాది నాసిక చిత్రాలు..

సత్యవోలు రాంబాబు అసాధారణ ప్రతిభ..

అబ్దుల్‌కలాం ప్రశంసలు.. మరెన్నో అవార్డులు, బిరుదులు..

లైవ్‌లోనూ మేటిగా..

ఒకవైపు నృత్య విన్యాసాలు.. వాటిని అనుకరిస్తూ మరోవైపు ముక్కుతో చిత్రాలు గీయడమంటే ఆషామాషీ కాదు. సంగీత, నృత్య, చిత్ర సంగమంగా గతంలో డిజైర్స్ పేరిట రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాంబాబు అసాధారణ ప్రతిభను కనబరిచారు. వేదికపై నృత్యకారిణులు లయబద్ధంగా నృత్యాలు చేస్తుంటే రాంబాబు నాట్యభంగిమలు, హావభావాలను, ముఖ కవళికలను చకచకా చిత్రించి ఔరా అనిపించారు. రెండు నిమిషాలకో చిత్రం చొప్పున కేవలం పది నిమిషాల్లో ఐదు నృత్య భంగిమలకు ప్రాణం పోసి చూపరులను ఆకట్టుకున్నారు.



ఎన్నో అవార్డులు.. ప్రశంసలు..

- ఏషియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ నాసికా చిత్రలేఖనం, సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్.
- మానవతా స్వచ్ఛంద సంస్థ అమలాపురం వారిచే చిత్రకళా రత్న అవార్డు.
- లంక ఆర్ట్స్‌థియేటర్ వారిచే నాసిక చిత్రకళా రత్న.
- యువ కళావాహిని వారిచే స్వామి వివేకానంద అఛీవ్‌మెంట్ అవార్డు.
- లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ వారిచే బెస్ట్ టీచర్ అవార్డు.
- ఇన్నర్ వీల్ క్లబ్ వారిచే బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డు.
- సిరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ వారిచే గురుబ్రహ్మ అవార్డు.
- లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి బెస్ట్ సర్వీసు అవార్డు.
- సేవ్ ఏ లైఫ్ ఫౌండేషన్ నుంచి బెస్ట్ హ్యూమానిటీ అవార్డు.
- ఏపీ స్టేట్ కల్చరల్ సొసైటీ నుంచి స్టేట్ బెస్ట్ సిటిజన్ అవార్డు.
- కాళీపట్నం ఆర్ట్స్ అకాడమీ నుంచి కళాప్రతిభ అవార్డు.
- సుధా ఆర్ట్స్ అకాడమీ నుంచి కళానిధి అవార్డు.
- జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నుంచి కళాభిషేకం అవార్డు.
- మెగా రికార్డ్స్ సంస్థ నుంచి కళా ప్రతిభ మూర్తి, ఏఎస్‌ఆర్ అఛీవ్‌మెంట్ అవార్డు.
- యశోద ఫౌండేషన్ నుంచి కళారత్న అవార్డు.

విశ్వగురు అవార్డ్స్‌ను స్థాపించి..

విభిన్న రంగాల్లో మేటిగా సేవలందించే వారిని గుర్తించి వారిలో నూతనోత్తేజాన్ని కలిగించాలన్న ఉద్దేశ్యంతో విశ్వగురు అవార్డ్స్‌ను నెలకొల్పి ప్రదానం చేస్తూ వస్తున్నారు. ఏటేటా ఎంపిక చేసిన వారికి ఈ అవార్డులను అందించి సన్మానించడం ఆనవాయితీ. అలాగే నిజాంపేటలో సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ద్వారా చిత్రకళ ప్రాముఖ్యతను తెలియజేస్తూ శిక్షణ అందిస్తున్నారు.

రెండు దశాబ్దాల క్రితం..

ఓ 20 ఏళ్ల క్రితం..అసలు చిత్రకళ అంటే అంతగా పట్టించుకోని రోజులు.. పశ్చిమ గోదావరి జిల్లా వేగివాడకు చెందిన సత్యవోలు రాంబాబు పాఠశాల స్థాయిలో చిత్రకళపై ఎంతో మక్కువ పెంచుకున్నాడు. తన గురువు ఇజ్రాయిల్ ప్రేరణతో పాఠశాల స్థాయిలోనే లోయర్, హయ్యర్ పూర్తి చేశారు. 20 ఏళ్ల ప్రాయంలోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు గెలుచుకుని చిత్రకళపై తనకున్న అభీష్టాన్ని చాటిచెప్పాడు. అప్పటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. చదివింది ఇంటర్మీడియెట్ అయినా కళలో తనకున్న ప్రావీణ్యాన్నే నమ్ముకుని హైదరాబాద్ వచ్చేశాడు. అడపాదడపా జరిగే పోటీల్లో పాల్గొనడం, అక్కడ ఇచ్చే పారితోషికంతో జీవితాన్ని నెట్టుకురావడం చేశాడు. ఇంటర్‌తో ఆగిపోయిన చదువును కొనగించాలని డిగ్రీలో చేరి మరోవైపు చిత్రకళను కొనసాగించారు. అలా తన ప్రస్థానం మొదలై ఎందరికో ఆ కళను పంచే స్థాయికి ఎదిగారు.

సరదా.. సరదాకే..



ఎంచుకున్న రంగంలో గుర్తింపు తెచ్చుకోవడం అంత సులువేంకాదు.. ఇది ఒకప్పటి మాట.. టెక్నాలజీ రాకతో, సామాజిక మాధ్యమాల ప్రభావంతో నేటి తరం యువత కలలు నెరవేర్చుకుంటున్నారు. సామాన్యులు సైతం సెలబ్రిటీలుగా మారిపోతున్నారు. అలా తాను అనుకున్న ప్రపంచంలోకి అడుగుపెట్టిన వ్యక్తే హర్షిత్ రెడ్డి మల్గి...సరదాగా డబ్‌స్మాష్‌లతో మొదలై ప్రభాస్ కల్కి సినిమాలో అవకాశం దక్కించుకున్నారు. చిన్నతనం నుంచి తనకు నటనపై ఉన్న సరదా.. అందులోనే నిలదొక్కుకునేందుకు చేసిన తన ప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు.. ఆ వివరాలు.. తెలుసుకుందాం..
–శ్రీనగర్‌కాలనీ

- చాయ్ బిస్కట్‌తో మొదటి అవకాశం..
- మెయిల్ సినిమా గుర్తింపు నిచ్చింది..
- కల్కి సినిమాలో ముఖ్యపాత్ర పోషిస్తున్నా..
- 'సాక్షి'తో యువ నటుడు హర్షిత్ రెడ్డి

నేను పుట్టింది పెరిగింది అంతా హైదరాబాద్‌లోనే. బిటెక్ ఇక్కడే పూర్తి చేశాను. చిన్నతనం నుండే స్కూల్‌లో కల్చరల్ ఈవెంట్స్‌లో ఉత్సాహంగా సింగింగ్, యాక్టింగ్‌లలో సరదాగా పాల్గొనేవాడిని. 2018లో డబ్‌స్మాష్‌లను నేను సరదాగా చేసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాను. దీంతో ఫాలోవర్స్ పెరుగుతూ వచ్చారు. అలా ప్రముఖ యూట్యూబ్ ఛానల్ చాయ్‌బిస్కట్‌లో యాక్టర్‌గా కొన్ని స్కెచ్ వీడియోస్ చేశాను. అలా మొదలైన నా ప్రస్థానం.. నేడు ప్రపంచస్థాయి చిత్రంగా నిలుస్తున్న ప్రభాస్ కల్కి–2898 చిత్రంలో ముఖ్యపాత్రను పోషిస్తున్నా అని తెలిపారు హర్షిత్‌రెడ్డి మల్గి.

లాక్‌డౌన్‌లో యాక్టింగ్‌పై మరింత ఆసక్తి...

లాక్‌డౌన్‌లో వందలాది సినిమాలు చూశాను. అలా నటనపై మరింత ఆసక్తితో పాటు పలు మెళకువలు నేర్చుకున్నాను. అనంతరం ఆడిషన్స్ ఇవ్వడం ప్రారంభించాను. అలా ఆహాలో నటుడు ప్రియదర్శితో కలిసి 'మెయిల్' సినిమాలో మెయిన్ రోల్ చేశాను. థియేటర్‌లో కాకుండా ఆహాలో విడుదలయింది. తరగతిగదిదాటి, అర్థమైందా అరుణ్ కుమార్, లూసర్ వెబ్‌సిరీస్‌లను చేశాను. అలా నటుడిగా మంచి మార్కులు సాధించి పలు అవార్డులను అందుకున్నాను. మెయిల్ చిత్రంలో నటనకు చాలా మంది మెచ్చుకున్నారు.

కల్కిలో అవకాశం...

సినిమాల్లో అవకాశాలు వచ్చాయి కానీ మంచి క్యారెక్టర్స్ రాలేదు. ఓ డిఫరెంట్ రోల్‌లో చేయాలనుకునే సమయంలో మెయిల్ చిత్రం ప్రొడ్యూసర్ స్వప్నదత్ ప్రభాస్‌తో కల్కి 2898 చిత్రాన్ని చేస్తున్నారు. ఓ మంచి రోల్ ఉంది చేస్తావా అని చిత్ర టీం అడగటంతో ఖచ్చితంగా చేస్తానని చెప్పాను. దర్శకుడు నాగ్‌అశ్విన్ మెయిల్ చిత్రం చూసి ఎటువంటి ఆడిషన్స్ లేకుండా సెలెక్ట్ చేశారు. హీరో ప్రభాస్‌తో కలిసి ఓ డిఫరెంట్ రోల్‌లో నటించడం చాలా సంతోషంగా ఉంది. థియేటర్‌లో రిలీజ్ అయ్యే నా మొదటి సినిమా పాన్ వరల్డ్ సినిమా అవ్వడం మరింత గర్వంగా ఉంది. చిత్రంలో నా క్యారెక్టర్ పేరుకూడా కొత్తగా ఉంటూ చిత్రంలోని బుజ్జి క్యారెక్టర్‌తో అద్భుతం ప్రేక్షకులను అలరిస్తుంది.

హీరోగా రాణిస్తా...

ప్రేక్షకులను అలరిస్తూ డిఫరెంట్ క్యారెక్టర్స్ చేస్తూ హీరో, నటుడిగా రాణించాలని ఉంది. తెలుగులో పుష్ప చూశాక అల్లు అర్జున్ బాగా నచ్చారు. అలాంటి క్యారెక్టర్ చేయాలని ఉంది. నా డ్రీమ్‌రోల్ సూపర్‌హీరో రోల్ చేయాలని ఉంది. ఫ్రెండ్స్‌తో సరదాగా గడపడం ఇష్టం. హైదరాబాద్‌తో నాకు విడదీయలేని బంధం. ఇక్కడే నా లైఫ్ ప్రారంభమై సెలబ్రిటీ హోదాను తీసుకొచ్చింది. ఇండియన్ వంటకాలు ఇష్టం. హెల్తీ ఫుడ్ తీసుకొని తరచూ జిమ్ చేస్తుంటా. ఖాళీ సమయాల్లో ఇంట్లో ఉండటానికే ఇష్టపడతా...



అద్దెకు మినీ థియేటర్‌లు



కుటుంబ సమేతంగా వీక్షణం

మణికొండ: ఎవరైనా సినిమాలు చూడాలంటే థియేటర్లకు వెళ్లాల్సిందే. అదే సంపన్నులైతే ఇంట్లోనే హోం థియేటర్‌లను ఏర్పాటు చేసుకుని ఇంటిల్లిపాదీ కలిసి అందులో నచ్చిన సినిమాలు చూసి ఎంజాయ్ చేస్తారు. అదే సామాన్యులు, పేదలు అయితే ఇంట్లో టీవీలో వచ్చే సినిమాలనే చూస్తారు. అలాంటి సామాన్యులకూ తమ ఇంట్లోని హోం థియేటర్‌లో కూర్చుని సినిమా చూసిన అనుభూతిని కల్పించేందుకు మినీ థియేటర్‌లు అద్దె ప్రాతిపదికన అందుబాటులోకొచ్చాయి. వాటిలో సినిమాలు చూడటమే కాదు కుటుంబ సమేతంగా బర్త్‌డేలు, ఇతర సెలబ్రేషన్స్ చేసుకోవచ్చు. సినిమా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తే అయ్యే ఖర్చుకన్నా తక్కువకే ఆ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రం నుంచి నార్సింగి రోడ్డులో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమీపంలో ఇటీవల బింగే క్యాస్టల్ హోం థియేటర్లను ప్రారంభించారు. అందులో ఇద్దరి నుంచి మొదలుకుని ఎనిమిది మంది వరకూ సినిమా చూసే వెసులుబాటును కల్పించారు.


అద్దెలు ఇలా...

బింగే క్యాస్టల్ ప్రైవేట్ హోం థియేటర్లలో కపుల్స్‌కు రూ.1449లు, ఐదుగురు కలిసి చూసే థియేటర్ రూ.1549లు, పది మంది కలిసి చూసే థియేటర్‌కు రూ.1749లు తీసుకుంటున్నారు. వాటిలో అదనపు వ్యక్తి వస్తే రూ.299 లు వసూలు చేస్తున్నారు. ఓటీటీలో అందుబాటులో ఉన్న నచ్చిన సినిమాలను ఇందులో

నగరంలో నయా ట్రెండ్

ప్రదర్శిస్తున్నారు. సినిమా చూస్తున్న సమయంలో స్నాక్స్ కావాలన్నా అందిస్తున్నారు. 3 గంటల పాటు సినిమా చూడటం, అందులో ఉండేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

సామాన్యులు సైతం హోం థియేటర్‌లో కూర్చుని, నచ్చిన సినిమా చూస్తూ చిన్న, చిన్న పార్టీలు సెలబ్రేట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. థియేటర్లలో సినిమా చూసిన అనుభూతే ఇందులో కలుగుతుంది. వీటిల్లో వారికి ప్రైవసీ ఉంటుంది. కేక్‌లు, స్నాక్స్ కావాలన్నా అందుబాటులో ఉంటాయి. ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తుంది. రానున్న రోజుల్లో మరిన్నింటిని పెంచుతాం.
– డి.శ్రావణ్ కుమార్, బింగే క్యాస్టల్ థియేటర్స్ యజమాని



మంచి ఆదరణ..

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్
- మనం చేసిన మంచి అందరికీ తెలుసు
- తప్పకుండా ప్రజలు మళ్లీ మన వైపే చూస్తారు
- నేతలు, కార్యకర్తలతో మాటామంతి.. మూడో రోజూ ప్రజలతో మమేకం


పార్టీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి కడప: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో మూడవ రోజు సోమవారం కూడా బిజీబిజీగా గడిపారు. వివిధ ప్రాంతాల నుంచి క్యాంపు కార్యాలయానికి భారీగా తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్ పులివెందులలో ఉన్నారని తెలుసుకుని రాయలసీమలోని ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. అందరితోనూ ఓపికగా మాట్లాడారు. పలువురు నేతలను పేరుపేరునా పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కార్యాలయ ఆవరణలో ఎక్కడ చూసినా జనం భారీగా కనిపించారు. 'వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. మనం చేసిన మంచి అందరికీ తెలుసు. ప్రజల గుండెల్లో ఉండిపోయింది. తప్పకుండా ప్రజలు మళ్లీ మన వైపే చూస్తారు. ఎవ్వరూ అధైర్యపడొద్దు. అండగా ఉంటాం' అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.

రెండు కుటుంబాలకు పరామర్శ

పులివెందుల నారాయణ పాఠశాల సమీపంలోని పురుషోత్తం నగర్‌లో నివాసముంటున్న దివంగత మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరెడ్డి కుమారుడు మైఖేల్ వర్ధంతి కార్యక్రమం ఇటీవల జరిగింది. అప్పట్లో రాలేక పోయిన వైఎస్ జగన్.. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి సోమవారం ఉదయం మైఖేల్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మైఖేల్ సతీమణి అమూల్యా రాణి, కుమారుడు వినీత్‌లను ఓదార్చారు. సమీప బంధువు నర్రెడ్డి సంగిరెడ్డి మృతి చెందారని తెలిసి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వారి ఇంటికి వెళ్లారు. వైఎస్ జగన్‌తో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డిలు నివాళులర్పించారు. భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి.. సంగిరెడ్డి భార్య సత్యవతి, కుమారులు సుధాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలను జగన్ దంపతులు ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు చవ్వా సుదర్శన్‌రెడ్డి, మిట్టా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మూడు రోజుల పులివెందుల పర్యటన ముగించుకుని బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

మరోసారి విషం కక్కిన ఎల్లో మీడియా

సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లో మీడియా మరోసారి అక్కసు వెళ్లగక్కింది. వైఎస్ జగన్‌పై కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారని ఒక మార్ఫింగ్ వీడియోను వదిలారు. వైఎస్ జగన్ సోమవారం పులివెందుల పర్యటన ముగించుకుని బెంగళూరుకు చేరుకున్నారు. తమ అభిమాన నాయకుడు ఇక్కడికి వచ్చారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసం వద్దకు వందలాదిగా చేరుకున్నారు. జగన్‌తో మాట్లాడాలని, ఫొటో దిగాలని పెద్ద సంఖ్యలో యువకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంటి వద్దకు 'జై జగన్, జోహార్ వైఎస్సార్' అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఇది గిట్టని ఎల్లో మీడియా కొద్ది గంటల్లోనే ఈ వీడియోలోని వాయిస్‌ను మార్చి 'జగన్ డౌన్ డౌన్..' అన్నారని నిస్సిగ్గుగా విషం కక్కింది. పులివెందులలో సైతం ఇదే రీతిలో దుష్ప్రచారం చేసి ఖంగుతింది. అయినా పద్ధతి మార్చుకోక బెంగళూరులోనూ అదే వైఖరి ప్రదర్శించి అభాసుపాలైంది.

ఐపీఎస్‌ల బదిలీ

- జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్‌గా రంగనాథ్
- టూరిజం ఎండీగా ప్రకాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీజోన్ -1 ఐజీగా ఉన్న 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇప్పటివరకు ఈ పోస్టులో పనిచేసిన 2010 బ్యాచ్ ఐపీఎస్ అధికారి న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డిని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా బదిలీ చేశారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా పనిచేస్తున్న 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రమేశ్‌నాయుడును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇద్దరు నాన్‌కేడర్ ఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు నాన్‌కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైవీఎస్ సుధీంద్రను హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న నాన్‌కేడర్ ఎస్పీ పి.సీతారాంను తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.

పాత పోస్టులో కొన్నాళ్లు దేవసేన

సాక్షి, హైదరాబాద్: దేవసేనను కొన్నాళ్లు పాఠశాల విద్య కమిషనర్ స్థానంలో కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. తాజా బదిలీల్లో భాగంగా ఆమెను కాలేజీ ఎడ్యుకేషన్, సాంకేతిక విద్య విభాగానికి బదిలీ చేశారు. అయితే టీచర్లబదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియను దేవసేన విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త వ్యక్తి వస్తే ఇబ్బంది ఉండే వీలుందని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. దీంతో బదిలీ ఉత్తర్వులు వచ్చిన తర్వాత సీఎం కార్యాలయం నుంచి ఆమెను కొన్నాళ్లు పాఠశాల విద్య కమిషనర్‌గా కొనసాగాలని సమాచారం వచ్చినట్లు తెలిసింది.

ఓటర్లకు బీజేపీ ధన్యవాదాలు

కృతజ్ఞతా సమావేశాలు నిర్వహించాలని ప్రభారీలకు పార్టీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసిన ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ 'కృతజ్ఞతా సమావేశాలు' నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 'హాల్ మీటింగ్స్'ని ర్వహించి ప్రజలకు కృతజ్ఞతలు తెలపాలని 17 పార్లమెంట్ నియోజకవర్గాల ప్రభారీలను పార్టీ ఆదేశించింది. ఒక్కో ప్రభారీ తాము ఇన్‌చార్జీగా ఉన్న ఎంపీ సెగ్మెంట్ పరిధిలో ఏడేసి సమావేశాలు నిర్వహించాలని నిర్దేశించింది. 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. సోమవారం రాత్రి ఈ మేరకు బీజేపీ కార్యాలయంలో 17 ఎంపీ నియోజకవర్గాల ఇన్‌చార్జీల (ప్రభారీలు)తో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి సమావేశమయ్యారు. 1975 జూన్ 25న దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన రోజును పురస్కరించుకుని మంగళవారం అన్నిస్థాయిల్లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం పాటించాలని సూచించారు.

అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీ

ఫిక్కీ లేడీస్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు


మహిళా పారిశ్రామిక వేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తొలిసారి నూతన పాలసీని తెస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. పాలసీ రూపకల్పనపై కసరత్తు జరుగుతోందని, విధివిధానాల తయారీకి సూచనలు ఇవ్వాలని ఎంఎస్ఎంఈలను కోరారు. ఎంఎస్ఎంఈ రంగం సమగ్రాభివృద్ధిపై కొత్త పాలసీ దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) ఆధ్వర్యంలో సోమవారం ఎంఎస్ఎంఈలు, సమగ్రాభివృద్ధి అనే అంశంపై జరిగిన సదస్సును మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్‌బీ తరహాలో రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. భవిష్యత్తులో డిజిటల్ నైపుణ్య శిక్షణ పెంపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 200 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ) ఉన్నాయని, రానున్న కాలంలో మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో వై2కే కాలం తర్వాతి పరిస్థితుల తరహాలో ఏఐ విస్తృతి ద్వారా భవిష్యత్తులో కోడింగ్ అంతర్ధానమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంఎస్ఎంఈలపై దృష్టి కేంద్రీకరిస్తూ భవిష్యత్తులో ఏఐ రంగానికి రాజధానిగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని భట్టి తెలిపారు.

గత ప్రభుత్వ పాలసీలు కొనసాగిస్తాం

పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి రంగం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ప్రభుత్వాలు మారినా విధానాలు కొనసాగుతాయని.. పారిశ్రామిక రంగం శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం అనుసరించిన మంచి విధానాలను కొనసాగిస్తామన్నారు. సాఫ్ట్‌వేర్ రంగం భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించినందునే 1992లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కుకు శంకుస్థాపన చేసిందన్నారు. పారిశ్రామికాభివృద్ధికి మహిళలు అందిస్తున్న తోడ్పాటును శ్రీధర్‌బాబు ప్రశంసించారు.

రైల్‌రోకో కేసు కొట్టేయండి

హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: 2011లో తనపై నమోదైన రైల్‌రోకో కేసును కొట్టివేయాలని, ఎలాంటి ఆధారాలు లేకున్నా తనను నిందితుల జాబితాలో చేర్చారంటూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో భాగంగా 2011లో రైల్‌రోకో కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. ఇందులో భాగంగా మౌలాలి రైల్వే స్టేషన్‌లో జరిగే రైల్‌రోకోలో పాల్గొనాలని ఉద్యమకారులను నేను, ప్రొఫెసర్ కోదండరాం పురిగొల్పినట్లు పేర్కొంటూ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. దాదాపు 40 మంది పాల్గొన్న ఈ ఆందోళనకు కల్వకుంట్ల కవిత నాయకత్వం వహించారు. వీరిని పోలీసులు అరెస్టు చేయగా, కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత పోలీసులు ట్రయల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తూ నన్ను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. స్వరాష్ట్ర పోరాటంలో నేను, కోదండరాం పిలుపునిచ్చామన్న సాక్షుల మౌఖిక వాంగ్మూలం తప్ప పోలీసుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఆ రైల్‌రోకోలో పాల్గొనలేదు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిందితుల జాబితాలో నా పేరు చేర్చారు. కనుక ఈ కేసు కొట్టివేయాలి' అని కేసీఆర్ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయసేన్‌రెడ్డి నేడు విచారణ చేపట్టనున్నారు.

మీ వెంటే నడుస్తాం..

- కేసీఆర్‌ను కలసిన బీఆర్ఎస్ నేతలు
- ఎర్రవల్లిలో సమావేశం
- ప్రజల సమస్యలపై పోరాడాలని నాయకులకు అధినేత సూచన

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు సోమవారం పార్టీ అధినేత కేసీఆర్‌తో ఎర్రవల్లిలో భేటీ అయ్యారు. పార్టీ నుంచి కొందరు ఎమ్మెల్యేలు ఫిరాయించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. మీవెంటే నడుస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ నాయకులు అధినేతకు వెల్లడించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో పార్టీ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు, ఎమ్మెల్యేలు జి. జగదీశ్‌రెడ్డి, కోవా లక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రాంరెడ్డి, భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వర్‌రావు, గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందమ్ చక్రపాణి, పార్టీ నేతలు గూడూరు ప్రవీణ్, కాలే యాదయ్య తదితరులు ఉన్నారు. పార్టీ నుంచి గెలిచిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇటీవల కాంగ్రెస్‌లో చేరడం తమకు బాధ కలిగించిందని కేసీఆర్ వద్ద పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, బీఆర్ఎస్‌కు ఒడిదుడుకులు కొత్త కాదని, ఓపికతో పని చేస్తే మళ్లీ ప్రజల్లో ఆదరణ లభిస్తుందని ఈ సందర్భంగా కేసీఆర్ వారికి భరోసా ఇచ్చారు. ఇప్పటికే విద్యుత్, తాగు నీటి సరఫరా వంటి అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేసీఆర్ వారికి వివరించారు. పార్టీలోని అన్ని స్థాయిల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ తమ పోరాటాలు కొనసాగించాలని కేసీఆర్ సూచించారు. ఇదిలా ఉండగా పార్టీ పునర్నిర్మాణానికి అవసరమైన కార్యాచరణకు త్వరలో కేసీఆర్ శ్రీకారం చుడతారని ఆయనను కలసిన నేతలు వెల్లడించారు.


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవిచంద్ర

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో కలిసి రవిచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

సంజయ్ చేరిక.. జీవన్ కినుక

▶ మొదటి పేజీ తరువాయి

విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి శ్రీనివాస్‌లు నచ్చజెప్పినా ఆయన దిగిరాలేదు. చివరికు మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని చర్చలు జరిపినా జీవన్‌రెడ్డి శాంతించినట్టుగా కన్పించలేదు. ఏ వ్యక్తి పైనైతే పోరాడానో ఆ వ్యక్తినే పార్టీలో చేర్చుకోవడం ద్వారా కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని, వారి అభిప్రాయాలను గౌరవించే బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు. తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుందంటూ సమస్య పరిష్కారం కాలేదనే సంకేతాలు ఇచ్చారు.

నన్ను సంప్రదించకుండా ఎలా?

జగిత్యాలలో తనపై పోటీ చేసి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేను తనతో కనీసం సంప్రదించకుండా పార్టీలో చేర్చుకోవడాన్ని జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కాంగ్రెస్‌కు విధేయుడిగా కొనసాగుతున్న తనను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఎలా వ్యవహరిస్తారని ఆయన నిలదీసినట్లు తెలిసింది. తన అవసరం పార్టీకి లేదని భావించే, కనీస సమాచారం ఇవ్వకుండా సంజయ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని ఆయన అన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయమే ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని భావించారు. ఉదయాన్నే జగిత్యాలలోని తన నివాసానికి చేరుకున్న అనుచరులు, పార్టీ శ్రేణులతో చర్చలు జరిపారు. 40 ఏళ్ల గౌరవప్రదంగా రాజకీయాలు చేశానని, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానంటూ తన సన్నిహితుల వద్ద జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్‌లుగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాలలో జీవన్‌రెడ్డి ఇంటికి చేరుకుని ఆయనతో చర్చలు జరిపారు. రాజీనామా వంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. కానీ జీవన్‌రెడ్డి ససేమిరా అన్నారు.

పార్టీకి అండగా నిలిచిన పెద్దమనిషి: శ్రీధర్‌బాబు

తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు రంగంలోకి దిగారు. జరిగిన వ్యవహారంపై విచారం వ్యక్తం చేస్తూ అన్ని విధాలుగా నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. అనేక క్లిష్టమైన సందర్భాల్లో పార్టీకి, ప్రజలకు అండగా నిలిచిన పెద్దమనిషి జీవన్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన మనస్తాపం చెందిన విషయం తెలుసుకుని తామంతా వచ్చి పార్టీకి పెద్దదిక్కుగా ఉండాలని కోరామని తెలిపారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టాన్ని, మనోవేదనను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని అందరికీ న్యాయం చేస్తామని ప్రకటించారు. కానీ సోమవారం రాత్రి జగిత్యాలలో విలేకరులతో మాట్లాడిన జీవన్‌రెడ్డి మాత్రం ఎమ్మెల్యే సంజయ్‌ను ఏకపక్షంగా చేర్చుకోవడం సరికాదని అన్నారు. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ బలోపేతానికి పనిచేశారని, సంఖ్యాబలం ఉన్నా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడం వల్ల కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. వారి అభిప్రాయాల మేరకు నడుచుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. తనతో చర్చించడానికి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఇతర నేతలు వచ్చారని అన్నారు.

మూడు విడతలు తలపడిన జీవన్‌రెడ్డి, సంజయ్

జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి ప్రస్థానం 1983 నుంచి మొదలైంది. అప్పటి నుంచి 2014 వరకు పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగారు. ఇక 2014 నుంచి మూడు పర్యాయాలు సంజయ్, జీవన్‌రెడ్డి రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నారు. 2014లో జీవన్‌రెడ్డి గెలిచినప్పటికీ, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సంజయ్ చేతిలో ఓడిపోయారు. 2024లో నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2018లో ఎమ్మెల్యేగా పరాజయం తర్వాత 2019లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇలావుండగా కాంగ్రెస్‌లో సంజయ్ చేరికను వ్యతిరేకిస్తూ కిసాన్ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్ పదవీకి వాకిటి సత్యంరెడ్డి రాజీనామా చేశారు.

ప్రసారాల నిలిపివేత పత్రికా స్వేచ్ఛకు ముప్పే

- సంపాదకీయ స్వేచ్ఛపై జోక్యం తగదు
- సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాల నిలిపివేతపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ డిజిటల్ అథారిటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి తదితర చానళ్ల ప్రసారాల నిలిపివేత పత్రికా స్వేచ్ఛకు ముప్పేనని న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అథారిటీ (ఎన్‌బీడీఏ) స్పష్టం చేసింది. సంపాదకీయ స్వేచ్ఛపై జోక్యం తగదని పేర్కొంది. సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ 10టీవీ ప్రసారాలను కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ నిలిపివేయడం ఆశ్చర్యానికి గురిచేసిందని వెల్లడించింది. ఎలాంటి కారణాలు లేకుండా ఆయా చానళ్ల ప్రసారాల నిలిపివేత ట్రాయ్ నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. తక్షణమే ఏపీ ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రజాస్వామ్యంలో వేర్వేరు వనరుల ద్వారా సమాచారం పొందడం ప్రజల మౌలిక హక్కు అని పేర్కొంది. మీడియా గొంతు నొక్కేలా చేసే ఏ ప్రయత్నాన్నైనా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరింది. ఈ మేరకు ఎన్‌బీడీఏ ప్రధాన కార్యదర్శి అన్నే జోసెఫ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సాక్షితోపాటు పలు చానళ్లను కేబుల్ టీవీ ఆపరేటర్స్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ విషయం ఎన్‌బీడీఏ దృష్టికి వెళ్లడంతో ఆ సంస్థ ఈ మేరకు స్పందించింది. కొందరు కేబుల్ ఆపరేటర్లు తీసుకున్న ఈ చర్య ప్రసారకర్తలు, మీడియా, ప్రజల ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేసింది. ప్రసారకర్తలకు ఏం ప్రసారం చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉందని.. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని పేర్కొంది. ఈ తరహా జోక్యం మీడియా స్వతంత్రతను కోల్పోయేలా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఏపీలో మీడియా స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది.

న్యూస్ చానళ్లపై నిషేధం ఎత్తేయాలి

- ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగు న్యూస్ చానళ్లపై మల్టిపుల్ సిస్టమ్ ఆపరేటర్లు (ఎంఎస్‌వోలు) విధించిన అప్రకటిత ఆంక్షలను అంతర్జాతీయ సంస్థలు తప్పుపడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జే) ఈ అప్రకటిత నిషేధం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిందని, ప్రసారాలు తిరిగి పునరుద్ధరించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బ్రస్సెల్ కేంద్రంగా ఉన్న ఆ సంస్థ సూచించిందని వెల్లడించారు. న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అథారిటీ (ఎన్‌బీడీఏ) కూడా ఈ అప్రకటిత నిషేధాన్ని ఖండించిందని తెలిపారు. కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చి ప్రసారాలు నిలిపివేయడం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనలకు విరుద్ధమని చెప్పిందన్నారు. రాష్ట్రంలోని పాలకులు ఈ వ్యవహారంతో తమకేమీ సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ చర్యల కారణంగా అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ఇమేజ్ దెబ్బతిందని కృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణలో కొన్ని న్యూస్ చానళ్ల ప్రసారాలను అక్కడి కేబుల్ ఆపరేటర్లు నిలిపివేయడాన్ని చంద్రబాబు తప్పుపట్టారన్నారు. ఆ తప్పు ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతుంటే ఆయన తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ), 19(1) (జి) భావ ప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తోందని చెప్పిందని గుర్తు చేశారు. ప్రజాహితానికి సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడానికి , తెలుసుకోవడానికి కూడా ఆ ఆర్టికల్ హామీ ఇస్తోందని తెలిపారు. కాబట్టి సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీలపై విధించిన అప్రకటిత నిషేధాన్ని వెంటనే తొలగించాలని కోరారు.

తలదించుకునే అంశం ఇది

ఈశ్వరమ్మను పరామర్శించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి


ఈశ్వరమ్మను కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భట్టి, చిత్రంలో మంత్రి జూపల్లి

లక్డీకాపూల్(హైదరాబాద్): మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ ఇది తలదించుకునే అంశమని.. యావత్ సమాజం దీనిని తీవ్రంగా ఖండించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చెంచుమహిళ ఈశ్వరమ్మపై జరిగిన ఘటన అమానవీయమన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను సోమవారం ఆయన మంత్రి జూపల్లితో కలిసి పరామర్శించారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. ఈశ్వరమ్మ పూర్తిగా కోలుకునే వరకు ఉచితంగా ప్రభుత్వం వైద్య సహాయం అందిస్తుందన్నారు. ఇల్లు లేని పక్షంలో ఇందిరమ్మ ఇల్లు, ఇద్దరు పిల్లలను ఆశ్రమ పాఠశాలలో వారు ఎంతవరకు చదువుకుంటాం అంటే అంతవరకు చదివిస్తామని చెప్పారు. సాగుకు వ్యవసాయ భూమి కేటాయించడం వంటి అన్ని చర్యలు ప్రభుత్వపరంగా చేపడతామన్నారు. నిందితులను ఇప్పటికే రిమాండ్‌కు తరలించారని, ఈ ఘటనలో పూర్తి సమాచారం సేకరించి బాధ్యులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. మెరుగైన చికిత్స అందించాలని, పూర్తిగా కోలుకున్న తర్వాతే డిశ్చార్జ్ చేయాలని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్పకు చెప్పారు. ఈశ్వరమ్మను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి కూడా పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కూతురి ప్రేమకు అడ్డొస్తున్నాడని..

- భర్తను హత్య చేయించిన భార్య
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- మేకల కాపరి హత్య కేసును ఛేదించిన పోలీసులు

జడ్చర్ల: ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయమైన యువకుడితో కూతురు ఫోన్లో మాట్లాడుతుండటాన్ని తప్పుబట్టడంతోపాటు వారి పెళ్లికి నిరాకరించాడన్న కోపంతో భర్తను భార్య హత్య చేయించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జడ్చర్ల కావేరమ్మపేట శివారులోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మెక్కం చిన్న ఆంజనేయులు (44) మేకల కాపరి. ఆయన కుమార్తె అంజలికి హైదరాబాద్‌కు చెందిన పాండు ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయమయ్యాడు. అతనితో అంజలి తరచూ ఫోన్లో మాట్లాడుతుండటాన్ని చూసి తండ్రి మందలించేవాడు. అయినా ఆమె ఖాతరు చేయకుండా పాండుతో ఫోన్లో మాట్లాడేది. ఈ క్రమంలో ఓరోజు కూతురిని తండ్రి తీవ్రంగా మందలించాడు. అడ్డుకోబోయిన భర్త భాగ్యలక్ష్మిని సైతం కొట్టాడు. ఆ తర్వాత కూతురి వద్ద తండ్రి చెడుగా ప్రవర్తించడంతోపాటు పాండుతో కూతురి పెళ్లికి నిరాకరించాడు. దీంతో భర్తను ఎలాగైనా అంతమొందించాలని భాగ్యలక్ష్మి పథకం రచించింది.

సుపారీగా మూడు మేకలు ఇస్తానని..

తన భర్తను హత్య చేయాలని.. మూడు మేకలను సుపారీగా ఇస్తానని తమ కాలనీలోనే ఉంటున్న కాళ్ల మైసమ్మను కోరింది. దీంతో మైసమ్మ పథకం ప్రకారం భాగ్యలక్ష్మి గత శుక్రవారం తన భర్తను మేకల షెడ్డు వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించి మైసమ్మకు అప్పగించింది. మైసమ్మ తన అనుచరులైన ముత్యాలమ్మ, నర్సింహులు సాయంతో ఆంజనేయులు గొంతు కోసి హతమార్చాడు. అనంతరం నిందితులంతా పరారయ్యారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. సోమవారం భాగ్యలక్ష్మి, కాళ్ల మైసమ్మ, నర్సింహ, మాల ముత్యాలమ్మలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి న్యాయస్థానం ఆదేశంతో రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మోటారు సైకిల్, కత్తి, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మందకృష్ణ తీరు బాధాకరం

- రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య
- దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టిన వ్యక్తి మందకృష్ణ అని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య విమర్శించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, దివ్యాంగ సోదరి రజనికి సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఉద్యోగాన్ని ఇస్తే మందకృష్ణ కించపర్చేలా మాట్లాడటం అత్యంత బాధాకరమన్నారు. తన స్వార్థ రాజకీయాలు, ఆర్థిక ప్రయోజనాల కోసం మందకృష్ణ దివ్యాంగులను వాడుకుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మందకృష్ణ పొగుడుతున్న తీరు చూస్తుంటే అది ముమ్మాటికీ దివ్యాంగులను అవమానించడమే అని అన్నారు. మందకృష్ణ రాష్ట్రంలోని దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2017 మానసిక వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం జిల్లాకో వికలాంగుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కానీ బీజేపీ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉన్న ఆరాంఘర్ మానసిక వికలాంగుల కేంద్రాన్ని ఎత్తేసే ప్రయత్నం చేసిందన్నారు. దివ్యాంగులకు బీజేపీ ప్రభుత్వం ఎన్నో విధాలుగా అన్యాయం చేసిందని, అలాంటి బీజేపీకి మందకృష్ణ ఏజెంట్ మాదిరిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జనరల్ సెక్రెటరీ వి.నరసింహాచారి, దేశగాని సతీశ్‌గౌడ్, మధ్యపాక సురేశ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే పెనాల్టీ!

తెలంగాణలో ఉంటున్న ఇతర రాష్ట్ర వాహనాలపై రవాణా శాఖ కన్ను
జీవిత పన్ను చెల్లించకుండా అనేక వాహనాలు తిరుగుతున్నట్టు గుర్తింపు
పన్ను వసూలు చేయడంతో పాటు పెనాల్టీ కొరడా ఝుళిపించేందుకు సిద్ధం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలపై కొరడా ఝుళిపించేందుకు, పన్ను చెల్లించకుంటే అదనంగా పెనాల్టీ విధించేందుకు రవాణా శాఖ సిద్ధమవుతోంది. కొంతకాలంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు రాష్ట్రంలో భారీ సంఖ్యలో కనిపిస్తున్నాయి. వీటిల్లో నిబంధనల ప్రకారం జీవితకాల పన్ను చెల్లించి తిరుగుతున్నవి కొన్నయితే, ఎక్కువ శాతం పన్ను చెల్లించకుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. పన్ను చెల్లించనవి ఏవో గుర్తించటం అంత సులభం కాకపోవటాన్ని ఆసరా చేసుకుని, ఆయా వాహనాల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వాహనాలపై అధికారులు దృష్టి సారించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

పట్టుకుంటే ఒక శాతం పెనాల్టీ

పన్ను చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలు దొరికితే వాటి యజమానులకు వాహన ఖరీదులో ఒక శాతాన్ని పెనాల్టీగా విధించనున్నారు. అంటే లెక్క ప్రకారం లైఫ్ ట్యాక్స్ చెల్లించటంతోపాటు ఈ పెనాల్టీ కూడా కట్టాల్సి ఉంటుంది. ఆయా వాహనదారులు వెంటనే పన్ను చెల్లించి చట్టప్రకారం చర్యలకు గురికాకుండా చూసుకోవాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ కోరారు.

30 రోజుల వరకే అనుమతి

ఉద్యోగాల బదిలీ, ఇతర కారణాలతో రాష్ట్రంలోకి వచ్చే ఇతర రాష్ట్రాల వారు వారి వాహనాలు వెంట తెచ్చుకోవటం సహజమే. ఆ వాహనాలు వారు అప్పటివరకు ఉన్న రాష్ట్రం పరిధిలో రిజిస్టర్ అయి ఉంటాయి. ఆ వాహనాలు తెలంగాణ మీదుగా ఏ ప్రాంతానికైనా వెళ్లడానికి అనుమతి ఉంటుంది. కానీ రాష్ట్రం పరిధిలోనే ఉండిపోయేందుకు మాత్రం నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. 30 రోజుల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా రాష్ట్రం పరిధిలో ఉండొచ్చు. అంతకుమించి ఉండాల్సి వస్తే మాత్రం, ఆ వాహనాలకు సంబంధించిన జీవిత పన్నును మన రాష్ట్రంలో చెల్లించాల్సి ఉంటుంది. ఆ వాహనం మిగిలిన జీవిత కాలాన్ని లెక్కించి లైఫ్ ట్యాక్స్ ఇక్కడ చెల్లించాల్సి ఉంటుంది. రూ.10 లక్షల కంటే ఎక్కువ ధర గల వాహనాలకు 18 శాతం, రూ.5 లక్షలు– రూ.10 లక్షల మధ్య ధర గల వాటికి 14 శాతం, రూ.5 లక్షల లోపు ధర ఉన్న వాటికి 13 శాతం లైఫ్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే అప్పటికే ఆయా రాష్ట్రాల పరిధిలో పన్ను చెల్లించి ఉంటే, వాహనాన్ని తెలంగాణకు బదిలీ చేసుకునేలా ఎన్‌ఓసీ తీసుకున్నప్పుడు.. చెల్లించిన పన్ను మొత్తాన్ని మిగిలిన కాలానికి లెక్కించి తిరిగి ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసుకోవచ్చు. అలా మిగిలిన జీవిత కాలానికి సంబంధించిన పన్ను మొత్తాన్ని తెలంగాణలో చెల్లించాలన్న మాట. అప్పుడు ఆ వాహనానికి తెలంగాణ రిజిస్ట్రేషన్ సిరీస్‌లోని నంబర్ అలాట్ అవుతుంది.

ఒక్క హైదరాబాద్‌లోనే 2 వేలకు పైగా..

ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 వేలకు పైగా ఇతర రాష్ట్రాల వాహనాలు తిరుగుతున్నాయి. వీటిల్లో స్థానికంగా పన్ను చెల్లించినవి కొన్నే ఉన్నాయి. హైదరాబాద్ వెలుపల మరో వెయ్యి వరకు వాహనాలు ఉంటాయని అంచనా. అయితే ఈ వాహనాలు 30 రోజుల వరకు పన్ను చెల్లింపుతో సంబంధం లేకుండా స్థానికంగా తిరిగేందుకు అవకాశం ఉండగా అవి తెలంగాణలోకి ప్రవేశించి ఎన్ని రోజులు అయ్యాయనే విషయాన్ని గుర్తించే అవకాశం లేకుండా పోయింది. ఎప్పుడు రవాణా శాఖ అధికారులు పట్టుకున్నా 4–5 రోజుల క్రితమే తెలంగాణకు వచ్చినట్టు వాహనదారులు చెబుతున్నారు. స్థానికంగా ఫిట్‌నెస్ పరీక్షల రశీదులు, రాష్ట్ర సరిహద్దు దాటినప్పుడు పొందిన రశీదులు ఉండి వాటిని పరిశీలిస్తే అవి ఎంతకాలంగా రాష్ట్రంలో ఉన్నాయో తెలుసుకునేందుకు కొంత అవకాశం ఉంటుంది. దీంతో అలాంటి తనిఖీలకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పంచెకట్టులో కిషన్‌రెడ్డి ప్రమాణం

- తెలుగులో ప్రమాణం చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్
- మూడు భాషల్లో ప్రమాణం చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు
- హిందీలో తనూజరాణి, తెలుగులో గురుమూర్తి, ఇంగ్లిష్‌లో మిథున్‌రెడ్డి
- నేడు ప్రమాణం చేయనున్న తెలంగాణ ఎంపీలు



సాక్షి, న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ సోమవారం కొలువుదీరింది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పంచెకట్టులో సభకు హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలుగులో ప్రమాణం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రిమండలిలో ఉన్న బండి సంజయ్ కుమార్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మలు కూడా తెలుగులోనే ఎంపీలుగా ప్రమాణం చేశారు. కేంద్ర మంత్రుల ప్రమాణం పూర్తయిన తర్వాత ఎంపీల ప్రమాణం రాష్ట్రాల వారీ అక్షర క్రమంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 24 మంది ఎంపీలు తొలిరోజు ప్రమాణం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురు ఎంపీలు మూడు భాషల్లో ప్రమాణం చేశారు. అరకు ఎంపీ గుమ్మ తనూజ రాణి పార్టీ కండువా మెడలో వేసుకొని హిందీలో ప్రమాణం చేయగా తిరుపతి ఎంపీ మద్దిళ్ల గురుమూర్తి తెలుగులో, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సభకు హాజరుకాకపోవడంతో ప్రమాణ స్వీకారం చేయలేదు. మిగతా ఏపీ ఎంపీలు తెలుగు, ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పంచెకట్టులో సభకు హాజరై తెలుగులో ప్రమాణం చేశారు. ఆయనతోపాటు భరత్, దగ్గుబాటి పురందేశ్వరి, బాలశౌరి, కేశినేని శివనాథ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, బైరెడ్డి శబరి, నాగరాజు, లక్ష్మీనారాయణ, పార్థసారథి, ప్రసాదరావులు తెలుగులో ప్రమాణం చేశారు. సీఎం రమేశ్, ఉదయ్ శ్రీనివాస్, జీఎం హరీష్, పుట్టా మహేశ్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ సంస్కృతంలో ప్రమాణం చేశారు. అయితే తెలంగాణకు చెందిన 17 మంది లోక్‌సభ సభ్యుల్లో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సోమవారం ప్రమాణం చేయగా, మిగిలిన 15 మంది మంగళవారం ప్రమాణం చేయనున్నారు.

టీడీపీ నేత బొల్లినేని కృష్ణయ్యకు చుక్కెదురు

రెండో భార్య కేసుపై విచారణ జరపాలన్న తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. రెండో భార్య కృష్ణవేణి ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ పోలీసులను ఆదేశించింది. 'బొల్లినేని కృష్ణయ్య, అతని తరఫు బంధువులు డాక్టర్ హేమమాలిని, డాక్టర్ వంకాయలపాటి శ్రీప్రసాద్. అమాయకులమని పేర్కొనడం, తప్పుడు కేసులో ఇరికించానని పిటిషన్‌లో పేర్కొనడం అసత్యం. నా పెద్ద కూతురిని దత్తత తీసుకున్నట్లు చెబుతున్న హేమమాలిని సంబంధిత డాక్యుమెంట్‌ను మాత్రం కోర్టుకు సమర్పించలేదు. నా అనుమతి లేకుండా దత్తత తీసుకోవడం ఎలా సాధ్యం. 18 ఏళ్ల తర్వాత నేను పిల్లల కోసం వివాదం తెచ్చానని చెప్పడంలోనూ వాస్తవం లేదు. నా భర్త ఓ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే. నా నుంచి తీసుకెళ్లిన పిల్లల (కొడుకు, పెద్ద కూతురు)ను వెనక్కు తీసుకురావాలని ఆయన్ను ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నా. చిన్న కూతురు మాత్రమే నా వద్ద ఉంది. హేమ, శ్రీప్రసాద్‌లతో కుమ్మక్కై చదువు చెప్పిస్తానని చెప్పి నా భర్త పిల్లలను తీసుకెళ్లారు. నా కొడుకు తన మొదటి భార్యకు పుట్టినట్లు, నా కూతురు.. హేమకు పుట్టినట్లు రికార్డు సృష్టించారు. అవన్నీ కల్పితం. పిల్లలు కావాలన్న నన్ను తీవ్రంగా బెదిరించారు' అని పేర్కొంటూ కృష్ణవేణి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కృష్ణయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్



కాచిగూడ (హైదరాబాద్): వచ్చే కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశం జరి గింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులో బీసీలను విస్మరిస్తే దేశవ్యాప్తంగా బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.45.90 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు.

హైదరాబాద్-విజయవాడ ఆరు లేన్ల రహదారిని

త్వరగా పూర్తి చేయండి

కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి

- ట్రిపుల్ ఆర్‌పై త్వరలో సమీక్షించనున్న కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ
- ఉప్పల్–ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ నిర్మిస్తున్న కంపెనీ టర్మినేట్‌కు ఆదేశాలు
- త్వరలో ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి కొత్త టెండర్లు


ఢిల్లీలో బండి సంజయ్‌ని కలిసిన కోమటిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల కారణంగా పెండింగ్‌లో ఉన్న హైదరాబాద్-విజయవాడ ఆరు లేన్ల జాతీయ రహదారి పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సోమవారం ఢిల్లీలో గడ్కరీతో ఆయన దాదాపు గంటపాటు భేటీ అయి రాష్ట్రానికి సంబంధించిన రోడ్డు ప్రాజెక్టులపై చర్చించారు. తర్వాత గడ్కరీతో చర్చించిన విషయాలను కోమటిరెడ్డి మీడియాతో పంచుకున్నారు. ప్రతిరోజూ 60వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై 17 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని గడ్కరీతో చెప్పామన్నారు. ఈవిషయాన్ని గతంలో గడ్కరీ దృష్టికి తీసుకురాగా.. మరమ్మతుల నిమిత్తం రూ.375 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారని చెప్పారు. అయితే వాటికి మరమ్మతులు చేయాల్సిన జీఎంఆర్ సంస్థ వివిధ సాకులతో రెండు పర్యాయాలు కోర్టుకు వెళ్లిందని, మూడోసారి టెండర్లు పిలిచి రెండు రోజుల క్రితం పనులు ప్రారంభించినట్లు తెలిపానన్నారు.

ఉప్పల్–ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి కొత్త టెండర్లు

ఉప్పల్–ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తున్న ప్రస్తుత కంపెనీని టర్మినేట్ చేసి కొత్త కొంపెనీ కోసం టెండర్లు పిలవాలని గడ్కరీ సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా, కంపెనీని టర్మినేట్ చేసే నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. త్వరలో టెండర్లు పిలిచి కొత్త కంపెనీకి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన రహదారుల విషయంలో చొరవ తీసుకుని, అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టమని కేంద్రప్రభుత్వానికి లేఖ రాయడం వల్ల రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టు వెనక్కు వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, తాను యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని కేంద్రానికి లేఖ రాయడంతో ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు ముందుకు కదిలిందన్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు పనులు కాస్త ఆలస్యమయ్యాయని, ఇప్పుడు పనులు త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దీనిపై త్వరలో సమీక్షిస్తానని గడ్కరీ చెప్పినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన గడ్కరీ భారతమాల ప్రాజెక్టు కింద మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు సుస్థిర పాలనను అందిస్తున్న విషయాన్ని గడ్కరీకి చెప్పి ప్రాజెక్టుల విషయంలో సహకరించాలని కోరడంతో.. ఆయన ప్రతి అంశానికి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. అనంతరం కోమటిరెడ్డి మంత్రి బండి సంజయ్‌ను కలిశారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్ర ఎంపీల ప్రమాణస్వీకారానికి హాజరవుతారని కోమటిరెడ్డి తెలిపారు.

కమ్యూనిటీ పోలీసింగ్

నాలుగు రకాలైన విధులకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల వినియోగం

- ఇప్పటికే ట్రాఫిక్ నిర్వహణలో శిక్షణ ప్రారంభం
- త్వరలో ఉమెన్ సేఫ్టీ, 'టచ్', డ్రగ్స్‌పై అవగాహన
- స్పై కెమెరాలు కనిపెట్టడంలోనూ శిక్షణ
- ప్రతి కాలేజీ విద్యార్థికి నెలలో ఒక గంట ట్రాఫిక్ విధులు
- వెల్లడించిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్: నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లను కమ్యూనిటీ పోలీసింగ్‌కు వినియోగించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా ఉన్నారు. వీరి సేవలు సమాజానికి విభిన్నకోణంలో ఉపయోగపడేవిధంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ట్రాఫిక్ వలంటీర్లుగా వినియోగించుకోనున్నారు. దీనికి సంబంధించి మొదటిబ్యాచ్ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన బుర్రా వెంకటేశం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, కాలేజీ విద్యార్థులకు సంబంధించి తాము రూపొందిస్తున్న భవిష్యత్ ప్రణాళికల్ని ప్రకటించారు. డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అదనపు సీపీ(ట్రాఫిక్) విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ విధుల్లోకి కాలేజీ విద్యార్థులు

ఎన్‌ఎస్‌ఎస్ నిబంధనల ప్రకారం ప్రతి వలంటీర్ రెండేళ్లలో విధిగా 240 గంటలు సామాజిక సేవ చేయాలి. ఇదేవిధంగా నగరంలో ఉన్న ప్రతి కాలేజీ విద్యార్థి ఏడాదిలో 12 గంటల చొప్పున ట్రాఫిక్ విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం నగరంలో 3 లక్షల మంది ఇంటర్, డిగ్రీ, పీజీ చేస్తున్న విద్యార్థులు ఉన్నారు. వీళ్లలో ప్రతిఒక్కరూ నెలకు ఒక గంట చొప్పున రహదారులపై ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తూ నిబంధనలపై ప్రచారం చేయాలి. దీంతో సిబ్బంది లేమితో ఇబ్బంది పడుతున్న పోలీసులకు ఉపయుక్తంగా ఉంటుందని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. దీనికోసం స్థానిక పోలీసులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో సమన్వయం చేసుకోవాలి.

ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీల్లోకి కూడా...

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ట్రాఫిక్ వలంటీర్లుగా మార్చే ప్రక్రియ మొదలైంది. ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ విధానంలో 300 మందికి తొలివిడతలో శిక్షణ ఇస్తున్నారు. రెండోదశలో



వివరాలు వెల్లడిస్తున్న బుర్రా వెంకటేశం. చిత్రంలో డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మరో 300 మందిని ట్రాఫిక్ వలంటీర్లుగా తీర్చిదిద్దుతారు. ఈ 600 మంది మిగిలిన వలంటీర్లకు శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత అందరూ విధుల్లోకి వస్తారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ఉమెన్ సేఫ్టీలోనూ శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం స్పై కెమెరాలు మహిళల భద్రతకు సవాల్‌గా మారాయి. మాల్స్, వస్త్ర దుకాణాలతో పాటు చేంజింగ్ రూమ్స్, టాయిలెట్స్ ఉన్న చోట్ల వీటి బెడద ఎక్కువగా ఉంది. వెలుగులోకి రాకుండా ఉంటున్న ఘటనలు అనేకం ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రహస్యంగా ఉండే ఇలాంటి స్పై కెమెరాలను గుర్తించడంపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చి ఉపకరణాలు అందజేస్తారు. వీరు తరచూ ఏరియాల వారీగా ఆయా వ్యాపార, వాణిజ్య సంస్థలో తనిఖీలు చేసి ఆ ప్రదేశం సేఫ్ అని ధ్రువీకరిస్తూ స్టిక్కర్లు అతికిస్తారు. ఇందులోనూ స్థానిక పోలీసుల సహకారం తీసుకుంటారు.

మహిళా వలంటీర్లతో 'టచ్'పై అవగాహన

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులకు ప్రధాన కారణంగా వారికి 'టచ్'లో తేడా తెలియకపోవడమే. దీంతో విద్యాశాఖ విద్యార్థినులు, చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లను క్షుణ్ణంగా అర్థం అయ్యేలా చెప్పాలని నిర్ణయించింది. దీనికోసం మహిళా వలంటీర్లను మాత్రమే వినియోగించనున్నారు.

విద్యార్థులకు క్రెడిట్స్

కళాశాలలు, విద్యార్థులకు మాదకద్రవ్యాలపైనా అవేర్‌నెస్ తీసుకురావడానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, సెప్టెంబర్‌లోపు అమలులోకి వస్తాయని బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల కోసం టైమ్‌బ్యాంక్ విధానం ప్రవేశపెట్టి, అందులో క్రెడిట్స్ ఏర్పాటు చేస్తారు. వీరికి ఉన్నత విద్యా సంస్థలు, తదితరాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. భవిష్యత్‌లో స్కౌట్స్ తదితర విభాగాలను ఈ సేవల్లో భాగస్వాముల్ని చేయనున్నారు.

మూడు నెలల్లో నైనీ బొగ్గు ఉత్పత్తి !

ఒడిశా అధికారులతో సమావేశమైన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒడిశాలోని నైనీబ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి విషయంలో కీలక అడుగు పడింది. సింగరేణి సంస్థకు అవసరమైన అటవీభూమిని సాధ్యమైనంత త్వరగా అందజేస్తామని ఒడిశా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా హామీ ఇచ్చారు. ఈ మేరకు సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. అందులోని వివరాల ప్రకారం.. నైనీ బొగ్గు బ్లాక్‌తోపాటు అక్కడ 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సింగరేణి సంస్థ ప్రయత్నిస్తోంది. వీటికి సంబంధించిన పర్యావరణ అనుమతుల విషయమై చర్చించేందుకు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తన బృందంతో ఒడిశాలో పర్యటించారు. ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనాతోపాటు ఒడిశా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఇడ్కో) చైర్మన్ హేమంత్‌శర్మతో ఆయన వరుసగా సమావేశమయ్యారు.

అటవీ భూములు ఇవ్వండి

నైనీ బ్లాక్‌కు సంబంధించి రెండోదశ అటవీ అనుమతుల్లో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా రూ.39 కోట్లు డిపాజిట్ చేయగా, ఇప్పటివరకు రూ.180 కోట్లు పూర్తిగా ప్రభుత్వానికి చెల్లించినట్టు ఒడిశా అధికారులకు సీఎండీ బలరాం తెలిపారు. బొగ్గు ఉత్పత్తికి అవసరమైన 783 హెక్టార్ల అటవీభూమిని సింగరేణికి త్వరగా బదలాయించాలని కోరారు. దీంతో పాటు సింగరేణి ఆధ్వర్యాన నైనీ ప్రాజెక్టుకు 50 కి.మీ. దూరాన 1,600 (2 x



ఒడిశా సీఎస్ ప్రదీప్‌కుమార్ జెనాతో చర్చిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం, అధికారులు

800) మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన వివరించారు. అనంతరం ఒడిశా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా మాట్లాడుతూ సింగరేణి నైనీ ప్రాజెక్టు నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి తమ ప్రభుత్వ సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అటవీ భూముల బదలాయింపు సకాలంలో జరిగితే మూడు నెలల్లో నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని బలరాం తెలిపారు. సింగరేణి సీఎండీతో సమావేశమైన వారిలో ఒడిశా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పీసీసీఎఫ్తోనూ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ సుశాంత్ ఉన్నారు. సింగరేణి తరఫున నైనీ జీఎం తుమ్మలపల్లి శ్రీనివాసరావు, జీఎం(ఎస్టేట్స్) బండి వెంకటయ్య, చీఫ్ ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ విశ్వనాథరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.మజుందార్, ఎస్ఈ(మైనింగ్) ప్రవీణ్ కశ్యప్ తదితరులు ఒడిశా పర్యటనలో పాల్గొన్నారు.

కీలక ఖనిజాల రంగంలో విస్తృత అవకాశాలున్నాయి


4వ విడత క్రిటికల్ మినరల్ బ్లాకుల వేలం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కీలకమైన, తక్కువగా లభించే ఖనిజాల వెలికితీతలో అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. 2015లో కొత్తగా తీసుకొచ్చిన చట్టం ద్వారా సానుకూల మార్పులు కనబడుతున్నాయని వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన నాలుగో విడత కీలకమైన, తక్కువగా లభించే ఖనిజాల (క్రిటికల్ మినరల్) గనుల నాలుగో విడత వేలాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'కొత్త చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తాం. ఆర్థికంగా రాష్ట్రాలకు లబ్ధి చేయడంతోపాటుగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ ముందడుగేస్తాం. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత దేశం ఎదిగేందుకు గనుల రంగంలో సాధించే ప్రగతి అత్యంత కీలకం' అని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 'స్కీమ్ ఫర్ పార్షియల్ రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ ఎక్స్‌పెన్సెస్ ఫర్ హోల్డర్స్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ లైసెన్స్' పుస్తకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. అనంతరం 2 కంపెనీలకు మైనింగ్ ఎక్స్‌ప్లొరేషన్ లైసెన్స్‌లు, మంచి ఫలితాలు సాధిస్తున్న కంపెనీలు, ఆర్అండ్‌డీ సంస్థలకు ప్రోత్సాహకాలు అందజేశారు.

గనుల వేలంపై ఉత్కంఠ

- ఆరు గనుల వేలానికి ఈ నెల 30 వరకు గడువు
- ప్రభుత్వ రంగ సంస్థలకు ఇవ్వాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వం వల్లే కేంద్రం ఒత్తిడి పెంచుతోందని విమర్శ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 11 గనుల వేలానికి సంబంధించి ఈ నెల 30వ తేదీని కేంద్ర ప్రభుత్వం గడువుగా నిర్దేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వం అనుసరించిన విధానంతో రాష్ట్రంలోని ఖనిజ సంపదపై హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందనే వాదనను ప్రభుత్వం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 గనులను ప్రైవేటు కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వ రంగ సంస్థలకే కేటాయించేలా విజ్ఞప్తి చేయాలని యోచిస్తోంది. దీనికి సంబంధించి ఒకటి రెండు రోజుల్లో కేంద్రానికి లేఖ రాసే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం రాష్ట్రంలోని సున్నపు రాయి, ఇనుప ఖనిజం గనులను ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలోని పసుపుల బోడు, సైదుల్‌నామా, సుల్తాన్‌పూర్ సున్నపురాయి గనులను వేలం వేయాలని 2018లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వేలానికి అనుమతించాలని కోరుతూ 2020 సెప్టెంబర్ 16న గత ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్ర గనుల మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఈ గనుల వేలానికి అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 12న కేంద్రానికి లేఖ రాసింది. ఇప్పటికే



రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించినందున వేలం ప్రక్రియను కొనసాగించాలని లేఖలో కోరింది.

గనుల వేలంపై కేంద్రం ఆరా...

వివిధ రాష్ట్రాల్లో గనులు, ఖనిజాల వేలం ప్రక్రియపై ఇటీవల ఆరా తీసిన కేంద్రం తెలంగాణలో నోటిఫై చేసిన 11 గనుల వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ ఏడాది మే 20న రాష్ట్రానికి లేఖ రాసింది. 2015 నాటి కొత్త మైనింగ్ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటికే 354 మేజర్ మినరల్ బ్లాక్‌లను వేలం వేయగా, 48 బ్లాకుల్లో ఉత్పత్తి కూడా ప్రారంభమైందని ఈ లేఖలో పేర్కొంది. అదే తరహాలో తెలంగాణలో నోటిఫై చేసిన 11 గనుల్లో కనీసం 6 గనులను ఈ నెల 30లోగా వేలం వేయాలని గడువు విధించింది. లేని పక్షంలో ఎంఎండీఆర్ చట్టంలోని సెక్షన్ 10 బీ, 11 ప్రకారం కేంద్రమే ఈ గనులను వేలం వేస్తుందని లేఖలో స్పష్టం చేసింది. కేంద్రం నోటిఫై చేసిన ఈ 11 గనుల్లోనే సూర్యాపేట జిల్లాలోని సైదులనామా, సుల్తాన్‌పూర్, పుసుపులబోడు, ఖమ్మం జిల్లాలోని చింతలతాండ, ఆదిలాబాద్ జిల్లాలోని కంప జునపాని సున్నపురాయి గనులు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతోనే ఈ గనులపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. గనులు, ఖనిజ సంపదను కాపాడుకోవడంలో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్లే గనులు వేలం వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందనే వాదన వినిపిస్తోంది. సింగరేణి సంస్థకు దక్కాల్సిన సత్తుపల్లి, కోయగూడెం కళ్యాణిఖని గనులను 2023లోనే వేలంలో ప్రైవేటు కంపెనీలు దక్కించుకున్నాయనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. భూపాలపల్లి ఏరియాలోని తాడిచెర్ల బొగ్గు గనిని కేసీఆర్ ప్రభుత్వమే ఒక ప్రైవేటు కంపెనీకి 30 ఏళ్ల పాటు లీజుకిచ్చిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

బాల వికాసం



ఆలియా భట్

పిల్లల్ని ప్రేమించేవారు కథలనూ ప్రేమిస్తారు

బాల్యంలో తమకు ఇష్టమైనవి తమ పిల్లలకు దక్కాలనుకుంటారు తల్లిదండ్రులు.
నటి ఆలియా భట్ తన తాతగారి నుంచి చాలా కథలు వినేది.
కుమార్తె పుట్టాక ఆ పాపకు కథలు చెప్పాలనిపించింది.
తన పాపకే ఏమిటి అందరు పిల్లలకూ కథలు చెప్తానని ఏకంగా కథల పుస్తకం రాసింది.
'ఎడ్ ఫైండ్స్ ఏ హోమ్' దాని పేరు.
సాహస బాలిక తన శునకంతో ఎన్ని అద్భుతాలు చేసిందనేదే కథ.
పిల్లలకు అవసరమైన కథా ప్రపంచం గురించి ఆలియా మాటలు.....

'ఒకమ్మాయికి ప్రకృతితో మాట్లాడే శక్తి వస్తే? చెట్లతో పుట్లతో పిట్టలతో జంతువులతో మాట్లాడే శక్తీ వాటి మాటలను అర్థం చేసుకునే శక్తి వస్తే? వాటి సమస్యలు తెలుసుకొని భూమిని, పర్యావరణాన్ని కాపాడాలని అనుకుంటే ఎంత బాగుంటుంది. అదే నా తొలి పుస్తకం కథ' అని చెప్పింది నటి ఆలియా భట్.

ఆమె రాసిన మొదటి పుస్తకం 'ఎడ్ ఫైండ్స్ ఏ హోమ్'... పెంగ్విన్ సంస్థ ఉప విభాగం పఫిన్ ద్వారా మార్కెట్‌లో విడుదలైంది. బాలీవుడ్‌లో సూపర్‌స్టార్ అయిన ఆలియా భట్ తనకు కూతురు పుట్టాక ఈ పుస్తకాన్ని విడుదల చేయడం వల్ల పిల్లల పుస్తకాల అవసరం, వాటి ఉద్దేశ్యం గురించి నేడు మళ్లీ బాలల సాహిత్య ప్రేమికులు మాట్లాడుకుంటున్నారు.

కరుణ, పర్యావరణ ప్రేమ

'పిల్లల పుస్తకాలు పిల్లల్లో కరుణని పెంచాలి. పర్యావరణ స్పృహను కలిగించాలి. పిల్లలకు తన ఇంటి బయట ఉండే ప్రకృతి పరిసరాలు, దూరాన కొండల్లో ఉండే పక్షులు, పులులు, ఏనుగులు... ఇవి ఎంతో ఇష్టం. వాటిని పాత్రలుగా చేసుకుని కథలు చెప్తే వారు వింటారు' అంటుంది ఆలియా.

వివేక్ కామత్, తన సోదరి షబ్నమ్ మిన్వాలాల సహాయంతో ఆలియా 'ఎడ్ ఫైండ్స్ ఏ హోమ్' పుస్తకం రాసింది. ఇందులో చిన్నారి అమ్మాయి పేరును ఆలియా అనే పెట్టింది. మరో ముఖ్యపాత్రైన కుక్కపిల్లకు 'ఎడ్' అనే పేరు పెట్టింది. ఇది ఆలియాకు ఉన్న మూడు పిల్లుల్లో ఒకదాని పేరు ఎడ్వర్డ్ నుంచి తీసుకుంది. 'ఎవరూ పట్టించుకోకుండా వదిలేయడంతో దిక్కుతోచక తిరుగుతున్న కుక్కపిల్లను ఆలియా అనే చిన్నారి చేరదీస్తుంది. వీరితో పాటు ఒక మాట్లాడే కాకి, మాట్లాడే కొబ్బరి చెట్టు ఈ కథలో పాత్రలుగా ఉంటాయి. మొదటి భాగంలో వీరంతా పరిచయం అవుతారు. తర్వాతి భాగాల్లో భూమి కాపాడే సాహసాలు ఉంటాయి. ఆలియా, ఎడ్‌లను ప్రధాన పాత్రలుగా చేసుకుని వరుసగా కథల పుస్తకాలు తెస్తాను. వీటిని యానిమేషన్ సిరీస్‌గా కూడా వెలువరిస్తాను. నా మొదటి పుస్తకం కూడా ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ పేపర్ మీదే అచ్చయ్యింది' అని తెలియచేసింది ఆలియా.

పిల్లలకు కథలు అవసరం

'నా చిన్నప్పుడు మా తాత (తల్లి సోనీ రాజ్దాన్ తండ్రి నరేంద్రనాథ్ రాజ్దాన్) నాకు చాలా కథలు చెప్పేవారు. ముఖ్యంగా చున్ను, మున్ను, గున్ను అనే మూడు పాత్రలతో ఆయన చెప్పే కథలు నాకు భలే నచ్చేవి. ఆ మూడు పాత్రలు మనుషులో చీమలో ఎలుకలో కూడా తెలియదు. ఇక మా అక్క షాహీన్ పుస్తకాల పురుగు. నాకు కథలు చదివి వినిపించేది. మా అమ్మాయి రాహా పుట్టాక పిల్లల కథల గురించి మళ్లీ ఆలోచన వచ్చింది. ఇప్పుడు దానికి 19 నెలలు. రోజూ నేను దానికి నిద్రపోయే ముందు కనీసం మూడు కథల పుస్తకాలు చదివి వినిపిస్తాను. రకరకాల గొంతులతో పాత్రలను చదువుతాను. చాలా ఆసక్తిగా వింటుంది. తర్వాత ఆ పుస్తకాలను కౌగిలించుకుని నిద్రపోతుంది. నా పుస్తకంలోని కథ కూడా వినిపించాను. అయితే కథ కంటే కూడా దానికి పుస్తకంలోని బొమ్మలు బాగా నచ్చాయి' అని నవ్వింది ఆలియా.

పుస్తకాలు, బొమ్మలు

'పిల్లల పుస్తకాలే కాదు పిల్లల బొమ్మలు కూడా బోధనాత్మకంగా ఉండాలి. బొమ్మలు విజ్ఞానం పంచేలా ఉండాలి. అలాగే పర్యావరణహితంగా తయారవ్వాలి. ఇలాంటి పనులన్నింటిలో నేను నిమగ్నం కావాలని కోరుకుంటున్నాను. నేను రచయితను కాను. స్టోరీ టెల్లర్‌ని. మనందరం కథలు రాయలేకపోయినా చెప్పగలం. పిల్లలకు కథలు చెప్పాలి. తల్లిదండ్రులు పిల్లలను కథల ప్రపంచానికి దూరం చేయవద్దు. వారికి ఆ ప్రపంచం చాలా ముఖ్యం' అంటోంది ఆలియా.

సిక్స్‌–జనరేషన్

సౌందర్య లహరి
- ది స్టార్ ఇన్ యూ


ఇమాన్ అల్లానా

పెద్ద వ్యాపార కుటుంబంలో పుట్టింది ఇమాన్ అల్లానా.
కుటుంబ వ్యాపారంతో నిమిత్తం లేకుండా ఎంటర్‌ప్రెన్యూర్‌గా సొంతంగా విజయం సాధించాలనేది ఆమె కల. ఆరోతరం ఎంటర్‌ప్రెన్యూర్‌గా బ్యూటీ బ్రాండ్ 'బాలీ గ్లో'తో చిన్న వయసులోనే పెద్ద విజయం సాధించింది 26 సంవత్సరాల ఇమాన్.
'సాధించాలనే తపన ఉంటే తెలియని దారులు కూడా పరిచయం అవుతాయి. కొత్త ప్రపంచంలోకి తీసుకు వెళతాయి. విజయాలకు దగ్గర చేస్తాయి' అంటున్న ఇమాన్ అల్లానా గురించి...

బంగారు చెంచాతో పుట్టింది ఇమాన్ అల్లానా. తల్లిదండ్రులు ఇర్ఫాన్, లుబ్నా దుబాయిలో బిలియనీర్‌లు. రీజెంట్స్ యూనివర్శిటీ లండన్‌లో 'బ్రాండ్ మేనేజ్‌మెంట్'లో మాస్టర్స్ చేసిన ఇమాన్‌కు ఎంటర్‌ప్రెన్యూర్‌గా తనను తాను నిరూపించుకోవాలనే కోరిక బలంగా ఉండేది. స్కూలు తరువాత అమ్మానాన్నల ఆఫీసుకు వచ్చేది. అక్కడ తమ వ్యాపారానికి సంబంధించిన ఎన్నో మాటలు వినేది. ముఖ్యమైన మీటింగ్ ఉంటే బడికి బంక్ కొట్టి మరీ ఆ మీటింగ్‌లో పాల్గొనేది. మీటింగ్‌లో జరిగే చర్చలను శ్రద్ధగా వినేది... అలా వ్యాపార విషయాలపై ఇమాన్‌కు చిన్న వయసులోనే ఆసక్తి మొదలైంది.

ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవాలని తపించే ఇమాన్‌కు చిన్న చిన్న ఎడ్యుకేషనల్ కోర్సులు చేయడం అంటే ఇష్టం. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించి చిన్న కోర్సులు ఎన్నో చేసింది. 'సొంతంగా బిజినెస్ స్టార్ట్ చేసి రిస్క్ చేయడం ఎందుకు! మన బిజినెస్ చూసుకుంటే సరిపోతుంది' అని ఇమాన్ తల్లిదండ్రులు ఎప్పుడూ అనలేదు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా తనను తాను నిరూపించుకునే అవకాశాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చారు. వారి ప్రోత్సాహ బలంతో ఆరోతరం కుటుంబ సభ్యురాలిగా ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించింది ఇమాన్.

> **కష్టఫలం**
> బిజినెస్ స్కూలులో చదివినంత మాత్రాన, రకరకాల మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినంత మాత్రాన ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించలేం. అది పూర్తిగా మన ఆసక్తి, అధ్యయనం, కష్టం, అంకిత భావంపై ఆధారపడి ఉంటుంది. బిజినెస్ అనేది బేబీలాంటిది. చాలా జాగ్రత్తగా చూసుకోవాలి.
> – ఇమాన్ అల్లానా

బాలీవుడ్, బ్యూటీ మేళవింపుగా వచ్చిన 'బాలీ గ్లో' బ్యూటీ ఇండస్ట్రీలో తక్కువ సమయంలోనే గుర్తింపు సాధించింది. ప్యాకేజింగ్ నుంచి మార్కెటింగ్ వరకు తనదైన ప్రత్యేకత చాటుకుంది. ప్రొడక్ట్‌కు సంబంధించిన ఇన్‌గ్రేడియెంట్స్‌ను ప్రపంచం నలుమూలల నుంచి సేకరిస్తారు. ఇదే సమయంలో పర్యావరణానికి హానికరమైన వాటిని దూరం పెడతారు.

ప్రొడక్ట్‌కు సంబంధించి 'ది స్టార్ ఇన్ యూ' ట్యాగ్‌లైన్ హిట్ అయింది. 'ఇన్నర్ హెల్త్‌కు చర్మం అద్దం పడుతుంది' అంటున్న ఇమాన్ చర్మసౌందర్యానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో తరచుగా చెబుతుంటుంది.

వ్యాపార పనుల్లో భాగంగా లండన్–దుబాయ్–ముంబై నగరాల మధ్య తిరుగుతూ ఉంటుది ఇమాన్.

ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు సామాజిక కార్యకర్తగా... ఇన్వెస్టర్‌గా కూడా రాణిస్తోంది. 'ఫ్యాషన్ అనేది కళారూపం. సృజనాత్మక వ్యక్తీకరణ' అంటున్న ఇమాన్ ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తుంది.

'ఇప్పుడు కస్టమర్లు ప్రొడక్ట్ తళుకు బెళుకులు మాత్రమే చూసి ఓకే చెప్పడం లేదు. ప్రొడక్ట్స్‌కు సంబంధించి ఇన్‌గ్రేడియెంట్స్‌పై కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మా బ్రాండ్ పర్యావరణ హిత, క్రుయాల్టీ–ఫ్రీ ఇన్‌గ్రేడియెంట్స్‌కు ప్రాధాన్యత ఇస్తోంది' అంటుంది ఇమాన్.

బ్యూటీప్రొడక్స్‌పై మాత్రమే కాకుండా మహిళా సాధికారతకు సంబంధించిన విషయాలపై కూడా దృష్టి పెడుతోంది బాలీ గ్లో.



విదేశీ విత్తనాలను, మొక్కల్ని ఆన్‌లైన్‌లో కొంటున్నారా? జాగ్రత్త..!

తెలిసో తెలియకో పోస్టు, కొరియర్ల ద్వారా మన వంటి వారు కొనుగోలు చేస్తున్న విదేశీ మొక్కలు, విత్తనాలతో పాటు మనకు తెలియకుండా దిగుమతయ్యే సరికొత్త విదేశీ జాతుల పురుగులు, తెగుళ్లు మన దేశంలో పంటలకు, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఆహార భద్రతకు ఎసరు పెట్టే పరిస్థితులూ తలెత్తవచ్చు. అందుకే అంతర్జాతీయంగా జన్యువనరుల వ్యాపారాన్ని నియంత్రించేందుకు ఎయిర్‌పోర్టుల్లో, సీపోర్టుల్లో, సరిహద్దుల్లో ప్రత్యేక అధికార వ్యవస్థలను ఏర్పాటు చేశారు. మొక్కలు, విత్తనాలే కాదు.. మట్టి ద్వారా కూడా ఒక దేశం నుంచి మరో దేశానికి చీడపీడలు తెలియకుండా రవాణా కావొచ్చు. ఆ మధ్య ఒక క్రికెటర్ తనతో పాటు తీసుకెళ్తున్న బూట్లకు అడుగున అంటుకొని ఉన్న మట్టిని సైతం ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు గుర్తించి, నివారించడానికి ఇదే కారణం.

అధికారికంగా వ్యవసాయ పరిశోధనల కోసం దిగుమతయ్యే పార్శిళ్లను ఈ క్వారంటైన్ అధికారులు వాటిని నిబంధనల మేరకు పరీక్షించి, ప్రమాదం లేదనుకుంటేనే దిగుమతిదారులకు అందిస్తారు. జాతీయ మొక్కల జన్యువనరుల పరిశోధనా సంస్థ (ఎన్‌బిపిజిఆర్) ద్వారా ఇది జరుగుతుంది.

ఒక వ్యాపార సంస్థ నుంచి నేరుగా వినియోగదారుల మధ్య (బి2సి) జరిగే ఆన్‌లైన్ వ్యాపారం వల్లనే సమస్య. విదేశాల్లోని వినియోగదారులకు ఓ వ్యాపార సంస్థ నేరుగా అమ్మకాలు జరుపుతున్నందున దిగుమతులకు సంబంధించిన ఫైటోశానిటరీ నిబంధనల అమలు కష్టతరంగా మారింది.

అంతర్జాతీయంగా ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం ప్రపంచ దేశాల మధ్య ఇంటర్నేషనల్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఒడంబడిక (ఐపిపిసి) గతంలోనే కుదిరింది. ఇటీవల కాలంలో పెద్ద తలనొప్పిగా మారిన ఈ–కామర్స్ పార్శిళ్లను కట్టడి చేయడం కోసం జాతీయ స్థాయిలో నియంత్రణ వ్యవస్థలకు ఐపిపిసి సరికొత్త మార్గదర్శకాలను సూచించింది.

* * *

ఎవరేమి చెయ్యాలి?

దేశ సరిహద్దులు దాటి సరికొత్త చీడపీడలు మన దేశంలోకి ప్రవేశించకుండా ఉండాలంటే, ప్రమాదవశాత్తూ వచ్చినా వాటిని తొలి దశలోనే గుర్తించి మట్టుబెట్టేందుకు సమాజంలోని అనేక వర్గాల వారు చైతన్యంతో వ్యవహరించాల్సి ఉంది.

రైతులు: చీడపీడలను చురుగ్గా గమనిస్తూ ఏదైనా కొత్త తెగులు లేదా పురుగు కనిపిస్తే వెంటనే అధికారులకు చెప్పాలి. పర్యావరణ హితమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు: చీడపీడల నివారణ, నియంత్రణకు మేలైన పద్ధతులను రైతులకు సూచించాలి. వీటి అమలుకు మద్దతు ఇస్తూ.. మొక్కల ఆరోగ్య పరిరక్షణకు సంబంధీకులందరినీ సమన్వయం చేయాలి.

ప్రభుత్వాలు, విధాన నిర్ణేతలు, పాలకులు: మొక్కల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించాలి. పర్యావరణహితమైన సస్యరక్షణ చర్యలను ప్రోత్సహించాలి. ప్రమాదరహితమైన వ్యాపార పద్ధతులను ప్రవేశ పెట్టాలి. జాతీయ, రాష్ట్రాల స్థాయిలో మొక్కల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ సంస్థలను అన్ని విధాలా బలోపేతం చేయాలి.

దాతలు–సిఎస్ఆర్: మొక్కల ఆరోగ్య రక్షణ వ్యవస్థలను, సాంకేతికతలను బలోపేతం చేయాలి. ప్రైవేటు కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులు సమకూర్చాలి. రవాణా, వ్యాపార రంగాలు: ప్రస్తుతం అంతర్జాతీయంగా అమల్లో ఉన్న ఫైటోశానిటరీ చట్టాలను, ఐపిపిసి ప్రమాణాలను తు.చ. తప్పక పాటించాలి.

ప్రజలు: విదేశాల నుంచి మన దేశంలోకి మొక్కల్ని, మొక్కల ఉత్పత్తుల్ని తీసుకురావటం ఎంతటి ప్రమాదమో గుర్తించాలి. అధికార వ్యవస్థల కన్నుగప్పే విధంగా ఈ–కామర్స్ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా విదేశాల నుంచి మొక్కలను, విత్తనాలను ఆర్డర్ చేయకుండా చైతన్యంతో మెలగాలి.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

విదేశాల నుంచి మొక్కలు, విత్తనాలు, చెక్క వస్తువులు, అలంకరణ చేపలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారా?

విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ కంటికి నచ్చిన పూల మొక్కలనో, పంట మొక్కలనో, వాటి విత్తనాలనో అధికారుల కన్నుగప్పి వెంట తెస్తున్నారా?

మిరపతో పాటు కొన్ని కూరగాయ పంటలు, మామిడి తోటలను ఇటీవల అల్లాడిస్తున్న నల్ల తామర ఇలాగే విదేశాల నుంచి వచ్చిపడిందేనని మీకు తెలుసా? కొబ్బరి, ఆయిల్‌పామ్ వంటి తోటలను పీడిస్తున్న రుగోస్ రింగ్‌స్పాట్ తెల్ల దోమ కూడా విదేశాల నుంచి మన నెత్తిన పడినదే. వీటి వల్ల జీవవైవిధ్యానికి, రైతులకు అపారమైన నష్టం కలుగుతోంది.

ఒక దేశంలో ఉన్నప్పుడు పెద్దగా నష్టం కలిగించని పురుగులు, తెగుళ్లు వేరే దేశపు పర్యావరణంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి జీవవైవిధ్యానికి పెను సమస్యగా మారే ప్రమాదం ఉంటుంది.

ఒక్కసారి ఆ పర్యావరణంలో అది సమస్యగా మారిన తర్వాత దాన్ని నిర్మూలించటం చాలా సందర్భాల్లో అసాధ్యం. ఉదాహరణ.. మన రైతులను వేధిస్తున్న నల్లతామర, రుగోస్ రింగ్ స్పాట్ తెల్లదోమ. అందుచేత.. విదేశాల నుంచి సకారణంగా ఏవైనా మొక్కల్ని, విత్తనాలను, అలంకరణ చేపలను తెప్పించుకోవాలనుకుంటే.. అంతకు ముందే ఫైటోశానిటరీ సర్టిఫికెట్‌తో పాటు ఇతర అనుమతుల్ని కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

తస్మాత్ జాగ్రత్త..!

విదేశీ నత్తలతో ముప్పు!

ఓ కోస్తా జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మంచినీటి నత్త జాతికి చెందిన గోల్డెన్ ఆపిల్ స్నెయిల్‌ను విదేశాల నుంచి తెప్పించి సిమెంటు తొట్లలో పెంచుతూ పట్టుబడ్డాడు. దక్షిణ అమెరికా దీని స్వస్థలం. అయితే, తైవాన్, జపాన్, ఫిలిప్పీన్స్ దేశాలకు పాకిన ఈ నత్త ఆయా దేశాల్లో తామరతంపరగా పెరిగిపోతూ స్థానిక జలచరాలను పెరగనీయకుండా జీవవైవిధ్యాన్ని, వరి పంటను దెబ్బతీయటం ప్రారంభించింది. లేత వరి మొక్కలను కొరికెయ్యటం ద్వారా పంటకు 50% వరకు నష్టం చేకూర్చగలదు. ఫిలిప్పీన్స్‌లో ఏకంగా 200 కోట్ల డాలర్ల మేరకు పంట నష్టం కలిగించింది. వేగంగా పెరిగే లక్షణం గల ఈ నత్త మంచినీటి చెరువులు, కాలువలు, వరి పొలాల్లో జీవవైవిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఈ వ్యక్తి ఈ నత్తలను పెంచుతూ మాంసాన్ని విక్రయించటం ప్రారంభించిన విషయం తెలుసుకున్న అధికారులు అతని వద్ద ఉన్న విదేశీ నత్తలను, వాటి గుడ్లను పూర్తిగా నాశనం చేశారు. దీని వల్ల జీవవైవిధ్యానికి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేని స్థితిలో ఈ నత్తల్ని పెంచటం ప్రారంభించినట్లు చెబుతున్నారు. కొరియర్ ద్వారా గాని, కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి నత్తలను తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. అయితే, సకాలంలో అధికారులు స్పందించటం వల్ల మన వరి పొలాలకు ఈ నత్తల ముప్పు తప్పింది.


● గోల్డెన్ ఆపిల్ స్నెయిల్


● వరి మొక్కపై నత్త గుడ్లు

ఇండియన్ స్టిక్ ఇన్‌సెక్ట్

ఎండిన, ముక్కలు చేసిన లేదా పాలిష్ చేసిన ధాన్యాలు, విత్తనాలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు కూడా చీడపీడలను మోసుకొచ్చే ప్రమాదం ఉంది. అయితే, ఉడికించటం, స్టెరిలైజ్ చేయటం, వేపటం వంటి ప్రాసెసింగ్ చేసిన ఆహారోత్పత్తుల ద్వారా మాత్రం చీడపీడలు రవాణా అయ్యే అవకాశం ఉండదు కాబట్టి వీటికి ఫైటోశానిటరీ నిబంధనలు వర్తించవు. తేనెటీగలు, సీతాకోకచిలుకలు, మాంటిడ్స్, పెంకు పురుగులు, పుల్లలతో చేసిన బొమ్మ మాదిరిగా కనిపించే పురుగులు (స్టిక్ ఇన్‌సెక్ట్స్), నత్తలు వంటి వాటిని కొందరు సరదాగా పెంచుకోవటానికి కూడా ఒక దేశం నుంచి మరో దేశానికి పంపటం



లేదా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయటం వంటి పనులు చేస్తుంటారు. వీటి ద్వారా కూడా పురుగులు, తెగుళ్లు, వైరస్‌లు ఇతర దేశాలకు వ్యాపించే అకాశం ఉంటుంది.


న్యూజిలాండ్‌లో మూడేళ్ల క్రితం ఒక స్కూలు విద్యార్థిని ఇంట్లో పెద్దలకు తెలియకుండా అనేక రకాల స్టిక్ ఇన్‌సెక్ట్ గుడ్లను పోర్చుగల్ దేశం నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి తెప్పించుకుంది. పార్శిల్ వచ్చిన తర్వాత గమనించిన ఆమె తల్లి ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారు ఆ పార్శిల్‌ను జాగ్రత్తగా తీసుకెళ్లి పరీక్షించి చూశారు.

ఆ దేశంలో అప్పటికే ఉన్న అనేక రకాల స్టిక్ ఇన్‌సెక్ట్స్ గుడ్లతో పాటు కొత్త రకం ఇండియన్ స్టిక్ ఇన్‌సెక్ట్ గుడ్లు కూడా ఆ పార్శిల్‌లో ఉన్నాయని గుర్తించి నాశనం చేశారు. ఈ విద్యార్థిని తల్లి చైతన్యం మెచ్చదగినది.

సెకనుకు 5,102 ఈ-కామర్స్ లావాదేవీలు!

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ ద్వారా వస్తువుల వ్యాపారం (ఈ–కామర్స్) గతమెన్నడూ లేనంత జోరుగా సాగుతున్న రోజులివి. సెకనుకు 5,102 ఈ–కామర్స్ లావాదేవీలు జరుగుతున్నాయి. 2022లో ఏకంగా 16,100 కోట్ల పార్శిళ్ల కొనుగోళ్లు ఆన్‌లైన్‌లో జరిగాయి. కరోనా కాలంలో 20% పెరిగాయి. ఇప్పుడు వార్షిక పెరుగుదల 8.5%. 2027 నాటికి ఏటా 25,600 కోట్ల పార్శిళ్లు ఈ కామర్స్ ద్వారా బట్వాడా అయ్యే అవకాశం ఉందని అంచనా.

ముఖ్యంగా అసక్తిగా ఇంటిపంటలు, పూల మొక్కలు పెంచుకునే గృహస్తులు చిన్న చిన్న కవర్లలో విత్తనాలను విదేశాల్లోని పరిచయస్తులకు పోస్ట్/ కొరియర్ ద్వారా పంపుతుంటారు. విదేశీ కంపెనీల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి తెప్పించుకుంటూ ఉంటారు. విదేశాల నుంచి విత్తనాలు, ఉద్యాన తోటల మొక్కలు, అలంకరణ మొక్కలు, వాటితో పాటు వచ్చే మట్టి, అలంకరణ చేపలు, చెక్కతో చేసిన వస్తువులు, యంత్రాల ప్యాకింగ్‌లో వాడే వుడ్ ఫ్రేమ్‌ల ద్వారా పురుగులు, తెగుళ్లు ఒక దేశం నుంచి మరో దేశానికి రవాణా అవుతూ అధికారులకు చెమటలు పట్టిస్తున్నాయి. కరోనా కాలం నుంచి ప్రపంచ దేశాల మధ్య పార్శిళ్ల వ్యాపారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవటంతో నియంత్రణ వ్యవస్థలు ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. మన దేశంలో నియంత్రణ వ్యవస్థలను నేటి అవసరాలకు అనుగుణంగా పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.


● అమెరికాలోని ఓ తనిఖీ కేంద్రంలో ఈ–కామర్స్ పార్శిళ్లు

సాగుబడి
ఆరుద్ర కార్తె : జూలై 5 వరకు

జూలై 7న నూజివీడులో రైతు సదస్సు

ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా నూజివీడు టీటీడీ కల్యాణ మండపంలో జూలై 7(ఆదివారం)న ఉ. 10 గంటల నుంచి మామిడి సాగులో మెలకువలతో పాటు బయోచార్ వినియోగంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు నూజివీడు సేంద్రియ ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి భోగోలు రాజేశ్ తెలిపారు. బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పిస్తారని రాజేశ్ (91779 88422) వివరించారు.

గోమయ ఉత్పత్తులపై 30న శిక్షణ

ఆవు పేడతో అనేక ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వ్యూహాలపై రైతులు, గోశాలల నిర్వాహకులకు ఈ నెల 30న హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మురళీధర గోధామం (జగిత్యాల జిల్లా) వ్యవస్థాపకులు డాక్టర్ పద్మ తెలిపారు. గోశాలలను ఆర్థికంగా స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 98497 50854.

ఆంగ్రూ ఆన్‌లైన్ కోర్సులు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) సార్వత్రిక, దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో మిద్దెతోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకంపై వేర్వేరుగా ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనుంది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఈ కోర్సులు నిర్వహిస్తారు. ఫీజు రూ. 1,500.
ఇతర వివరాలకు.. 80087 88776
www.angrau.ac.in

"భారత జట్టుకు ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. అయితే నా స్వప్నం 50 శాతమే సాకారమైంది. నేను టీమిండియా జెర్సీ వేసుకొని మైదానంలో దిగి సెంచరీతో జట్టును గెలిపించినపుడే నా పూర్తి కల నెరవేరుతుంది. నా కెరీర్‌ను తీర్చిదిద్దేందుకు మా నాన్న నా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఇప్పుడు ఆయన కళ్లలో ఆనందం చూస్తుంటే ఇదే కదా ఆయన లక్ష్యమని గర్వంగా ఉంది. –నితీశ్ కుమార్ రెడ్డి


నితీశ్ కుమార్ రెడ్డికి వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: భారత సీనియర్ క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ పర్యటనలో మంచి ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు. కెరీర్‌లో మరింత ఎదగాలంటూ కోరుకుంటున్నానని వైఎస్ జగన్ అన్నారు. విశాఖపట్నానికి చెందిన నితీశ్ దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర రంజీ జట్టు తరఫున ఆడుతున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరఫున ఆడి 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు సొంతం చేసుకున్నాడు.

ఆసీస్‌ను పడగొట్టి సెమీఫైనల్‌కు

టి20 వరల్డ్‌కప్ సెమీఫైనల్లో భారత్
- 24 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు
- చెలరేగిన రోహిత్ శర్మ
- గురువారం ఇంగ్లండ్‌తో సెమీస్

ఏడు నెలల క్రితం తగిలిన దెబ్బకు ఇప్పుడు కాస్త ఉపశమనం! ఫైనల్ కాకపోవచ్చు, ఫార్మాట్ వేరు కావచ్చు... కానీ ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాను ఓడించడం అంటే సగటు భారత అభిమాని ఆనందాన్ని రెట్టింపు చేసే క్షణం! వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత మళ్లీ ఇప్పుడే తలపడిన మ్యాచ్‌లో టీమిండియా అలాంటి సంతోషాన్నే పంచింది. ఆసీస్‌ను చిత్తు చేసి సగర్వంగా సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. రోహిత్ శర్మ అద్భుత బ్యాటింగ్‌తో భారత్ భారీ స్కోరుకు బాటలు వేస్తే మన బౌలర్లు సమర్థంగా లక్ష్యాన్ని కాపాడుకోగలిగారు. ఈ ఓటమితో ఆసీస్ సెమీఫైనల్ ఆశలు అడుగంటిపోగా... 2022 తరహాలోనే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో పోరుకు టీమిండియా సిద్ధమైంది.


రోహిత్

గ్రాస్ ఐలెట్: టి20 వరల్డ్‌కప్‌లో వరుసగా రెండోసారి భారత్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. లీగ్ దశలో 3 మ్యాచ్‌లు నెగ్గిన టీమిండియా సూపర్–8లోనూ ఆడిన 3 మ్యాచ్‌లు గెలిచి అజేయంగా సెమీస్ చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 24 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (41 బంతుల్లో 92; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ అవకాశం చేజార్చుకున్నాడు. ఇతర బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దూబే (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ (17 బంతుల్లో 27 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. జట్టు ఇన్నింగ్స్‌లో రోహిత్ ఒక్కడే 15 బౌండరీలు బాదితే, మిగతా బ్యాటర్లు కలిపి 14 బౌండరీలు కొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 181 పరుగులే చేయగలిగింది. ట్రవిస్ హెడ్ (43 బంతుల్లో 76; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు.

సమష్టి బ్యాటింగ్ ప్రదర్శన...

రెండో ఓవర్లో కోహ్లి (0)ని హాజల్‌వుడ్ అవుట్ చేయడంతో ఆసీస్ సంబరపడింది. కానీ ఆ తర్వాత అసలు కథ మొదలైంది. రోహిత్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లందరికీ చుక్కలు చూపించాడు. స్టార్క్ ఓవర్లో 29 పరుగులు బాదిన అతను కమిన్స్ ఓవర్లో సిక్స్, 2 ఫోర్లు కొట్టి 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రోహిత్ జోరు చూస్తే సెంచరీ లాంఛనమే అనిపించినా... చక్కటి యార్కర్‌తో స్టార్క్ రోహిత్‌ను బౌల్డ్ చేశాడు! తన తర్వాతి ఓవర్లో సూర్యనూ అతను వెనక్కి పంపించాడు. చివరి 5 ఓవర్లలో భారత్‌ను ఆసీస్ కట్టడి చేసింది.

హెడ్ మెరుపులు...

ఛేదనలో ఆసీస్ కూడా ఆరంభంలోనే వార్నర్ (6) వికెట్ కోల్పోయింది. అయితే హెడ్, మార్ష్ ధాటిగా ఆడి రెండో వికెట్‌కు 48 బంతుల్లో 81 పరుగులు జోడించారు. హెడ్ 24 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అయితే అక్షర్ అద్భుత క్యాచ్‌కు మార్ష్ వెనుదిరగడంతో ఆసీస్ పతనం మొదలైంది. 38 పరుగుల వ్యవధిలో జట్టు తర్వాతి 5 వికెట్లు కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది.

ఒకే ఓవర్లో 29 పరుగులు...

ఆసీస్ టాప్ బౌలర్ మిచెల్ స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో రోహిత్ నాలుగు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో పండగ చేసుకున్నాడు. ఈ ఓవర్ తొలి నాలుగు బంతుల్లో రోహిత్ వరుసగా 6, 6, 4, 6 కొట్టాడు. ఐదో బంతికి పరుగు రాకపోగా, తర్వాత స్టార్క్ 'వైడ్' వేశాడు. దాంతో అదనపు బంతిని కూడా రోహిత్ సిక్సర్‌గా మలిచాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) స్టార్క్ 92; కోహ్లి (సి) డేవిడ్ (బి) హాజల్‌వుడ్ 0; పంత్ (సి) హాజల్‌వుడ్ (బి) స్టొయినిస్ 15; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) స్టార్క్ 31; దూబే (సి) వార్నర్ (బి) స్టొయినిస్ 28; పాండ్యా (నాటౌట్) 27; జడేజా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 205.**
వికెట్ల పతనం: 1–6, 2–93, 3–127, 4–159, 5–194. **బౌలింగ్:** స్టార్క్ 4–0–45–2, హాజల్‌వుడ్ 4–0–14–1, కమిన్స్ 4–0–48–0, జంపా 4–0–41–0, స్టొయినిస్ 4–0–56–2.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 6; హెడ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 76; మార్ష్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 37; మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 20; స్టొయినిస్ (సి) పాండ్యా (బి) అక్షర్ 2; డేవిడ్ (సి) బుమ్రా (బి) అర్ష్‌దీప్ 15; వేడ్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 1; కమిన్స్ (నాటౌట్) 11; స్టార్క్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 181.**
వికెట్ల పతనం: 1–6, 2–87, 3–128, 4–135, 5–150, 6–153, 7–166. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–37–3, బుమ్రా 4–0–29–1, అక్షర్ పటేల్ 3–0–21–1, హార్దిక్ పాండ్యా 4–0–47–0, కుల్దీప్ యాదవ్ 4–0–24–2, జడేజా 1–0–17–0.

గ్రూప్–1 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
భారత్	3	3	0	6	2.017
ఆస్ట్రేలియా	3	1	2	2	−0.331
అఫ్గానిస్తాన్	2	1	1	2	−0.650
బంగ్లాదేశ్	2	0	2	0	−2.489

దక్షిణాఫ్రికా దర్జాగా...

- సెమీస్ చేరిన సఫారీ జట్టు
- సూపర్–8లోనే విండీస్ నిష్క్రమణ


షమ్సీ

నార్త్‌సౌండ్: టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తమ జోరు ప్రదర్శించింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం మూడు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించి దర్జాగా సెమీఫైనల్ చేరింది. సూపర్–8 దశలో ఆడిన మూడూ గెలిచిన సఫారీ 6 పాయింట్లతో గ్రూప్–2 టాపర్‌గా, 4 పాయింట్లతో ఇంగ్లండ్ రెండో జట్టుగా సెమీఫైనల్స్‌కు చేరాయి. రెండుసార్లు టి20 చాంపియన్, ఆతిథ్య వెస్టిండీస్ కథ 'సూపర్–8'లోనే ముగిసింది. ముందుగా వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులే చేసింది. కైల్ మేయర్స్ (34 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోస్టన్ చేజ్ (42 బంతుల్లో 52; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. రోమన్ పావెల్ (1), రూథర్‌ఫోర్డ్ (0), రసెల్ (15) చేతులెత్తేయడంతో కరీబియన్ జట్టు ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తబ్రేజ్ షమ్సీ 3 వికెట్లు తీశాడు. 136 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 15 పరుగులు చేసిన దశలో వర్షంతో 50 నిమిషాలు ఆటకు అంతరాయం కలిగింది. దాంతో దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 17 ఓవర్లలో 123 పరుగులుగా నిర్ణయించారు. ఆ జట్టు 16.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి నెగ్గింది. స్టబ్స్ (27 బంతుల్లో 29; 4 ఫోర్లు), క్లాసెన్ (10 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), జాన్సెన్ (14 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) లక్ష్యంవైపు తీసుకెళ్లారు. ఛేజ్ 3, రసెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా సెమీస్ చేరడం ఇది మూడోసారి. 2009, 2014లలో ఆ జట్టు సెమీస్‌లో వెనుదిరిగింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు
అఫ్గానిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: కింగ్స్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

టీమిండియాలో నితీశ్ కుమార్ రెడ్డి

పరాగ్, తుషార్, అభిషేక్ శర్మలకూ చాన్స్ | సీనియర్లకు విశ్రాంతి
శుబ్‌మన్ గిల్‌కు పగ్గాలు | జింబాబ్వే పర్యటనకు భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ఆంధ్ర క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి టీమిండియా జెర్సీ ధరించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) తరఫున చెలరేగిన అతను 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద సీజన్ 2024' అవార్డు కూడా అందుకున్నాడు. ముఖ్యంగా ఈ ఐపీఎల్ అసాంతం నితీశ్ కనబరిచిన నిలకడ, కచ్చితత్వంతో కూడిన షాట్లు, మెరిపించిన మెరుపులు భారత సెలక్టర్లను ఆకట్టుకున్నాయి. దీంతో సీనియర్లు విశ్రాంతి తీసుకుంటున్న జింబాబ్వే పర్యటన కోసం అతన్ని భారత జట్టులోకి ఎంపిక చేశారు. శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని ఈ జట్టులో రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ, తుషార్ దేశ్‌పాండే లాంటి పలు కొత్తముఖాలకు తొలిసారి చోటు కల్పించింది. ప్రస్తుతం రెగ్యులర్ టీమిండియా జట్టు వెస్టిండీస్‌లో జరుగుతున్న టి20 ప్రపంచకప్‌లో తదుపరి సూపర్–8 దశ మ్యాచ్‌ల్ని ఆడుతోంది. ఈ మెగా టోర్నీలో ముందుగా రోహిత్ బృందం అమెరికాలోనే మొత్తం లీగ్ మ్యాచ్‌ల్ని ఆడింది. ఇక ఈ టోర్నీ ముగిసిన వెంటనే జూలై 6 నుంచి జింబాబ్వే టూర్‌లో ద్వైపాక్షిక సిరీస్ మొదలవుతుంది. పూర్తిగా టి20 ఫార్మాట్‌కే పరిమితమైన ఈ పర్యటనలో భారత జట్టు జూలై 6, 7, 10, 13, 14వ తేదీల్లో హరారే వేదికగా ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. మెగా టోర్నీ కోసం ఎంపికైన యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్‌లు ఇద్దరే జింబాబ్వే పర్యటనకు కొనసాగుతున్నారు. స్టాండ్‌బైలుగా ఉన్న గిల్, రింకూ సింగ్, ఖలీల్, అవేశ్ ఖాన్‌లకు చోటిచ్చారు. సీనియర్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, బుమ్రా, రవీంద్ర జడేజా, చహల్, సిరాజ్‌లతో పాటు శివమ్ దూబే, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతినివ్వడం ఆశ్చర్యకరం. బహుశా సీనియర్ సెలక్షన్ కమిటీ దృష్టి అంతా 2026 టి20 ప్రపంచకప్‌పైనే ఉండటం వల్ల పూర్తి స్థాయిలో రిజర్వ్ బెంచ్‌కే అవకాశం ఇచ్చినట్లు కనిపిస్తోంది.

భారత టి20 జట్టు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ సామ్సన్, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండే.

ఒలింపిక్స్‌కు భారత ఆర్చరీ జట్లు అర్హత

- మూడు విభాగాల బరిలో ధీరజ్
- నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్న తరుణ్‌దీప్, దీపిక



తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్, దీపికా కుమారి (ఫైల్)

న్యూఢిల్లీ: మూడు క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా వీలుకాకపోయినా వరల్డ్ ర్యాంకింగ్ ఆధారంగా భారత పురుషుల, మహిళల ఆర్చరీ జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా ఇప్పటికే ఒలింపిక్ బెర్త్‌లు దక్కించుకున్న 10 జట్లను మినహాయించి... వరల్డ్ ర్యాంకింగ్స్‌లో రెండు అత్యుత్తమ జట్లకు మిగిలిన రెండు బెర్త్‌లను కేటాయించారు. పురుషుల విభాగంలో భారత్, చైనా... మహిళల విభాగంలో భారత్, ఇండోనేసియా జట్లకు ఈ అవకాశం లభించింది. ఫలితంగా వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో, వ్యక్తిగత విభాగాల్లో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ పారిస్ ఒలింపిక్స్‌లో మూడు విభాగాల్లో (టీమ్, వ్యక్తిగత, మిక్స్‌డ్) పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. 44 ఏళ్ల తరుణ్‌దీప్ రాయ్... మాజీ నంబర్‌వన్ దీపికా కుమారి నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనున్నారు. మహిళల వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ విభాగంలో భజన్ కౌర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది.

భారత పురుషుల ఆర్చరీ జట్టు: తరుణ్‌దీప్ రాయ్, బొమ్మదేవర ధీరజ్, ప్రవీణ్ జాదవ్. **భారత మహిళల ఆర్చరీ జట్టు:** దీపికా కుమారి, భజన్ కౌర్, అంకిత.

సినిమా

వైజయంతి... ఒక యుద్ధం!


విజయశాంతి

పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ వైజయంతిగా 'కర్తవ్యం' (1990)లో విజయశాంతి నటనను అంత సులువుగా మరచిపోలేం. లేడీ అమితాబ్ అనిపించుకున్న ఈ యాక్షన్ స్టార్ మళ్లీ పోలీసాఫీసర్ వైజయంతిగా కనిపించనున్నారు. కల్యాణ్‌రామ్ హీరోగా రూపొందుతున్న చిత్రంలోనే వైజయంతి పాత్రలో కనిపించనున్నారు విజయశాంతి. సోమవారం (జూన్ 24) విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె లుక్, క్యారెక్టర్ గురించి ఓ వీడియోను విడుదల చేశారు. చీరకట్టులో హుందాగా, ఖాకీ దుస్తుల్లో పవర్‌ఫుల్‌గా విజయశాంతి కనిపించగా, 'వైజయంతి ఐపీఎస్... తను పట్టుకుంటే పోలీస్ తుపాకికే ధైర్యం వస్తుంది... వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది... తానే ఒక యుద్ధం... నేనే తన సైన్యం...' అంటూ ఆమె పాత్ర గురించి కల్యాణ్ రామ్ తన వాయిస్ ఓవర్‌తో ఆ వీడియోలో వివరించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

సల్మాన్ రేస్‌లో లేరా?



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ 'రేస్'లో లేరా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. 'రేస్' మూవీ ఫ్రాంఛైజీలో ఇప్పటికే మూడు సినిమాలు (2008లో 'రేస్', 2013లో 'రేస్ 2', 2018లో 'రేస్ 3') వచ్చి, బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. దీంతో ఈ ఫ్రాంఛైజీలో రానున్న నాలుగో సినిమాపై ఫుల్ క్రేజ్ నెలకొంది. 'రేస్, రేస్ 2' చిత్రాలకు అబ్బాస్–మస్తాన్ దర్శకత్వం వహించగా, 'రేస్ 3'కి రెమో డిసౌజా దర్శకత్వం వహించారు. 'రేస్ 3'లో సల్మాన్ ఖాన్, అనీల్ కపూర్, బాబీ డియోల్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, డైసీ షా కీలక పాత్రలు పోషించారు. 2018 రంజాన్ సందర్భంగా రిలీజైన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో 'రేస్ 4' పై ఎలాంటి అప్‌డేట్ వస్తుందా? అని ప్రేక్షకులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణకు నిర్మాత రమేశ్ ఎస్. తౌరానీ ఓ స్పష్టత ఇచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ– ''రేస్' ఫ్రాంఛైజీలో రానున్న నాలుగో చిత్రానికి ఇప్పటికే కథ సిద్ధంగా ఉంది. ఇందులో నూతన నటీనటులు ఉంటారు. 'రేస్ 4'లో సల్మాన్ ఖాన్ భాగమవుతాడా? లేదా అనేది ఇప్పుడే చెప్పలేను. ఈ మూవీకి దర్శకుడు ఎవరన్నది కూడా ఇంకా నిర్ణయించలేదు. ఈ ఏడాది చివరికల్లా ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళుతుంది'' అన్నారు. మరి 'రేస్ 4'లో సల్మాన్ భాగమవుతారా? లేదా అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

విశ్వంభరతో వినాయక్


చిరంజీవి, వశిష్ఠ, వీవీ వినాయక్

చిరంజీవి టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సెట్‌కి వెళ్లారు దర్శకుడు వీవీ వినాయక్. దాదాపు 20 ఏళ్ల క్రితం చిరంజీవి హీరోగా వినాయక్ దర్శకత్వం వహించిన 'ఠాగూర్' (2003) చిత్రం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అప్పట్నుంచీ చిరంజీవి–వినాయక్ మధ్య మంచి అనుబంధం ఉంది. సోమవారం 'విశ్వంభర' సెట్‌కి వెళ్లిన వినాయక్ చిత్రదర్శకుడు వశిష్ఠకి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు చిరంజీవితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఇక ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్‌గా తెరకెక్కుతున్న 'విశ్వంభర'లో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె. నాయుడు.

కొంతకాలం గడిచింది... చివరికి..!


నివేదా థామస్

దక్షిణాదిలో తనకంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు మలయాళ బ్యూటీ నివేదా థామస్. నాని హీరోగా నటించిన 'జెంటిల్‌మన్' (2016) మూవీతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 'నిన్ను కోరి, జై లవ కుశ, బ్రోచేవారెవరురా, వకీల్ సాబ్' వంటి పలు సినిమాల్లో నటించారు. 2022లో విడుదలైన 'శాకిని డాకిని' మూవీ తర్వాత మరో తెలుగు చిత్రంలో నటించలేదు నివేద. అయితే తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. 'చాలా కాలమైంది.. బట్.. చివరికి.. ' అంటూ లవ్ ఎమోజీని జత చేసి సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు నివేద. లవ్ సింబల్ పెట్టారు కాబట్టి ఇది ప్రేమకు సంబంధించిన వార్త అని, నివేద ఎంగేజ్‌మెంట్ అయిందని, తన పెళ్లి కబురు గురించే ఆ పోస్టు పెట్టారని నెటిజన్లు, ఆమె అభిమానులు పోస్టులు పెడుతున్నారు. కొందరేమో తన కొత్త సినిమా ప్రకటన గురించి అయి ఉంటుందని ఊహిస్తున్నారు. అలాగే ప్రస్తుతం కొత్త సినిమాలేవీ లేకపోవడంతో నివేద పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్నారనే వారూ లేకపోలేదు. మరి ఆమె పోస్ట్‌కి అర్థం ఏంటి? అనేది నివేదానే చెబితేనే తెలుస్తుంది.

జూలైలో డార్లింగ్


ప్రియదర్శి, నభా నటేశ్

'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ అధినేతలు కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన తాజా చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' అన్నది ట్యాగ్‌లైన్. ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటించారు. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బ్రహ్మానందం, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించారు. కాగా ఈ చిత్రాన్ని జూలై 19న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'డార్లింగ్'. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే కంటెంట్ మా సినిమాలో ఉంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కెమెరా: నరేశ్ రామదురై.

మాస్ రాధా బాయ్


మన్నారా చోప్రా

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. బాలీవుడ్ బ్యూటీ మన్నారా చోప్రా ఈ చిత్రంలో ఓ వైవిధ్యమైన పాత్రతో పాటు ఒక స్పెషల్ సాంగ్‌లో నటించారు. మన్నారాపై చిత్రీకరించిన 'రాధా బాయ్...' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని విడుదల చేశారు మేకర్స్. భోలే షావలి సాహిత్యం అందించి, సంగీతం అందించిన ఈ పాటని శ్రావణ భార్గవి ఆలపించారు. ''తిరగబడర సామీ'లో యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే యాక్షన్ ఉన్నాయి. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి స్పందన వచ్చింది. 'రాధా బాయ్...' పాటలోని మన్నారా చోప్రా మాస్ డ్యాన్స్ ఆకట్టుకుంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి యం.ఎన్, సంగీతం: జేబీ–భోలే షావలి.

ముక్కోణపు ప్రేమకథకు ఓకే?


శ్రీలీల

యంగ్ బ్యూటీ శ్రీలీల తెలుగులో దూసుకెళుతున్నారు. ఇక ఆమె బాలీవుడ్ ఎంట్రీ గురించి ఏదో ఒక వార్త ప్రచారంలోకి వస్తూనే ఉంది. కొన్ని రోజుల క్రితం సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీ ఖాన్ నటించనున్న ఓ హిందీ చిత్రం ద్వారా శ్రీలీల బాలీవుడ్ అరంగేట్రం జరగనుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. తాజాగా హిందీలో ఆమె తొలి చిత్రం ఇది కాదన్నట్లుగా మరో వార్త వైరల్‌గా మారింది. వరుణ్ ధావన్ హీరోగా రూపొందనున్న చిత్రం ద్వారా హీరోయిన్‌గా శ్రీలీల బాలీవుడ్ తెరపై కనిపించనున్నారన్నది ఆ వార్త సారాంశం. ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుందని టాక్. శ్రీలీల ఓ హీరోయిన్‌గా, మృణాల్ ఠాకూర్ మరో హీరోయిన్‌గా నటిస్తారట. కామెడీ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని దర్శకుడు డేవిడ్ ధావన్ తెరకెక్కించనున్నారని సమాచారం. జూలై నెల చివర్లో చిత్రీకరణ ఆరంభించి, అక్టోబర్‌లో సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారట. మరి... శ్రీలీలకు హిందీలో ఇదే తొలి చిత్రం అవుతుందా? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే మరో నెల ఆగాల్సిందే.

సాక్షి బిజినెస్
మంగళవారం
25-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	131	77,341
నిఫ్టీ ▲	37	23,538

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,562	▽ 127
డోజోన్స్	39,412	▽ 125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,282	▲ 44
డాక్స్	18,326	▲ 162
షాంఘై	2,963	▽ 35
నికాయ్	38,805	▲ 208

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,615
బంగారం (99.5 స్వచ్ఛత)	71,328
వెండి (కేజీ)	88,671

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.08	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.42	106.98
€	యూరో	ఎస్‌బీఐ	88.21	90.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.10	53.24
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.50	56.43
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.23	63.98
SAR	సౌదీ రియాల్	[illegible]	21.25	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	20.96	22.64
¥	చైనా యువాన్	[illegible]	10.38	12.46

హీరో వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ఎంపిక చేసిన మోటార్ సైకిల్స్, స్కూటర్స్ ధరలను రూ.1,500 వరకు పెంచింది. సవరించిన ధరలు జూలై 1 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ సోమవారం ప్రకటించింది. తయారీ వ్యయం అధికం అయినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు హీరో మోటోకార్ప్ వెల్లడించింది. మే నెలలో సంస్థ ఎగుమతులతో కలిపి మొత్తం 4,98,123 యూనిట్లు విక్రయించింది. 2023 మే నెలతో పోలిస్తే ఇది 5 శాతం తగ్గుదల.

షారుఖ్‌తో ముత్తూట్ ఫిన్‌కార్ప్ 'బుక్ మై గోల్డ్ లోన్' ప్రచారం

హైదరాబాద్: కస్టమర్లకు మరింత సౌకర్యవంతంగా బంగారు రుణాలు చేరువ చేసేందుకు ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ 'బుక్ మై గోల్డ్ లోన్' టెలివిజన్ వాణిజ్య ప్రకటన ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో కంపెనీ కొత్త బ్రాండ్ అంబాసిడర్ నటుడు షారుఖ్ ఖాన్ నటించారు. 80869 80869 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి 'తక్షణమే ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా గోల్డ్ లోన్ బుక్ చేసుకోండి' అంటూ షారుఖ్ చేసిన ప్రచారం ప్రతి భారతీయుడికి చేరుతుందని సంస్థ సీఈఓ షాజీ వర్గీస్ తెలిపారు. కస్టమర్లకు ఆర్థిక సౌలభ్యాన్ని చేకూర్చడంతో పాటు వారి ఆంకాక్షలను నెరవేర్చుకునేందుని తగిన శక్తిని తమ రుణాలు ఇస్తాయని వర్గీస్ ఆశాభావం వ్యక్తం చేశారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

ఇండస్‌లో అదనపు వాటాపై కన్ను



3 శాతం కొనుగోలుకి ఎయిర్‌టెల్ చర్చలు

ముంబై: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్.. టెలికం టవర్ల కంపెనీ ఇండస్ టవర్స్‌లో వాటాను పెంచుకోనుంది. ఇందుకు వీలుగా 3 శాతం అదనపు వాటా కొనుగోలుకి వొడాఫోన్ గ్రూప్‌తో చర్చలకు తెరతీసినట్లు తెలుస్తోంది. నిధుల సమీకరణలో భాగంగా యూకే గ్రూప్ వొడాఫోన్ గత వారం ఇండస్‌లో 19% వాటాను విక్రయించింది. ఆ సమయంలో 1% వాటాను సొంతం చేసుకోవడం ద్వారా ఇండస్‌లో వాటాను ఎయిర్‌టెల్ 49 శాతానికి పెంచుకుంది. కాగా.. ఇండస్‌లో మరో 3% వాటాను కొనుగోలు చేస్తే ఎయిర్‌టెల్ వాటా 52 శాతానికి బలపడనుంది. వెరసి మెజారిటీ వాటాదారుగా అవతరించనుంది. ఇందుకు ప్రస్తుతం వొడాఫోన్ పీఎల్‌సీతో ఎయిర్‌టెల్ చర్చలు నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మరోసారి ఎయిర్‌టెల్‌కు 3% వాటాను విక్రయిస్తే ఇండస్‌లో వొడాఫోన్ వాటా 3.1%కి పరిమితంకానుంది. కాగా, ఎయిర్‌టెల్‌కు గల డేటా సెంటర్ల బిజినెస్ ఎనెక్స్‌ట్రాతో ఇండస్ టవర్స్‌ను విలీనం చేసే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఎయిర్‌టెల్ షేరు స్వల్పంగా బలపడి రూ. 1,418 వద్ద ముగిసింది.

సన్ ఫార్మాతో టారో విలీనం

డీల్ విలువ రూ. 2,900 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ హెల్త్‌కేర్ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్స్‌తో టారో ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ విలీనమైంది. విలీన ఒప్పందం విలువ 34.77 కోట్ల డాలర్లు(సుమారు రూ. 2,900 కోట్లు)కాగా.. విలీనాన్ని పూర్తి చేసినట్లు సన్ ఫార్మా తాజాగా వెల్లడించింది. విలీనంలో భాగంగా టారోకు చెందిన మిగిలిన మొత్తం(ఔట్‌స్టాండింగ్) షేర్లను సొంతం చేసుకున్నట్లు తెలియజేసింది. ఇప్పటికే అనుబంధ సంస్థలుసహా సన్ ఫార్మా.. టారోలో మెజారిటీ వాటాను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. దీంతో టారో ప్రైవేట్ కంపెనీగా మారడంతోపాటు.. సన్ ఫార్మాకు పూర్తి అనుబంధ సంస్థగా అవతరించింది. విలీనం రెండు సంస్థలకూ మేలు చేకూర్చగలదని సన్ ఫార్మా చైర్మన్, ఎండీ దిలీప్ సంఘ్వీ పేర్కొన్నారు. తద్వారా రెండు కంపెనీల సామర్థ్యాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వీలుంటుందని తెలియజేశారు. గతేడాది మే నెలలో టారో ఫార్మా బోర్డుకి మొత్తం ఔట్‌స్టాండింగ్ షేర్ల కొనుగోలు ప్రతిపాదనతో సన్ ఫార్మా లేఖ రాసింది. ఒక్కో షేరునీ 38 డాలర్ల చొప్పున సొంతం చేసుకునేందుకు నాన్‌బైండింగ్ ప్రతిపాదన చేసింది.



సన్ ఫార్మా షేరు బీఎస్‌ఈలో 2% ఎగసి రూ. 1,495 వద్ద క్లోజైంది.

దేశానికి విదేశీ నిధుల దన్ను

- క్యూ4లో కరెంట్ అకౌంట్ మిగులు 0.6 శాతం
- విలువల్లో 5.7 బిలియన్ డాలర్లు



ముంబై: భారత్ కరెంట్ అకౌంట్ మార్చితో ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (జనవరి–మార్చి) సానుకూల ఫలితాన్ని నమోదుచేసింది. ఇదే కాలం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువల్లో పోల్చి 0.6 శాతం మిగులును నమోదుచేసుకుంది. విలువ రూపంలో ఇది 5.7 బిలియన్ డాలర్లు. సేవల రంగం నుంచి ఎగుమతుల పెరుగుదల, ఇతర దేశాల్లో ఉండే భారతీయులు స్వదేశానికి పంపిన భారీ నిధులు (రెమిటెన్స్‌లు) ఇందుకు ప్రధాన కారణం. 2023 జనవరి–మార్చి సమయంలోనూ (0.2 శాతం, విలువలో 1.3 బిలియన్ డాలర్లు), తాజా సమీక్షా త్రైమాసికం ముందు త్రైమాసికం (2023 అక్టోబర్–డిసెంబర్‌లో 1 శాతం, విలువలో 8.7 బిలియన్ డాలర్లు) లోనూ దేశ కరెంట్ అకౌంట్ 'లోటు'ను నమోదుచేసుకోవడం గమనార్హం.

2022–23కన్నా బెటర్: 2023–24 ఆర్థిక సంవత్సరం మొత్తంగా చూస్తే కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) 23.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఈ కాలం జీడీపీ విలువలో ఇది 0.7%కి సమానం. 2022–23తో పోల్చితే (జీడీపీ విలువల్లో 2 శాతం, క్యాడ్ 67 బిలియన్ డాలర్లు) ఇది చాలా తక్కువ.

కరెంట్ అకౌంట్ అంటే..: నిర్దిష్ట కాలంలో దేశానికి వచ్చీ–పోయే విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాసాలను– కరెంట్ అకౌంట్ ప్రతిబింబిస్తుంది. చెల్లింపులకన్నా అధిక నిధులు దేశంలోకి వస్తే దానిని కరెంట్ అకౌంట్ మిగులుగా, దేశంలోనికి వచ్చిన నిధులకంటే చెల్లింపులు ఎక్కువగా ఉంటే దానిని కరెంట్ అకౌంట్ లోటుగా పేర్కొంటారు.

క్విక్ కామర్స్.. పోటీకి సై!




- రూ.5,500 కోట్లు సమీకరించిన జెప్టో
- దేశవ్యాప్తంగా భారీ విస్తరణ ప్రణాళిక
- పోటీకి సై అంటున్న ఫ్లిప్‌కార్ట్
- బ్లింకిట్‌కు సవాల్ విసరనున్న సంస్థలు
- ధరల పోటీతోపాటు సేవల నాణ్యతే కీలకం

న్యూఢిల్లీ: ఆర్డర్ చేసిన 10 నిమిషాల్లోనే డెలివరీ చేసే క్విక్ కామర్స్ విభాగంలో మరో విడత పోటీ తీవ్రతరం కానుంది. ఈ విభాగంలో సేవలు అందించే జెప్టో తాజాగా 665 మిలియన్ డాలర్ల (రూ.5,520 కోట్లు) నిధులు సమీకరించి, కార్యకలాపాల విస్తరణపై దృష్టి సారిస్తుండడంతో క్విక్ కామర్స్ మార్కెట్ మరోసారి వేడెక్కనున్నట్టు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ పోటీ వినియోగదారులకు కలసి రానుంది. ఈ విభాగంలో బ్లింకిట్ 40% వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కూడా సేవలు అందిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ సైతం క్విక్ డెలివరీ సేవల్లోకి వచ్చే నెలలో ఎంట్రీ ఇవ్వనుంది. దీంతో బ్లింకిట్ మార్కెట్ వాటాను కొల్లగొట్టేందుకు జెప్టో, ఫ్లిప్‌కార్ట్ ధరల పోటీని (తగ్గింపులు) షురూ చేయవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మార్కెట్ లీడర్‌గా ఉన్న బ్లింకిట్‌కు తీవ్ర పోటీ ఎదురుకానుంది.

ఉత్తరాదిపై జెప్టో దృష్టి

బ్లింకిట్‌కు కీలకంగా ఉన్న ఉత్తరాది మార్కెట్లో జెప్టో మరింత దూకుడుగా వ్యవహరించనున్నట్టు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు తెలిపాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో కార్యకలాపాల విస్తరణకు జెప్టో ప్రాధాన్యం ఇవ్వొచ్చని, తాజాగా సమీకరించిన నిధులను ఇందుకు వినియోగించొచ్చని ఆ వర్గాలు వెల్లడించాయి. తాజా నిధుల సమీకరణ ప్రణాళికల్లో ఇది భాగంగా ఉన్నట్టు చెప్పాయి. ఫ్లిప్‌కార్ట్ బెంగళూరు నుంచి తన క్విక్ కామర్స్ సేవలను వచ్చే నెలలో ఆరంభించనుంది. ఇప్పటికే బెంగళూరులో ఎంపిక చేసిన ప్రాంతాల్లో డార్క్ స్టోర్లను ఏర్పాటు చేసిన ఈ వాల్‌మార్ట్ కంపెనీ, తన సేవలను పరీక్షిస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌కు ఇటీవలే గూగుల్ నుంచి 950 మిలియన్ డాలర్ల (రూ.7,885 కోట్లు) పెట్టుబడులు రావడం తెలిసిందే. ఈ నిధులను క్విక్ కామర్స్‌పై వెచ్చించే వెసులుబాటు లభించింది. ''కస్టమర్లు 10 నిమిషాలా లేదా 20 నిమిషాలా అన్న దానికి ప్రాధాన్యం ఇవ్వరు. సమీప కాలంలో పోటీ సంస్థలు తమ నిధుల అండతో బ్లింకిట్‌కు సవాల్ విసరొచ్చు. మార్కెట్‌ను షేక్ చేసే అవకాశం అయితే ఉంది'' అని ఈ మార్కెట్‌ను పరిశీలించే ఓ అనలిస్ట్ తెలిపారు. వేగవంతమైన డెలివరీ కాకుండా ధరల ద్వారానే ఈ ప్లాట్‌ఫామ్‌లు కస్టమర్లను ఆకర్షించగలవని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. బ్లింకిట్ మాతృసంస్థ జొమాటో వద్ద రూ.12వేల కోట్లకు పైనే నగదు ఉండగా.. స్విగ్గీ ఐపీవో ద్వారా 450 మిలియన్ డాలర్లు సమీకరించే ప్రణాళికలతో ఉంది.



రెట్టింపు మార్కెట్

''ఏదో ఒక ప్రాంతంలో కాకుండా దేశవ్యాప్తంగా మా కార్యకలాపాలను రెట్టింపు చేయనున్నాం. భారీ తగ్గింపులతో పోటీపడాలని అనుకోవడం లేదు. స్థిరమైన వృద్ధి అన్నది డిస్కౌంట్లతో రాదు. కస్టమర్లకు తగినంత విలువను అందించడం ద్వారానే సాధ్యపడుతుంది'' అని జెప్టో అధికార ప్రతినిధి తెలిపారు. ఈ విభాగంలో వృద్ధి అవకాశాలు గణనీయంగా ఉన్నందున కొత్తగా సమీకరించే నిధులను ఈ విభాగంలోని కంపెనీలు కార్యకలాపాల విస్తరణపై వెచ్చించొచ్చని ఎలారా క్యాపిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కరణ్ తురాణి పేర్కొన్నారు.

నష్టాల్లోంచి లాభాల్లోకి..

ఆటో, విద్యుత్ షేర్లకు డిమాండ్ ● 23,500 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 464 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 131 పాయింట్ల లాభంతో 77,341 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 151 పాయింట్లు క్షీణించింది. ఆఖరికి 37 పాయింట్లు పెరిగి 23,538 వద్ద నిలిచింది. అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం నష్టాలతో ప్రారంభమయ్యాయి. విద్యుత్, ఆటో, పారిశ్రామిక, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మిడ్ సెషన్ కల్లా లాభాల్లోకి మళ్లాయి. తదుపరి పరిమిత శ్రేణిలో ఒడిదుడుకులతో ట్రేడవుతూ చివరికి లాభాలతో గట్టెక్కాయి. వాల్యుయేషన్ల ఆందోళనలు ఉన్నప్పటికీ.., ఆర్థిక వృద్ధిపై ఆశలతో ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.37%, 0.27 శాతం పెరిగాయి. మెటల్, కమోడిటీ, ఐటీ, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియా మార్కెట్లు బలహీనంగా, యూరప్ సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి.



→ జీఎస్‌టీ మండలి ఎరువులపై జీఎస్‌టీ 18% నుంచి 5%కి తగ్గింపు ప్రతిపాదనను మంత్రుల బృందానికి (జీవోఎం) సిఫార్సు చేయడంతో ఈ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావన్‌కోర్ 10%, నేషనల్ ఫెర్టిలైజర్స్ 7%, రాష్ట్రీయ కెమికల్స్ 6.50%, జీఎస్ఎఫ్‌సీ 3.50%, టాటా కెమికల్స్ 2% చొప్పున నష్టపోయాయి.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడా, వడోదరలో 168 పోస్టులు

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన కార్యాలయం.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా బీవోబీ శాఖల్లో కార్పొరేట్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ క్రెడిట్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 168.
» పోస్టుల వివరాలు: ఫారెక్స్ అక్విజిషన్–రిలేషన్‌షిప్ మేనేజర్–11, ఫారెక్స్ అక్విజిషన్–రిలేషన్‌షిప్ మేనేజర్–04, క్రెడిట్ అనలిస్ట్–80, రిలేషన్‌షిప్ మేనేజర్–66, సీనియర్ మేనేజర్ బిజినెస్ ఫైనాన్స్–04, చీఫ్ మేనేజర్ ఇంటర్నల్ కంట్రోల్స్–03.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎస్ /సీఎఫ్ఏ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 12.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.07.2024.
» వెబ్‌సైట్: https://www.bankofbaroda.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, వడోదరలో 459 పోస్టులు

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన కార్యాలయం.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన దేశవ్యాప్తంగా బీవోబీ శాఖల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 459.
» పోస్టుల వివరాలు: సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఈ–వెల్త్ రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ మేనేజర్ ఎంఎస్ఎంఈ, మేనేజర్ ఎంఎస్ఎంఈ, గ్రూప్ హెడ్, టెరిటరీ హెడ్, ప్రైవేట్ బ్యాంకర్ రేడియన్స్ ప్రైవేట్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్,ఎంఎస్ఎంఈ, జోనల్ సేల్స్ మేనేజర్ ఎంఎస్ఎంఈ, సీనియర్ డెవలపర్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీసీఏ, బీఈ/ బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిప్లొమా, సీఏ/సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, ఇతర పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 12.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.07.2024.
» వెబ్‌సైట్: https://www.bankofbaroda.in

బెల్, హైదరాబాద్‌లో 32 పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఎలక్ట్రానిక్.. వార్‌ఫేర్ నావల్ సిస్టమ్స్ ఎస్‌బీయూలో శాశ్వత ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 32
» పోస్టుల వివరాలు: ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ–12, టెక్నీషియన్ సి–17, జూనియర్ అసిస్టెంట్–03.
» అర్హత: ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీకాం, బీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
» వేతనం: ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ పోస్టుకు రూ.24,500 నుంచి రూ.90,000. టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు రూ.21,500 నుంచి రూ.82,000.
» వయసు:28 ఏళ్లు మించకూడదు
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.07.2024.
» వెబ్‌సైట్:https://bel-india.in

ఫైన్ ఆర్ట్స్.. కెరీర్ షైనింగ్!

» ఎఫ్ఏడీఈఈ–2024 నోటిఫికేషన్ విడుదల
» జేఎన్ఏఎఫ్ఏయూలో ఫైన్ ఆర్ట్స్ కోర్సులు
» ఎఫ్ఏడీఈఈలో స్కోర్ ఆధారంగా ఎంపిక
» కోర్సులు పూర్తి చేసుకుంటే వినూత్న కెరీర్స్

చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, శిల్పకళ.. వంటి ఫైన్ ఆర్ట్స్ కోర్సులకు వేదికగా నిలుస్తోంది.. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ! ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఏడీఈఈ) నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా జేఎన్ఏఎఫ్ఏయూ పరిధిలోని ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో చేరొచ్చు!! తాజాగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎఫ్ఏడీఈఈ-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో... ఎఫ్ఏడీఈఈ వివరాలు, ఎంపిక విధానం, అందుబాటులో ఉన్న కోర్సులు, సీట్లు, రాత పరీక్షకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

కొంత మంది విద్యార్థులకు చిన్నప్పటి నుంచి కళలు అంటే ఆసక్తి ఉంటుంది. వారు ఎప్పుడూ పెయింటింగ్, ఫొటోగ్రఫీ వంటి వాటిపై మక్కువ చూపుతారు. అలాంటి విద్యార్థులు తమకు ఇష్టమైన విభాగాల్లో కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవడానికి మార్గంగా నిలుస్తున్నాయి ఫైన్ ఆర్ట్స్ కోర్సులు.

ఫైన్ ఆర్ట్స్‌కు ప్రత్యేకం.. జేఎన్ఏఎఫ్ఏయూ

ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించి పలు విభాగాల్లో బ్యాచిలర్, పీజీ స్థాయి కోర్సులను అందించడంలో హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ప్రత్యేకత గుర్తింపు ఉంది. ఈ వర్సిటీలోని ఫైన్ ఆర్ట్స్ విభాగం పరిధిలో ప్రతి ఏటా పలు బ్యాచిలర్ కోర్సులకు ప్రవేశాలు చేపడతారు. ఇందుకోసం ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ను నిర్వహిస్తారు. ఇందులో స్కోర్ ఆధారంగా ఆయా విభాగాల్లో సీట్లు భర్తీ చేస్తారు. ప్రస్తుతం 2024–25 ప్రవేశాలకు ఎఫ్ఏడీఈఈ నోటిఫికేషన్ విడుదలైంది.

అర్హతలు

- ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.

ఆరు కోర్సులు.. 275 సీట్లు

- ప్రస్తుతం ఎఫ్ఏడీఈఈ ద్వారా 6 కోర్సుల్లో 275 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎఫ్ఏ అప్లయిడ్ ఆర్ట్స్ అండ్ విజువల్ కమ్యూనికేషన్–రెగ్యులర్ సీట్లు –35; సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–15.
- బీఎఫ్ఏ పెయింటింగ్–రెగ్యులర్ సీట్లు–20; సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–15.
- బీఎఫ్ఏ స్కల్ప్చర్–రెగ్యులర్ సీట్లు–10, సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–10.
- బీఎఫ్ఏ(యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్) –సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు –60.
- బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ అండ్ విజువల్ కమ్యూనికేషన్–రెగ్యులర్ సీట్లు–30,సెల్ఫ్ సపోర్టింగ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–20.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(ఇంటీరియర్ డిజైన్)–సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–60.

ఎఫ్ఏడీఈఈ ఇలా

- ఫైన్ ఆర్ట్స్ విభాగంలో పలు కోర్సులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. ఎఫ్ఏడీఈఈని కూడా ఆయా కోర్సులకు అనుగుణంగా వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్–(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్ అండ్ యానిమేషన్) పరీక్షలో.. పేపర్ ఏ మెమొరీ డ్రాయింగ్ అండ్ కలరింగ్ వంద మార్కులు–90 నిమిషాలు, పేపర్ బి ఆబ్జెక్టివ్ టైప్ 50 మార్కులు–50 నిమిషాలు, పేపర్ సి ఆబ్జెక్ట్ డ్రాయింగ్ వంద మార్కులు–90 నిమిషాల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.
- బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ పరీక్షలో.. పేపర్ డి కంపోజిషన్ అండ్ విజువల్ కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ 100 మార్కులు–90 నిమిషాలు, పేపర్ ఇ ఆబ్జెక్టివ్ టైప్ 50 మార్కులు–50 నిమిషాల వ్యవధిలో పరీక్ష ఉంటుంది.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్)లో.. పేపర్ ఎఫ్ 200 మార్కులకు 3 గంటల వ్యవధిలో నిర్వహిస్తారు.

ఈ అంశాలపై దృష్టి

ఎఫ్ఏడీఈఈలో మంచి స్కోర్ కోసం అభ్యర్థులు పేపర్ల వారీగా నిర్దేశిత అంశాలపై దృష్టి పెట్టాలి. డ్రాయింగ్ అండ్ కలరింగ్ స్కిల్స్, ఆబ్జెక్ట్ డ్రాయింగ్ స్కిల్స్, విజువల్ కమ్యూనికేషన్ స్కిల్స్, బేసిక్ ఫొటోగ్రఫీ టెక్నిక్స్, ప్రిన్సిపుల్స్; ఆర్ట్స్ అండ్ డిజైన్‌లో బేసిక్ కాన్సెప్ట్స్, ప్రిన్సిపుల్స్; వెర్బల్, నాన్–వెర్బల్ కమ్యూనికేషన్ స్కిల్స్, కలర్స్ యూసేజ్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.



ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఎందుకంటే.. పరీక్షలో అడిగే ప్రశ్నలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను, విజువల్ థింకింగ్ నైపుణ్యాలను పరిశీలించేలా ఉంటాయి. దీంతో.. ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానిని నిజ జీవిత సంఘటనలతో పోల్చి.. విజువలైజేషన్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా..ఆయా విభాగాల్లో తాజా సాంకేతికత గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూలై 4
- ఎఫ్ఏడీఈఈ పరీక్ష తేదీలు: 2024, జూలై 20, 21
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jnafauadmissions.com

కెరీర్ అవకాశాలు

స్కల్ప్చర్(శిల్ప కళ)

ప్రాచీన కాలం నుంచే వెల్లివిరుస్తున్న ఫైన్ ఆర్ట్స్ విభాగం.. శిల్పకళ. ప్రస్తుతం బీఎఫ్ఏ స్కల్ప్చర్ కోర్సు పూర్తిచేసిన యువతకు ఉపాధి అవకాశాలకు అనుకూలమైన పరిస్థితి నెలకొంది. కోర్సుల అనంతరం కొంతమంది ఇంటి వద్దే శిల్పాలు రూపొందిస్తుంటే.. మరి కొందరు ప్రత్యేకంగా హోం స్టూడియోలు నిర్వహిస్తున్నారు. వీరంతా వ్యాపార సంస్థలు,ప్రభుత్వ ఏజెన్సీలు, వ్యక్తులకు శిల్పాలను సరఫరా చేస్తున్నారు. చక్కటి పరిశీలనా నైపుణ్యం, భావోద్వేగాలు, ఆలోచనలకు రూపం ఇవ్వగలిగే నేర్పు ఉన్నవారికి ఈ కోర్సు చక్కగా సరిపోతుంది.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్)

ఒక ఇంటిని లేదా ఆఫీస్ సముదాయాన్ని లేదా ఒక కట్టడాన్ని అంతర్గతంగా చూడముచ్చటగా, అందంగా తీర్చిదిద్దే నైపుణ్యమే.. ఇంటీరియర్ డిజైన్. ప్రస్తుతం నగరాల్లోని ప్రజలు ఇంటీరియర్ డిజైనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో వీరికి డిమాండ్ పెరుగుతోంది. పలు అంచనాల ప్రకారం–దేశంలో లక్ష మందికిపైగా ఇంటీరియర్ డిజైనింగ్ నిపుణుల కొరత ఉన్నట్లు అంచనా. ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సును పూర్తి చేసుకుంటే.. ఉజ్వల కెరీర్ ఖాయం అని చెప్పొచ్చు. ఫర్నిచర్ డిజైనింగ్, ఎగ్జిబిషన్ డిజైనర్, లైటింగ్ డిజైనర్, కిచెన్ డిజైనర్, ఆర్కిటెక్ట్, ఆర్కిటెక్చరల్ టెక్నాలజిస్టు, ప్రొడక్ట్ డిజైనర్, టెక్స్‌టైల్ డిజైనర్ కొలువుల్లో స్థిరపడవచ్చు.

అప్లయిడ్ ఆర్ట్

ఆర్ట్ డైరెక్టర్ కావాలనుకునేవారికి చక్కటి కోర్సు.. అప్లయిడ్ ఆర్ట్! డ్రాయింగ్, పెయింటింగ్, క్లే మోడలింగ్‌లో బేసిక్స్‌తోపాటు విజువల్ కమ్యూనికేషన్ అండ్ గ్రాఫిక్స్ అంశాలపై మెలకువలు నేర్పుతారు. గ్రాఫిక్ డిజైన్, అడ్వర్టైజింగ్, లోగో డిజైనింగ్ అంశాల్లో ప్రావీణ్యత సంపాదించడం ద్వారా.. సినిమా రంగంలో ఆర్ట్ డైరెక్టర్‌గా, సెట్ డిజైనర్‌గా, విజువలైజర్‌గా అవకాశాలు అందుకోవచ్చు. వస్త్ర పరిశ్రమ, ఆభరణాల డిజైనింగ్, కలినరీ ఆర్ట్, గేమ్ డిజైనర్, యాడ్ ఫిలిం ఏజెన్సీలలో స్టోరీ బోర్డ్ ఆర్టిస్ట్‌గా, క్రియేటివ్ ఆర్ట్ డైరెక్టర్‌గా అవకాశాలు లభిస్తాయి.

పెయింటింగ్ (చిత్రకళ)

ప్రకృతి అందాలకు చూడచక్కని రూపం ఇచ్చే కళ.. పెయింటింగ్. పెయింటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన వారు తమ సృజనాత్మకతను జోడించి అద్భుతమైన పెయింటింగ్స్ రూపొందించే నైపుణ్యం పొందుతారు. పెయింటింగ్‌కు ప్రస్తుతమున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఇది యువతకు మంచి కెరీర్ మార్గంగా నిలుస్తోంది. పెయింటింగ్‌లో ఆయిల్ పెయింట్, వాటర్ కలర్ పెయింట్, ఆక్రిలిక్ పెయింట్, టెంపెరా పెయింట్ వంటి రకాలు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్, సెట్ డిజైనర్, కేంద్రీయ విద్యాలయం, నవోదయ, సైనిక్ స్కూల్ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో చక్కటి అవకాశాలు లభిస్తాయి.

యానిమేషన్

ప్రస్తుతం యానిమేషన్ రంగం వేగంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రజలు వినోదం కోసం తమకు అందుబాటులోనే ఉండే స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ తదితర సాధనాలతోనే యానిమేషన్, గేమింగ్ వంటి వాటిపై ఆసక్తి పెంచుకుంటున్నారు. కాబట్టి యానిమేషన్ కోర్సులు పూర్తిచేసిన వారికి కెరీర్ అవకాశాలకు కొదవుండదని చెప్పొచ్చు. యానిమేషన్‌కు సంబంధించి సినిమాలు, టెలివిజన్, అడ్వర్టైజింగ్ విభాగాలు ప్రధాన ఉపాధి వేదికలు.

ఫొటోగ్రఫీ

ఫొటోగ్రఫీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉజ్వల అవకాశాలు అందుకునే వీలుంది. కోర్సు అభ్యసించే సమయంలో ఫొటోగ్రఫీలో మెళకువలతోపాటు డిజిటల్ ల్యాబ్‌లు, గ్రీన్ మ్యాట్ స్టూడియోలను ఏర్పాటు చేస్తారు. ఫ్యాషన్ ఫొటోగ్రఫీ, ఆటోమొబైల్ ఫొటోగ్రఫీ, కార్పొరేట్ ఫొటోగ్రఫీ, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ విభాగాల్లో చక్కటి అవకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్య

బ్యాచిలర్ స్థాయి ఫైన్ ఆర్ట్స్ కోర్సులతోనే ఉజ్వలమైన ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అలాగే ఉన్నత విద్యపై ఆసక్తి ఉంటే పీజీలోనూ చేరవచ్చు. ఉన్నత విద్య ద్వారా సంబంధిత విభాగాల్లో స్పెషలైజేషన్ కోర్సుల్లో చేరేందుకు వీలవుతుంది. ఉద్యోగంతోపాటు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవచ్చు. సాఫ్ట్‌వేర్,మల్టీనేషనల్ కంపెనీల్లో సైతం అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ పరిశ్రమలు, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీమీడియా, యానిమేషన్ తదితర సంస్థల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

క్లుప్తంగా...

రేపు పాఠశాలలు బంద్



సాక్షి, హైదరాబాద్: సర్కారీ బడుల్లో సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటు స్కూళ్ల ఫీజులు అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని, ప్రైవేటు స్కూళ్లలో బుక్స్, యూనిఫామ్ అమ్మకాలపై కఠినచర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్కూళ్లలో డీఈవో, ఎంఈవోలను నియమించాలని, మధ్యాహ్న భోజనం అవకతవకలపై విచారణ జరపాలని, మెగా డీఎస్సీ ద్వారా 24 వేల ఖాళీలు భర్తీ చేయాలన్న డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఝాన్సీ తెలిపారు.

ముస్తాబాద్ కేజీబీవీలో అడ్మిషన్స్ క్లోజ్

ముస్తాబాద్ (సిరిసిల్ల): కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో సీటు దొరకడం కష్టంగా మారింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేజీబీవీలోని అన్ని తరగతుల్లో సీట్లు భర్తీ కావడంతో ఉపాధ్యాయులు 'అడ్మిషన్స్ క్లోజ్' అని బోర్డు ఏర్పాటు చేశారు. కేజీబీవీల్లో ఉన్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, భోజనం అందుతుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముస్తాబాద్‌లోని కస్తూర్బాలో 6 నుంచి 10వ తరగతి వరకు 200 మంది విద్యార్థులను మాత్రమే చేర్చుకోవాల్సి ఉండగా.. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 230 మందికి చేరింది.

గ్రూప్-1లో 1:100 క్వాలిఫై చేయాలి: బీజేవైఎం

సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పత్తి ప్రకారం క్వాలిఫై చేయాలని బీజేవైఎం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, వెంటనే జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. నిరుద్యోగ సమస్యపై ధర్నా సందర్భంగా పోలీసుల లాఠీచార్జీని ఖండిస్తూ బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వానలకు ఈ వారమే కీలకం..!

- ఇప్పటివరకు చాలా చోట్ల సాధారణం, అంతకన్నా తక్కువ వానలు
- కొన్ని జిల్లాల్లో కొనసాగుతున్న లోటు వర్షపాతం
- బుధవారం నుంచి విస్తారంగా వానలు పడతాయన్న వాతావరణశాఖ
- పంటల సాగుకు సిద్ధమైన రైతాంగం
- సాధారణ స్థాయిలోనే ఉష్ణోగ్రతల నమోదు



సాక్షి, హైదరాబాద్: వర్షాకాలంలో కీలక సమయం ఆసన్నమైంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ నెలాఖరులో కురిసే వర్షాలే.. రాష్ట్రంలో నీటి వనరులకు, పంటల సాగుకు ముఖ్యమని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుకుగా ఉన్నాయని.. బుధవారం నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రుతుపవనాల కదలికలను బట్టి మెజార్టీ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల కుండపోత వానలు పడే అవకాశం ఉంటుందని వివరించారు. పంటల సాగుకు కీలకమైన సమయం కావడంతో రైతులు కూడా ఈ వారం వర్షాలపైనే ఆశలు పెట్టుకున్నారు.

కొన్ని ప్రాంతాల్లోనే వానలతో..

నైరుతి సీజన్‌కు సంబంధించి ఏటా జూన్ 24వ తేదీ నాటికి రాష్ట్రంలో 9.94 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాలి. ఈసారి 12.17 సెంటీమీటర్లు కురిసింది. అంటే సాధారణం కంటే 22 శాతం అధికంగా నమోదైంది. కానీ కొన్ని ప్రాంతాల్లోనే ఎక్కువ వర్షాలు కురవగా.. మెజార్టీ జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. వానలు ఊపందుకోనున్న నేపథ్యంలో.. నెలాఖరు నాటికి ఆయా జిల్లాల్లో వర్షపాతం లోటు భర్తీ అవుతుందని భావిస్తున్నారు. వానల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతాంగం.. సాగుపనులకు సిద్ధమైంది.

రేపటి నుంచి వానలు

నైరుతి రుతుపవనాల కదలికలు సంతృప్తికరంగా ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం నుంచి రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రానికి నైరుతి దిశ నుంచి గాలులు వీస్తున్నాయని.. వర్షాలకు అనుకూల పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి వరుసగా మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు ప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే ఉన్నాయి. ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, రామగుండం ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే ఒక డిగ్రీ అధికంగా నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

ఆరు జిల్లాల్లో అత్యధిక వానలు

రాష్ట్రంలో ఇప్పటివరకు ఆరు జిల్లాల్లో మాత్రమే సమృద్ధిగా వర్షాలు కురిశాయి. హైదరాబాద్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట్ జిల్లాల్లో సాధారణం కంటే 60 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. మహబూబాబాద్, హనుమకొండ, కరీంనగర్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట్, ఖమ్మం జిల్లాల్లో సాధారణం కంటే 20శాతం అధికంగా నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో సాధారణం నుంచి మైనస్ 19 శాతం వరకు వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లాలో లోటు ఎక్కువగా ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా.. 6.2 సెంటీమీటర్ల సగటుకుగాను 15.67 సెంటీమీటర్లు కురిసింది.

దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

- నూతన విద్యుత్ విధానంతో తెలంగాణలో మిగులు విద్యుత్ సాధిస్తాం
- శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పూర్తిస్థాయి ఉత్పత్తి చేపట్టాలి
- జెన్‌కో అధికారులతో సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో అధికారులతో సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సాక్షి, నాగర్‌కర్నూల్: నూతన విద్యుత్ విధానాన్ని అమలు చేసి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని.. మిగులు విద్యుత్ సాధిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో కలసి ఆయన సందర్శించారు. అనంతరం విద్యుత్ ఉత్పత్తిపై జెన్‌కో అధికారులతో సమీక్షించారు. 2030 వరకు తెలంగాణకు కావాల్సిన విద్యుత్ అందుబాటులో ఉందని తెలిపారు. శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్‌లో 2020లో ప్రమాదం జరగ్గా ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంపై ఆరా తీశారు. రూ. 60 కోట్ల విలువైన హైడల్ పవర్ కోసం రూ. 2 కోట్లు ఖర్చు చేసేందుకు వెనకాడొద్దని.. ప్రభుత్వం ఎన్ని నిధులు మంజూరు చేసేందుకైనా సిద్ధంగా ఉందని చెప్పారు. త్వరగా నాలుగో యూనిట్‌కు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో 900 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తి చేసేలా వియర్ సైట్‌ను పునరుద్ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి, మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పర్ణికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు కాల్

బాంబు లేదని తెలియడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. అయితే ఎయిర్‌పోర్ట్ పేరును మెయిల్‌లో ప్రస్తావించకపోవడంతో దేశవ్యాప్తంగా పోలీసు బలగాలు అప్రమత్తమై అన్ని విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా బేగంపేట విమానాశ్రయంలోనూ రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు రంగంలోకి దిగి అణువణువూ జల్లెడ పట్టాయి. ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని మూడు గంటలకుపైగా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు లేదని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.



బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీల్లో పోలీసులు

మొన్న ఘాంసిమియాగూడ.. నిన్న శంకరాపురంలో

చిరుత సంచారంతో స్థానికుల్లో ఆందోళన

శంషాబాద్ రూరల్: రెండు రోజులుగా స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్న చిరుతపులి మరో గ్రామంలో సంచరించినట్లు ఆనవాళ్లను గుర్తించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ఘాంసిమియాగూడలో రెండు రోజుల కిందట పొలాల వద్ద దూడ, కుక్కలపై దాడి చేసిన చిరుత.. ఆదివారం రాత్రి శంకరాపురం శివారులోని హోటల్, ఫాంహౌస్‌ల వద్ద తిరిగినట్లు సీసీ కెమెరాల ఫుటేజీల్లో రికార్డు అయింది. కాగా, చిరుతపులి సంచరించినట్లు చెపుతున్న ప్రాంతాల్లో పాద ముద్రలను పరిశీలించిన అటవీ అధికారులు.. ఇప్పటివరకు అది ఏ జంతువన్న విషయంపై కచ్చితంగా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. దాడి చేసిన జంతువు, సీసీ ఫుటేజీల్లో కనిపిస్తున్న జంతువు ఒక్కటే అయినప్పటికీ అది చిరుత పులి కాకపోవచ్చని, హైనా అయి ఉంటుందని భావిస్తున్నారు. శంకరాపురం శివారులో రోడ్డు పక్కన ఉన్న ఓ హోటల్ వద్ద తచ్చాడుతూ కనిపించిన చిరుత.. తర్వాత సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో కనిపించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఫారెస్టు అధికారులు ఇర్షాద్, హరిబాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుత సంచారానికి సంబంధించిన ఆనవాళ్లను పరిశీలించిన తర్వాత ఘాంసిమియాగూడ చెరువు, అలాగే శివారులోని పంట పొలాల్లో రెండు బోన్లను ఏర్పాటు చేశారు. బోన్లలో ఎర కోసం కుక్కలను పెట్టారు.




చిరుత కోసం ఏర్పాటు చేసిన బోను ఇదే.

స్థానికుల్లో ఆందోళన..

చిరుత సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోజుకోచోట చిరుత కనిపిస్తున్న వార్తలు వెలుగు చూస్తుండటంతో వారిలో భయాందోళన నెలకొంది. రాత్రి వేళల్లో బయటకు వెళ్లడానికి జంకుతున్నారు.

టీసీ పొందడం విద్యార్థుల హక్కు

- ఫీజు బకాయిల పేర సర్టిఫికెట్‌ను పాఠశాలలు నిరాకరించలేవు
- పిటిషనర్లకు 2 వారాల్లో టీసీ అందజేయాలని హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఒక పాఠశాలలో ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ పొంది మరో పాఠశాలలో చేరడం విద్యార్థుల హక్కు అని, ఫీజు బకాయిలు సహా ఇతర ఏ కారణాలున్నా పాఠశాలల యాజమాన్యాలు దాన్ని అడ్డుకోలేవని హైకోర్టు తేల్చిచెప్పింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన సిద్ధార్థ హైస్కూల్ తమ పిల్లలకు టీసీలు ఇవ్వడం లేదని, దీనిపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ గోదావరిఖనికి చెందిన దినేశ్‌తో పాటు 42 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫీజుతో పాటు అదనంగా మరికొంత చెల్లించాలని వేధిస్తున్నారని.. వెంటనే టీసీలు ఇచ్చేలా సదరు పాఠశాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.సోమ శ్రీనాథ్ రెడ్డి, పాఠశాల తరఫున న్యాయవాది ఎంపీకే ఆదిత్య హాజరై వాదనలు వినిపించారు. వారి వాదనలు విన్న న్యాయమూర్తి.. టీసీ విద్యార్థి ఆస్తి అని, దానిపై తాత్కాలిక హక్కు ఎవరికీ ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులు ఫీజు బకాయి ఉంటే సంబంధిత కోర్టును ఆశ్రయించాలి తప్ప, సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించే హక్కు పాఠశాలలకు లేదన్నారు. విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టలేరని, పిటిషనర్ల పిల్లలకు 2 వారాల్లో టీసీలు జారీ చేయాలని సిద్ధార్థ స్కూల్‌ను న్యాయమూర్తి ఆదేశించారు.

ట్రిపుల్‌ఐటీలో ఎంఎస్ కోర్సు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ ద్వారా కొత్త పార్ట్‌టైమ్ ఇండస్ట్రీ స్పాన్సర్డ్ మాస్టర్స్ (ఎంఎస్) కోర్సు దరఖాస్తుకు ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం పని చేసే నిపుణులను లక్ష్యంగా చేసుకుని రెగ్యులర్ ఎంఎస్ బై రీసెర్చ్ కోర్సు తరహాలోనే ఈ కొత్త కోర్సును రూపొందించారు. ప్రస్తుత ఉద్యోగులతో పాటు రెగ్యులర్ మాస్టర్స్ పార్ట్‌టైమ్‌లో చేయడానికి అవకాశం కల్పిస్తారు. సైన్స్, ఇంజనీరింగ్ డిగ్రీలో కనీసం ఒక ఏడాది టెక్ ఇండస్ట్రీ అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. కంపెనీ, ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు సంయుక్తంగా సలహా ఇచ్చే ఏడాది పొడవునా థీసిస్ ప్రాజెక్టును అనుసరించే కొన్ని కోర్సులుంటాయి. ప్రతి సెమిస్టర్‌లో కోర్సులను ఎంచుకోవాల్సి ఉంటుంది. థీసిస్ ప్రాజెక్టుతో పాటుగా మూడేళ్ల పదవీకాలంలో ట్రిపుల్‌ఐటీలో పూర్తి సమయం విద్యార్థులతో పాటు నమోదు చేసుకోవాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.